# నడుస్తున్న తెలంగాణ

ఆర్థిక, రాజకీయ, సాహిత్య మాసపత్రిక

ISSN 2349-2376

సంపుటి:14 సంచిక:7 161 july 2024

UGC CARE LISTED JOURNAL



* UGC కేర్ లిస్టులో నడుస్తున్న తెలంగాణ
* అగ్నిధార; కావ్యతత్వం
* విమర్శకుడిగా ఏనుగు నర్సింహారెడ్డి

# నడుస్తున్న తెలంగాణ

ఆర్థిక, రాజకీయ, సాహిత్య మాసపత్రిక

ISSN 2349-2376

జులై 2024
సంచిక : 7
సంపుటి : 14

UGC APPROVED JOURNAL

UGC CARE LISTED JOURNAL



గౌరవ సంపాదకులు
**ప్రొ॥ అడపా సత్యనారాయణ**

సలహామండలి
**అల్లం నారాయణ**
చైర్మన్(మాజీ)-ప్రెస్ అకాడమి
**ప్రొఫెసర్ గణేష్**
ప్రిన్సిపాల్(మాజీ), ఆర్ట్స్ కళాశాల, ఓయు.

ప్రధాన సంపాదకుడు
**ప్రొఫెసర్ చింతకింది కాశీం**

సంపాదకురాలు
**స్నేహలత ఎం.**

**సంపాదకవర్గం**

**ప్రొఫెసర్ ఎ.సిల్మానాయక్,** ప్రిన్సిపాల్, టి.ఎస్.పి. కళాశాల
**క్రాంతి,** జర్నలిస్టు
**డా॥చంద్రయ్య ఎస్.** అసిస్టెంట్ ప్రొఫెసర్(PT)
**డా॥శివరాత్రి సుధాకర్**
**ఇమ్మిడి మహేందర్** అసిస్టెంట్ ప్రొఫెసర్(PT)

డిటిపి, లే ఔట్ : స్నేహ
కవర్ డిజైన్ : క్రాంతి



రచనలు పంపవల్సిన చిరునామా
**స్నేహలత ఎం.,**
ఇంటి నెం.2-95, ఫ్లాట్ నెం. 301,
వైష్ణవి స్మార్ట్, రోడ్ నెం.2,
కాకతీయ నగర్, హబ్సిగూడ
హైదరాబాద్-500 007.
ఇ.మెయిల్: nadusthunnatelangana@gmail.com
ఫోన్ నెం.: 9290745490


## సంపాదకుని ఉత్తరం

నా కవితా వసంతం
రాలిపోయింది
ఆగిపోతుందనుకున్నాను
సింగిడి పెదాల మీద
నెలవంక మునివేళ్ల మీద
తూనీగ రెక్కల మీద
లేగదూడ గిట్టల మీద
లంద పొద్దుమీద
వేగు చుక్క పొడిచిన
సమయాన
కవిత్వం నాతో
సంవాదానికి దిగింది

27 జూలై 2024


*నూరు పూలు వికసించనీ, వేయి ఆలోచనలు సంఘర్షించనీ అన్నట్లు ప్రజానుకూలమైన భిన్న ఆలోచనలకు మా పత్రికలో చోటుంటుంది. కనుక ఈ పత్రికలో ముద్రించిన అభిప్రాయాలు రచయితలవే. సంపాదక వర్గానికి ఏకీభావం ఉండనవసరం లేదు.*

# తెలంగాణ తొవ్వ


**సంపాదకీయం**

| | | | |
|---|---|---|---|
| UGC కేర్‌లిస్ట్‌లో నడుస్తున్న తెలంగాణ | | **ప్రొఫెసర్ చింతకింది కాశీం** | 5 |

**ప్రొఫెసర్**

| | | | |
|---|---|---|---|
| అగ్నిధార; కావ్యతత్వం | | **ప్రొఫెసర్ చింతకింది కాశీం** | 6 |

**సామాజికం**

| | | | |
|---|---|---|---|
| తెలంగాణ పట్టణీకరణలో పెరుగుతున్న అసమానతలు | | **డా॥సిరిమన్ నవీన్** | 15 |

**విమర్శ**

| | | | |
|---|---|---|---|
| విమర్శకుడిగా ఏనుగు నర్సింహారెడ్డి | | **డా॥చంద్రయ్య ఎస్.** | 22 |
| పదేళ్ల "భారత్‌కు మార్క్స్-అంబేద్కర్" పాట | | **ఇమ్మిడి మహేందర్** | 30 |

**సాహిత్య పరిశోధన**

| | | | |
|---|---|---|---|
| మిట్టపల్లి సురేందర్ పాటలు-వస్తువైవిధ్యం | | **ఆవాల హరిబాబు** | 33 |
| తెలంగాణ కవిత్వ పరిశోధన | | **డా॥వి.వెంకటేశ్** | 37 |

**పుస్తక సమీక్ష**

| | | | |
|---|---|---|---|
| అసమాన్యుల చరిత్రకు దర్పణం 'ప్రణయహంపి' | | **డా॥సిద్దెంకి యాదగిరి** | 46 |

**కవిత్వం**

| | | | |
|---|---|---|---|
| అక్షరతొవ్వ | కవిత | **విను** | 45 |
| బతుకుమడి | కవిత | **పేర్ల రాము** | 50 |


**నడుస్తున్న తెలంగాణ ఆన్‌లైన్ వర్షన్ కోసం కింది పేజీలను సంప్రదించవచ్చు.**

**వెబ్ పేజీ:** https://nadustunnatelangana.com

సంపాదకీయం

# UGC కేర్‌లిస్ట్‌లో నడుస్తున్న తెలంగాణ

ప్రొఫెసర్ చింతకింది కాశీం

నడుస్తున్న తెలంగాణ మాసపత్రిక 2011లో ఆర్ఎన్ఐ(Registrar of Newspapers for India) గుర్తింపును పొందింది. 28 మే, 2014 నుంచి ISSN నంబర్‌ను కలిగివుంది. 2024 జూలైలో UGC కేర్‌లిస్ట్‌లో చోటు సంపాదించుకున్నది. గత ఇరవై మూడు సంవత్సరాల కాలంలో పత్రిక పాటించిన ప్రమాణాలకు ఇదొక గుర్తింపుగా భావిస్తున్నాము. పత్రిక నిర్వహణలో ఎన్ని ఆటంకాలు ఎదురైనా ఉత్తమ ప్రమాణాలను నెలకొల్పడంలో రాజీపడలేదు. ప్రధాన స్రవంతి పత్రికలు దృష్టి సారించని సామాజిక, రాజకీయార్థిక విషయాలను సమాజం దృష్టిలో ఉంచి సారవంతమైన చర్చకు నడుస్తున్న తెలంగాణ వేదికలా ఉండింది. పేరున్న రచయితలతో వ్యాసాలు రాయించటానికి పత్రికలన్నీ ప్రయత్నాలు చేస్తుంటాయి. కానీ నడుస్తున్న తెలంగాణ కనీసం పాతికమంది కొత్త రచయితలను తయారుచేసి ఇవాళ్టి తెలంగాణ సమాజానికి అందించిందని చెప్పటానికి గర్వపడుతున్నాం. పత్రికనే ఒక నిర్మాణంగా, భావజాల ప్రచారంగా తన ఆచరణను సాగించింది, సమాజంతో సంవాదం నడిపింది.

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం తెలంగాణ ప్రజ నినదిస్తున్న కాలంలో నడుస్తున్న తెలంగాణ జీవం పోసుకున్నది. మలిదశ తెలంగాణ ఉద్యమానికి కావలసిన భావజాల పూర్వరంగాన్ని రూపొందించి అందించింది. తెలుగు నేల మీద ఆనాటికి తెలంగాణ ఆత్మ కలిగిన పత్రిక లేదు. కోస్తా భావజాలంతో పనిచేస్తున్న మీడియా తెలంగాణ ఉద్యమం మీద అకారణ ద్వేషాన్ని ప్రకటిస్తుండేది. అలాంటి సందర్భంలో తెలంగాణ పేరు మీదనే నడుస్తున్న తెలంగాణ పత్రిక ప్రారంభమయింది. ఆ తర్వాత కొద్దికాలానికి కోట్ల రూపాయల పెట్టుబడితో నమస్తే తెలంగాణ దినపత్రిక ప్రారంభమయింది. విద్యార్థులకు, అధ్యాపకులకు, బుద్ధిజీవులకు నడుస్తున్న తెలంగాణ ఆలంబనగా ఉండి ప్రజాస్వామిక భావజాలాన్ని సమాజంలో ప్రోది చేసింది. ఉద్యమ వార్తలను రికార్డు చేసి శ్రేణులకు నూతనోత్తేజాన్ని కల్గించింది. తెలంగాణ సమాజం కోల్పోయిన గతాన్ని చర్చకు పెట్టి దేవులాటకు కావలసిన పరికరాలను రూపొందించింది. 2 జూన్ 2014 తెలంగాణకు ఒక చరిత్ర. ఆ చరిత్రలో నడుస్తున్న తెలంగాణ భాగమయింది. ఎన్నికల అనంతరం ఏర్పడిన కొత్త ప్రభుత్వానికి ప్రజా ఎజెండాను ముందుంచి చర్చనీయాంశంగా మార్చింది. నీళ్లు, నిధులు, నియామకాలు అనే నినాదాన్ని ప్రత్యేక రాష్ట్రంలో కూడా రాజీ లేకుండా ఎత్తిపట్టింది. పత్రిక ప్రజల పక్షం వహించాలనే విలువకు కట్టుబడింది.

తెలంగాణ సమాజంలో పత్రికలు ఏర్పాటు చేయడం, వాటిని నిర్వహించడం శ్రమతో కూడుకున్నపని. ఒద్దిరాజు సోదరులు నడిపిన తెలుగు పత్రిక మొదలు నీలగిరి, సుజాత, గోలకొండ పత్రిక వరకు అనేక సవాళ్లను స్వీకరించి సమాజ అవసరాన్ని తీర్చిన లెగసిని తెలంగాణ మీద పాదుకొల్పాయి. అయితే ఆయా పత్రికలను సుదీర్ఘకాలం నడపలేని పరిమితి కూడా అవి ఎదుర్కొన్నాయి. ఈ వందేళ్ల కాలంలో తెలంగాణ సమాజం అనుభవించిన పురిటి నొప్పులకు పత్రికలు సాక్ష్యంగా ఉన్నాయి. ఘనీభవించిన సమాజాన్ని కదలబార్చడానికి ఒక్కో కాలంలో ఒక్కో పత్రిక తన పాత్రను నిర్వహించింది. ఆనాటి ఏలిక కన్నెర్ర చేసినప్పుడల్లా పత్రికలు మౌనంగానైనా తమ అసమ్మతిని ప్రకటించాయి. కానీ లొంగుబాటును ప్రదర్శించలేదు. ఈ సుగుణాన్నే చరిత్ర నుంచి నేర్చుకొని నడుస్తున్న తెలంగాణ పత్రిక తన ప్రాపంచిక దృక్పథంగా స్వీకరించింది.

అక్షరంలో వ్యక్తమయిన భావజాలం సారవంతంగా ఉండాలని నడుస్తున్న తెలంగాణ కోరుకుంటుంది. అక్షరం ప్రోదిచేసే ఆలోచనలు, అది ప్రసారం చేసే జ్ఞానం పలచగా ఉండకూడదనే విలువను ఈ పత్రిక ఒక నియమంగా పెట్టుకున్నది. లోతైన అధ్యయనం ఉన్నప్పుడే అక్షరం బిగుతుగా నిర్మాణమవుతుంది. అధ్యయనం నుంచి పొందిన సంస్కారం విలువైన పరిశోధనలకు మార్గం చూపుతుంది. అలాంటి విలువైన, న్యాయమైన ప్రజాపక్షం వహించే అక్షరానికి నడుస్తున్న తెలంగాణ వేదికలా ఉంటుంది. ప్రభుత్వాలు తక్షణ అవసరంగా ఎన్నోరకాల విధానపరమైన నిర్ణయాలను చేస్తుంటాయి. కొన్ని నిర్ణయాలలో హేతుబద్ధత ఉండకపోవచ్చు; అవి భారత సంవిధాన మౌలికతను, ప్రజల ఆకాంక్షలను ప్రశ్నార్థకం చేయవచ్చు. అలాంటి సందర్భంలో మేధోరంగంలో సంవాదం నడిపేవాళ్లు తమ విలువైన పరిశోధనల ద్వారా ఆలోచనల వలన నిర్ణయాలలో, విధానాలలో ఉన్న ఉదాసీనతను సరిచేసుకునే సూచనలను అందిస్తారు. అలాంటి విలువైన పరిశోధన పత్రాలను నడుస్తున్న తెలంగాణ ఆహ్వానిస్తుంది, ప్రోత్సహిస్తుంది.

తెలంగాణ సమాజంలో తక్షణ స్పందనగా వ్యక్తమయ్యే కవిత్వానికి, ఉపన్యాసానికి కొదవలేదు. కానీ సాహిత్య విమర్శ ఇంకా ఎదగవలసే ఉంది. కథ, నవల, నాటకం విస్తరించవలసి ఉంది. ఈ పరిమితులను సమాజం గుర్తించకపోతే వందేళ్ల తర్వాత కూడా ఇలాంటి విషయాన్నే భవిష్యత్ తరాలు చర్చించుకోవచ్చు. కనుక సాహిత్య, సాంస్కృతిక రంగాలలో నిబద్ధతతో, నిమగ్నతతో ఆలోచించి అక్షరాన్ని పుటంపెట్టే వారికి ఈ పత్రిక చోటు కల్పిస్తుంది. పరిశోధన అంటే ఎత్తిరాసే, వ్యాఖ్యానించే అనే మూసపద్ధతిని విడనాడి, సమాజంలో ఎవరి చూపు ప్రసరించని విషయాల చుట్టూ ఆలోచనలను కేంద్రీకరించి 'లోనారసి' లోతును కనుక్కునే శ్రమకు పరిశోధకులు పూనుకోవాలని పత్రిక విజ్ఞప్తి చేస్తుంది.

జ్ఞానం లేని సమాజం రూపొందాలని కొందరు కోరుకుంటారు. అజ్ఞానానికి, అసత్యానికి నోరు ఎక్కువ. కొన్నిసార్లు జ్ఞానవంతులు మౌనంగా ఉండవలసివస్తుంది. అంతమాత్రాన అది వారి అపజయం కాదు, అది సమాజ పరిమితిని వ్యక్తం చేస్తుంది. రాష్ట్రంలో, దేశంలో జ్ఞానం వర్ధిల్లాలి. విశ్వవిద్యాలయాలు విశ్వజనీన జ్ఞానానికి వేదికలు కావాలి. ఆ సంకల్పంతోనే 1956లో UGC ఏర్పడింది. గడిచిన చరిత్రకు కాపలాకాసింది. పరిశోధనలో ఉత్తమ ప్రమాణాలను నెలకొల్పాలని కేర్‌లిస్ట్ అనే కొత్త పరికల్పనకు పూనుకున్నది. అందులో నడుస్తున్న తెలంగాణను భాగం చేసినందుకు కృతజ్ఞతలు తెల్పుతున్నాం.

T

# అగ్నిధార; కావ్యతత్వం

ప్రొ॥ చింతకింది కాశీం

*"కాలానికి ఒక కవి కావాలి*
*ఒక కవిత కావాలి*
*కాలం కడుపుతో ఉంది*
*శ్రీశ్రీని కన్నది"* అని శివసాగర్ రాసారు. ఈ కవితా వాక్యాలు దాశరథికి అక్షరాలా సరిపోతాయి. తెలంగాణ నేల పురిటినొప్పులు అనుభవిస్తుండిన కాలాన దాశరథికి జన్మనిచ్చింది. తెలంగాణ పాడుకునేందుకు ఒక పాట కావాలి, ఆ పాట దాశరథి నోటి నుంచి రావాలని తెలంగాణ కోరుకున్నది. యుద్ధ వ్యాకరణంలో వచ్చిన ఆ పాటను తెలంగాణ నేల ఆవాహనం చేసుకున్నది. ఫిరంగిలో ధ్వనించిన కవితాభాషను ప్రజలు ఆస్వాదించారు. నిజాం కోట మీద దాశరథి కవితా బాణాన్ని ఎక్కుపెట్టాడు. తెలంగాణ ఎల్లెడలా వ్యాపించిన భూస్వామ్య క్రౌర్యాన్ని ఆయన కవిత పలికింది. దాశరథి కవిత నిప్పులు కురిస్తే తెలంగాణ ప్రజ నిటారుగా నిలబడింది. ఆయన వసంత కాలంలో ఆమనిని ప్రియంగా ఆహ్వానిస్తే తెలంగాణ భూమి పులకరించింది. తిమిరంతో సమరానికి బయలుదేరితే ప్రజారాసులు సైన్యంగా కదిలాయి. రుద్రవీణను మీటిన వేళ యుద్ధగానానికి సిద్ధమయ్యారు. దాశరథి మహోంద్రోదయాన్ని కోరుకుంటే తెలంగాణ మౌనంగా అంగీకారాన్ని తెల్పింది. కవిపక్షం ప్రజనా ప్రజాపక్షం కవినా అనే ప్రశ్న ఉదయిస్తే అభేదాన్ని పాటించిన నేల ఇది.

దాశరథి తెలుగు నేలకు అపురూపంగా లభించిన కవి. ఆయనను తెలంగాణ సమాజం రూపొందించుకున్నది. ఈ చరిత్రతో ఆయన సంభాషణ సుదీర్ఘమయినది. దాశరథి కృష్ణమాచారి ఇంటి పేరునే నామవాచకంగా మార్చుకున్నాడు. ఖమ్మం జిల్లా చినగూడూరులో 1925 జూలై 22 అద్భుతమే జరిగింది. సంప్రదాయ కుటుంబంలో జన్మించటం వలన తండ్రి వేంకటాచార్యుల నుంచి అవసరమైన ప్రాథమిక జ్ఞానాన్ని పొందాడు. సంస్కృత భాషా సంస్కారం తండ్రి నుంచి, తెలుగు కావ్య సౌందర్యం తల్లి వేంకటమ్మ నుంచి నేర్చుకున్నాడు. కవితా చమత్కారంతో ఉన్న సంస్కృత గ్రంథాలను కంఠపాఠం గావించాడు. ఆయన కవితా సొగసుకు పునాది బాల్యంలోనే పడింది. దాశరథి స్వాభిమాన వ్యక్తిత్వం ఆయనలో తిరుగుబాటు



తత్వాన్ని ప్రోది చేసింది. ఇంగ్లీష్, ఉర్దూ, తెలుగు భాషలలో ఉన్న సాధికారిత వలన చిన్న వయసులోనే కవితా రచన వైపు మళ్లాడు. ఉర్దూ కవి గాలిబ్ కవిత్వాన్ని పాఠశాలలోనే ఆస్వాదించాడు. ఆ కవి ప్రభావానికి లోనయ్యాడు. గాలిబ్‌తో పాటు విప్లవ కవి ఇక్బాల్ ప్రభావం కూడా దాశరథికి సోకింది. మెల్లగా భావాలు, అభిప్రాయాలు ఏర్పడసాగాయి. రాజకీయాలు అర్థమయ్యాయి. నిజాం హైదరాబాద్ ప్రాంతాన్ని నిరంకుశంగా పాలిస్తున్నాడని తెలుసుకోగలిగాడు. కనుక పాఠశాలలో నిజాంను పొడిగే ప్రార్థనా గీతాన్ని పాడటానికి నిరాకరించాడు.

రాజకీయార్థిక సంబంధాలు ఎలా ఏర్పడుతున్నాయో అవలోకనం చేసుకున్నాడు. తన చుట్టూ ఉన్న ఉత్పత్తి సంబంధాలను, వాటిలో వ్యక్తమవుతున్న అసమానతలను గమనించాడు. గ్రామాలలో రైతులు, కూలీలపై జరుగుతున్న దౌర్జన్యం అనుభవంలోకి వచ్చింది. దొరల పెత్తనం, వెట్టిచాకిరి, పన్నుల భారం కళ్లారా చూసాడు. కవి హృదయం మూల్గింది. కన్నీరు కార్చింది. కవితగా మారింది.

*"నిండు కుండలు నీల్గుతున్నాయి*
*నిదుర మత్తున ఒక్కమూలన*
*ఒట్టి కుండలు దొర్లుతున్నాయి*
*ఒక్క మూలన దాహవేదన"*

1937 నాటికే దాశరథి తన కవిత్వంలో ప్రజల బాధలను వస్తువుగా స్వీకరించాడు. కవి సమ్మేళనాలు మీద ఉండే ఇష్టంతో తరుచుగా పాల్గొనేవాడు. మెట్రిక్యులేషన్ పూర్తికాగానే రాజకీయ కార్యకలాపాలలో భాగమయ్యాడు. అప్పటికే ఆంధ్రజనసంఘం, ఆంధ్ర మహాసభ, కల్గించిన సాహిత్య, సాంస్కృతిక చలనాలన్నీ దాశరథి మీద ప్రభావం వేసాయి. ఆంధ్ర మహాసభ రూపొందించిన రాజకీయ కార్యాచరణ ఆనాటి యువకులను ఆకర్షించింది. నిజాం వ్యతిరేక పోరాటం ఊరూర ప్రారంభమయింది. నిజాం రూపొందించు కున్న దోపిడి వ్యవస్థను చూసి దాశరథి కుత కుత ఉడికాడు. అదే సమయంలో రైతుల కోసం పోరాడుతున్న కమ్యూనిస్టు యువకులను చూసాడు. వారి పోరాట పటిమను ప్రత్యక్షంగా గమనించి నిజాంకు వ్యతిరేకంగా ఉద్యమించాలని నిర్ణయించుకున్నాడు. సమాజ సంపద అందరు కలిసి సమానంగా అనుభవించాలనే కమ్యూనిస్టు లక్ష్యం ఆయనకు నచ్చి, వారి సంబంధాలలోకి వెళ్లాడు. గ్రామాలలో ప్రజలతో కలిసి పనిచేసాడు. కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తగా మారాడు. నలభయో దశకం వచ్చేనాటికి పార్టీ రహస్య కార్యక్రమాలలో, నిర్మాణంలో భాగమయ్యాడు. నిజాంకు వ్యతిరేకంగా రాసిన గేయాలన్ని ఈ కాలంలోనే వచ్చాయి, కొంత శ్రీశ్రీ ప్రభావం కూడా ఉంది.

ఆంధ్ర సారస్వత పరిషత్తు సభలలో కూడా పాల్గొంటూ ఉండేవాడు. 1944లో వరంగల్‌లో జరిగిన పరిషత్తు మహాసభలను నిరోధించాలని రజాకారులు భావించారు. సభ కోసం, నిర్మాణం చేసిన పందిళ్లను రజాకారులు తగులబెట్టారు. అయినా సభలను జరపాలనే లక్ష్యంతో సురవరం ప్రతాపరెడ్డి, దేవులపల్లి రామానుజరావు, దాశరథి ఉన్నారు. ఆ సందర్భంలోనే "జ్వాలలో ఆహుతి అయిపోతాం గాని కవి సమ్మేళనం జరిపి తీరుతామని" దాశరథి ధైర్యంగా ప్రకటించాడు. దాశరథి కార్యాచరణలో మిలిటెన్సీ ప్రవేశించింది. ఒక రోజు గ్రామంలో జరిగే పార్టీ సభలో పాల్గొని వెళ్తుంటే పోలీసులు అరెస్టు చేసారు. రాత్రి పోలీస్ స్టేషన్‌లో బంధించారు. తప్పించుకొని అడవిలోకి పారిపోయాడు. అతనిపై నిఘా పెరిగింది. కొన్నాళ్ల తర్వాత పోలీసులు మళ్లీ అరెస్టుచేసారు.

కవులకు చాలా అరుదుగా ఉండే జైలు జీవితం దాశరథికి ఉంది. ఇరవై ఏళ్లకే గార్ల గ్రామంలో అతన్ని అరెస్టు చేసి 1947 సెప్టెంబర్‌లో వరంగల్ సెంట్రల్ జైలుకు పంపారు. పదహారు నెలలు శిక్ష విధించారు. 1947 డిసెంబర్‌లో వరంగల్ సెంట్రల్ జైలు నుంచి ముప్పై మంది రాజకీయ ఖైదీలతో పాటు అతన్ని నిజామాబాద్ జైలుకు మార్చారు. అక్కడ వట్టికోట ఆళ్వారుస్వామితో పరిచయం ఏర్పడింది. వట్టికోట అప్పటికే రాజకీయ ఖైదీగా శిక్షను అనుభవిస్తున్నాడు. జైలు కొత్త ప్రపంచాన్ని పరిచయం చేసింది. ఇక్కడే దాశరథికి కవిత్వం అల్లుకునే సమయం దొరికింది. 'అగ్నిధార' ఇక్కడే రూపొందింది. పోరాటం, నిర్బంధం నుంచే కళ పుడుతుందని నమ్మే దాశరథి జైలు గోడల మధ్య కవితాగానం, ఉరికంబం మీద ఊహాగానం చేసాడు.

అచ్చయిన పుస్తకాలలో మొదటిది అగ్నిధార. 1949లో సాహితీ మేఖల పక్షాన ప్రచురించారు. అగ్నిధార అనే శీర్షిక కొత్తది. నూతన ఉపమానం. అగ్ని చైతన్యానికి ప్రతీక. చైతన్యం ఒక మనిషి హృదయంలో నుంచి మరో మనిషి హృదయంలోకి ప్రవహిస్తుంది. అలా జాతినంతటిని ఒకటి చేస్తుంది. విద్యుత్ కూడా అగ్నే కదా! అది ప్రవహిస్తుంది. అలాగే అగ్నిధార. "ఈ అగ్నిధారలో ఉన్న ఖండికలు చాలా వరకు నా జైలు జీవితంలోను, జైలులో నించి వెలువడిన కొత్తలోనూ రాసినవి. నిజాం రాష్ట్రంలో ప్రభుత్వ నిరంకుశత్వం, ప్రజల అగచాట్లు, భారత స్వాతంత్ర్యం, భారత సైన్యాల ప్రవేశం, నైజాం ప్రభుత్వ పతనం–ఇవన్నీ నా రచనకు పునాదులు"(దాశరథి, దాశరథి కవిత, 1977:1) జైలులో వట్టికోట ఆళ్వారుస్వామి పరిచయం, స్నేహం దాశరథిలో రాజకీయ, సాహిత్య పరిణతిని తీసుకొచ్చాయి. దాశరథి కవిత్వమంటే వట్టికోటకు వల్లమాలిన ప్రేమ. అతని కవిత్వం వింటే ఉప్పొంగిపోయేవాడు. జైలుగోడల మీద

*"ఓ నిజాము పిశాచమా! కానరాదు*
*నిన్నుబోలిన రాజు మాకెన్నడేని*
*తీగలను తెంపి అగ్నిలో దింపినావు*
*నా తెలంగాణ కోటి రత్నాల వీణ"*

(దాశరథి కవిత, 1977:15)

దాశరథి ఈ పద్యాన్ని రాస్తే వట్టికోట ఆళ్వారుస్వామి దానిని కంఠస్థం చేసి మరో గోడ మీద రాసేవాడట. జైలు అధికారులు చెరిపివేసినప్పుడల్లా తిరిగి ప్రత్యక్షం కావడం వట్టికోట వలన సాధ్యమయ్యేది. 'రాత ముఖ్యం కాదు చేత ముఖ్యమని' వట్టికోట చెప్పిన మాటను దాశరథిని ఎంతో

ప్రభావితం చేసింది. ఈ అభిమానంతోనే దాశరథి 49 కవితలున్న అగ్నిధార అనే ఈ కావ్యాన్ని వట్టికోట ఆళ్వారుస్వామికి అంకితం ఇచ్చాడు.

ప్రతీ కావ్యానికి ఒక చారిత్రక సామాజిక నేపథ్యం ఉంటుంది. "తెలంగాణ మంతయును కుంపటిలో పడి నిప్పులలో పోయిన" సందర్భంలో దాశరథి కలం నుంచి అగ్నిధార ప్రవహించింది. సామాజిక శక్తులు పెనుగులాడుతున్న సమయాన వారి ఆరాట పోరాటాలు దాశరథి కవిత్వానికి భూమికగా ఉన్నాయి. సమాజ చలనం ఏ కవిని ప్రశాంతంగా ఉండనివ్వదు. కలవరపెడుతుంది. కల్లోల లోకాలకు తీసుకెళ్తుంది. ఇలాంటి నేపథ్యంలో భావుకత, దార్శనికత, కాల్పనికత ఉన్న కవులు సహజంగానే సమాజ విముక్తిని కోరుకుంటారు. ఏ కవికైనా కవిత రూపుకట్టాలంటే కళ్ల ముందటి భౌతిక ప్రపంచమే ఆలంబన అవుతుంది. రచయిత సమాజం పరస్పరం సంఘర్షించుకుంటే అగ్నిధార లాంటి కావ్యాలు అరుదుగా వస్తాయి. దాశరథి తెలంగాణ చారిత్రక తొలిసంధ్యలో తన గొంతును తెలంగాణకు అరువిచ్చాడు. కనుకనే ఆయనదొక ప్రత్యేక ముద్ర. జీవితాన్ని, సమాజాన్ని, ఉద్యమాన్ని రంగరించి కవిత్వంలోకి ఒంపాడు. కార్యకర్తృత్వం లేకుండా తెలంగాణలో కవులుగా, రచయితలుగా రూపొందటం అరుదుగా జరుగుతుంది. తెలంగాణ రాజకీయ సాంస్కృతిక ఉద్యమాల నుంచి రూపొందిన దాశరథి, వాటి ప్రతిఫలనంగా అగ్నిధారను పారించాడు.

ప్రపంచ వ్యాపితంగా పెట్టుబడిదారి విధానానికి వ్యతిరేకంగా కవులు కవితాయాత్ర చేస్తున్న కాలమది. ఆ ప్రభావంలో తెలుగు కవిత్వంలో అభ్యుదయ, సామ్యవాద భావాలు వీస్తున్న సందర్భమది. దాశరథి అభ్యుదయ భావాలకు ఆకర్షితుడయ్యాడు, ఆ ప్రభావం నుంచే ఆ భావాలను తెలంగాణ సమాజానికి అనువర్తింపచేసాడు. ఆధునిక కవితా గాలులు వీస్తున్న కోస్తాంధ్ర బ్రిటిష్ ఆంధ్ర. కానీ తెలంగాణలో నైజాం పాలనపట్ల ప్రజలు అసమ్మతిని ప్రకటించి సాంస్కృతిక, రాజకీయ ఉద్యమాలకు ఊపిరిపోసారు. భావ, అభ్యుదయ కవిత్వంలో రైతు అరుదుగా కన్పిస్తాడు. దాశరథి అగ్నిధారలో రైతుదే తెలంగాణమై విస్తరించాడు. సామాజిక సంబంధాలు, ఘర్షణలు, పోరాటాలు మనుషుల చైతన్యాన్ని రూపొందిస్తాయి. అట్లా రూపొందిన దాశరథి అగ్నిధార కవితలో తన సామాజిక పోరాటాలను ప్రతిబింబించాడు.

కవికి, కవితకు, కావ్యానికి ఒక తాత్త్వికత ఉంటుంది. మార్క్సిజం ప్రపంచానికి పరిచయమయ్యాక సాహిత్యాన్ని తాత్త్విక నేపథ్యం నుంచి మూల్యాంకనం చేయటమనే సంవిధానం ఏర్పడింది. కావ్యం రూపొందడానికి ఉత్పత్తి శక్తులు, ఉత్పత్తి సంబంధాల పాత్రను మినహాయించి పరిశీలించలేము. సంప్రదాయ రచయిత కూడా తనకు తెలియకుండా తన రచనలో ఉత్పత్తి సంబంధాలు, సామాజిక శక్తుల పాత్రను ప్రతిబింబిస్తారు. అయితే ఉత్పత్తి సంబంధాలు భరించరానివిగా మారినప్పుడు వర్గపోరాటం ద్వారా శ్రామిక శక్తుల విముక్తి లభిస్తుందని మార్క్సిజం బోధిస్తుంది. దీనిని సంప్రదాయ రచయితలు మాత్రం సామరస్య పరిష్కారం దిశలో నడిపిస్తారు. దాశరథి కలం పట్టిన కాలధర్మం వర్గపోరాట రాజకీయాలు విశ్వవ్యాపితమైన పరిష్కారాలను చూయిస్తున్నాయి. తెలంగాణ సమాజం వాటికి మినహాయింపుగా ఏమీలేదు. 1925 నాటికే, అంటే దాశరథి జన్మించే సమయానికే వర్గపోరాట రాజకీయాలు తెలుగు నేలను తాకి తెలంగాణలోకి ప్రవేశించాయి.

కవితాపరంగా కూడా అభ్యుదయ దృక్పథమే తాత్త్విక నేపథ్యంగా రచనలు వెలువడుతున్నాయి. ప్రేయసి, గులాబిగుత్తులు, పన్నీటి జల్లులు, వలపు తలపులు, వెన్నెల విహారాలు, తూగుటుయ్యాలలె నేటి కవితా విధులలో కానరావటం లేదని అగ్నిధార తొలిముద్రణకు రాసిన తొలిపలుకులోనే దేవులపల్లి రామానుజరావు చెప్పారు. నరజాతి చరిత్ర సమస్తం, పరపీడన పరాయణత్వం అని పలికి శ్రీశ్రీ తెలుగు కవిత్వంలో నూతన మార్గాన్ని వేసాడు. ఈ సంప్రదాయాన్ని అనుసరించిన తెలుగు కవుల్లో దాశరథి ప్రముఖుడని రామానుజరావు అభిప్రాయం. "ఆగర్భశ్రీనాధునికి, అనాధునికి మధ్య చిరకాలము నుండి జరుగుచున్న సంఘర్షయో మా దాశరథి కవితా వస్తువు"(దేవులపల్లి రామానుజరావు, దాశరథి కవిత; 1977:ix) ఆర్థిక, రాజకీయ, సాంఘిక పరిస్థితులే కారణమైన ఈ మార్పుకు ప్రతిస్పందించడం కవి ధర్మం. పెట్టుబడిదారి విధానం మీద జరుగుతున్న తిరుగుబాటే, సాహిత్యంలో కూడా జరుగుతున్నది. ఈ తిరుగుబాటే దాశరథి కవిత్వమని రామానుజరావు చెప్పారు. దున్నేవాడిదే భూమి నినాదంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నడిచింది. ఈ సిద్ధాంతానే దాశరథి కవిత్వం ప్రతిపాదించింది. ఇదే దాశరథి కవితా తాత్త్వికత.

దాశరథి అగ్నధార కవిత్వాన్ని అధ్యయన సౌలభ్యం కోసం నాలుగు రకాలుగా విభజిస్తున్నాను. ఏ కవినైనా, కావ్యాన్నైనా

అంచనా వేయాలంటే శాస్త్రీయ దృష్టి అవసరం. కావ్యాన్ని స్థూల దృష్టితో, సూక్ష్మ దృష్టితో అధ్యయనం చేయాలి. విశ్వజనీన కోణంలో, నిర్దిష్ట ప్రాతిపదికన కూడా విశ్లేషించాలి. నిర్దిష్టతను అర్థం చేసుకోవడానికే ఈ విభజన.

1. జాతీయ కవిత
2. ప్రణయ కవిత
3. శ్రామిక/రైతు కవిత
4. నిజాం వ్యతిరేక కవిత

**జాతీయ కవిత:** తెలంగాణలో నిజాం, భూస్వామ్య వ్యతిరేక పోరాటం నడిచింది. ఈ పోరాటానికి ఆంధ్రజనసంఘం విత్తనాలు నాటింది. ఆంధ్ర మహాసభ ఆ పంటకు కాపలా కాసి రైతు ముఖంలో నవ్వును చూసింది. నిజాంకు వ్యతిరేకంగా తెలుగుజాతి పోరాటం ఇక్కడ, బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా భారతజాతి పోరాటం అక్కడ. ఈ రెండింటిని దాశరథి వేరుగా చూడలేదు. నిజాం నుంచి తెలంగాణ విముక్తి జరగాలి. బ్రిటిష్ వారి నుంచి భారతదేశం విముక్తి పొందాలి. ఈ అవగాహన ఆయన కవిత్వంలో కనిపిస్తుంది. భగత్‌సింగ్ ఉరి, అల్లూరి సీతారామరాజు అమరత్వం, కొమురంభీం త్యాగం ఇలా దాశరథిలో జాతీయ భావం నెలకొనడానికి ప్రాతిపదికలుగా పనిచేసాయి. భారతీయుల త్యాగం ఆయనను ఆకర్షించింది. కవిత్వానికి స్ఫూర్తినిచ్చింది. కనుక అగ్నిధారలో మొదటి కవితా శీర్షిక 'జయభారతీ'

*"యుగయుగమ్ముల పన్నెపు పంటనీవు*
*నీ పూజకు తెచ్చినాడ నిదె*
*పొంగిన గుండియ నిండు పద్యముల్"*

(దాశరథి కవిత; 1977:13)

కవికి ప్రియురాలి మీద ప్రేమ కలిగినా, తల్లిదండ్రి మీద గౌరవం పెరిగినా, దేశమ్మీద భక్తి పెరిగినా ఏమివ్వగలడు? గుండియనిండే పద్యములు సమర్పించగలడు. దాశరథి కవిత్వాన్ని భారతమాత పూజకు పువ్వుగా తెచ్చినాడు. దాశరథి జాతీయ భావన అంతటితో తీరలేదు. కవిగా ఆయన స్ఫూర్తినిచ్చిన రవీంద్రనాథ్ టాగూర్, దేశాన్ని ఒక్కటి చేసిన గాంధీజీని స్మరిస్తూ కూడా రాసాడు. ఇవ్వాళ దేశంలో ప్రధాన రాజకీయ సమూహం గాంధీ చరిత్రను చెరిపివేయాలని ప్రయత్నం చేస్తున్నది. గాంధీ రాజకీయ విశ్వాసాల మీద, ఆచరణ మీద ఎవరికైనా భిన్నాభిప్రాయం ఉండవచ్చు, ఉండాలి కూడా. అయితే జాతీయోద్యమంలో ఆయన పాత్రను నిరాకరించలేము కదా! మతవిశ్వాసాల ప్రాతిపదికన ఆ పని చేయకూడదు. తనదైన పద్ధతులలో మనుషుల మధ్యన సామరస్యాన్ని కోరుకున్న వ్యక్తి గాంధీ. ఆ విశ్వాసాల నెపంతో ఇటీవలి కాలంలో సోషల్ మీడియా వేదికగా ఒక వర్గం ఆయన మీద అసత్యాలను ప్రచారం చేస్తూ జగుప్సాకరంగా వ్యవహరిస్తున్నది. ఈ సందర్భంలో దాశరథి రాసిన కవిత ఎంతటి సమకాలీనంగా ఉందో చూడండి.

*జెండా ఒక్కటే మూడు వన్నెలది*
*దేశం బొక్కటే భారతాఖండాసేతు హిమచలోర్వర*
*కవీట్కాండమ్ములోనన్ రవీంద్రుండొక్కడె కవీంద్రుడు*
*ఊర్జిత జగద్యుర్ధాలలో శాంతి కోదండోద్యద్విజయుండు*
*గాంధీ ఒక్కడే తల్లీ! మహాభారతీ!*

(దాశరథి కవిత; 1977:13)

**ప్రణయ కవిత:**

దాశరథి, సాహిత్యాన్ని అధ్యయనం చేసి అర్థం చేసుకునే సమయానికి భావకవిత్వం మెల్లగా సాహిత్య యవనిక నుంచి తప్పుకుంటుంది. అయినా ఆనాటి కవుల మీద భావకవిత్వం ప్రభావం ఎక్కువగా ఉండింది. 1910 నుంచి 1930 వరకు రెండు దశాబ్దాలు తెలుగు కవిత్వాన్ని కాల్పనికత ఆవహించింది. తెలుగు కవిత్వంలో ఆది నుంచి ప్రణయ భావాలు వ్యక్తమవుతున్నాయి. ప్రబంధ కవిత్వం కాలానికి శృంగారం కవిత్వంలో తారాస్థాయికి చేరింది. గురజాడ కాలానికి ప్రణయం ప్రేమగా వ్యక్తమయింది. రాయప్రోలు దానినే అమలిన శృంగారం అన్నాడు. కృష్ణశాస్త్రి కాలానికి ప్రణయంగా మారింది. ప్రకృతి–ప్రియురాలు–ప్రణయం ఈ మూడింటి మధ్య అంతస్సూత్రంగా భావకవిత కొనసాగింది. ప్రణయమంటే సంభోగ పరిణామం పొందనక్కర్లేదని, భావాత్మకమయిన స్నేహయోగంగా పరిణతమౌతే చాలని, దీనిని అమలిన శృంగారమని రాయప్రోలు ప్రతిపాదన. భావకవిత్వాన్ని ఒక స్థాయికి తీసుకొచ్చి దానికి లక్ష్యలక్షణ సమన్వితంగావించిన వ్యక్తి కృష్ణశాస్త్రి. స్వచ్ఛంద ప్రియత్వం, భగ్నప్రేమ, నిర్వేదము తన కవిత్వంలో ప్రతిఫలించాడు.

ఈ వాతావరణమొకటి తెలుగు కవిత్వంలో విహరిస్తున్న సమయంలో తెలంగాణ నేల మీద దాశరథి కలం చేతపట్టాడు. శ్రీశ్రీ అంతటివాడు ప్రారంభంలో కృష్ణశాస్త్రి ప్రభావానికి గురయ్యాడు. దాశరథి దానికి మినహాయింపేమి కాదు. నూనూగు మీసాల నూత్న యవ్వనంలో భావగీతాలు కూడా రాసాడు. అది వయస్సు సంబంధమయినది. మౌఖిక కవిత్వంలో మొదట శృంగార పాటలు వస్తాయి. యుద్ధం–శాంతి–ప్రేమ అనే భావాలు

దాశరథి కవిత్వంలో కన్పిస్తాయి. ఆయన కవిత్వంలో నిజాం నిరంకుశత్వం, ప్రజల అగచాట్లు, భారత స్వాతంత్ర్య పోరాటం, నిజాం ప్రభుత్వ పతనం ఉన్నాయి. వీటితో పాటు అంతర్వాహినిగా కొంత శృంగారం కూడా వెలువడిందని ఆయననే విశ్లేషించాడు. అంగారం, శృంగారం నీ రచనల్లో ఉంటాయని తన మిత్రుడు రాజలింగం అన్నట్లు చెప్పుకున్నాడు. "సైనికుడు యుద్ధరంగంలో పోరాడుతూ కూడా అప్పుడప్పుడూ తన ప్రియురాలి అందమైన కళ్లను తలచుకోవడం అస్వాభావికమా? కాదు"(దాశరథి, దాశరథి కవిత; 1977:2) విప్లవాన్ని బోధించే కవులు శృంగారాన్ని కూడా బోధించారని చెప్పాడు. పోలీసులను ఎదిరిస్తూ అడవుల్లో తిరుగుతున్నప్పుడూ, మంచినీళ్లు తీసుకుపోవడానికి వచ్చే పచ్చని అమ్మాయి తలపులో మెదలుతుండేదని దాశరథి భావన. కనుక దాశరథి కవిత్వంలో ప్రణయతత్వం, శృంగారం, ప్రకృతి ప్రీతి ఉన్నాయి. కాల్పనికత, వాస్తవికత మేళవించినప్పుడే మంచి సాహిత్యం వెలువడుతుంది. కనుక ప్రారంభంలో దాశరథి ప్రకృత్యారాధకుడైన భావకవిగా కన్పిస్తాడని కె.వి.రమణారెడ్డి చెప్పాడు.(సాహిత్య ప్రపంచంలో దాశరథి, 2014:194)

*"పదికావ్యమ్ముల పాటు ప్రేమమయ ది*
*వ్య స్వాంతగీతాలు ప్రా*
*సెద కాంతాధర కంపిత ప్రవచ*
*శ్రీలే ఉటంకించెదన్"*

(దాశరథి కవిత, 1977:50)

అని రాసిన దాశరథి చెక్కిళ్లపై కవిత్వాన్ని వెదజల్లించెదనని అన్నాడు. ఇంతి, వాసంతి దాశరథికి ప్రియమైన కవితా వస్తువులు. ఉషస్సులో, చంద్రోదయంలో, శరత్తులో, శిశిరంలో కవికి అతివలే కన్నులకు కడుతాయి. ప్రకృతిని కన్యగా భావించిన కవులు ఎందరో ఉన్నారు. కాని మనోహరమైన వర్ణనలతో శబ్దభావాలను అన్వయం చేసిన దాశరథి ఒక్కడేమోననే భావాన్ని కవి మనలో కల్గించాడు. ఈ కవిత చూడండి.

**"ఆకులు రాలిపోయె దెస**
**లన్నిట చీరెలు జారిపోయె న**
**గ్నీకృతయై మహాప్రకృతి**
**నేలకు మోమును వాల్చె"**

(దాశరథి కవిత, 1977)

ఆకులను ప్రకృతికి వస్త్రంగా ఊహించిన కవి, ఆకురాలు కాలంలో ప్రకృతి అనే స్త్రీ బిడియంతో తన ముఖాన్ని నేలకు వాల్చిందనే భావాన్ని పరితులలో కల్గించాడు.

## నా తెలంగాణ

**దాశరథి**

**కోటి తెలుగుల బంగారు కొండక్రింద**
**పరుచుకొన్నట్టి సరసు లోపల వసించి**
**ప్రొద్దు ప్రొద్దున అందాల పూలుపూయు**
**నా తెలంగాణ తల్లి కంజాత వల్లి**

**వేయిస్తంభాల గుడినుండి చేయిసాచి**
**ఎల్లోరా గుహలందున పల్లవించి**
**శిల్పి ఉలి ముక్కులో వికసించినట్టి**
**నా తెలంగాణ, కోటి పుణ్యాల జాణ**

**మూగవోయిన కోటి తమ్ముల గళాల**
**పాట పలికించి కవితా జవమ్ము కూర్చి**
**నా కలానకు బలమిచ్చి నడిపిచట్టి**
**నా తెలంగాణ, కోటి రత్నాల వీణ**

జైలు మనిషిని బంధించటమే కాదు, వారి సర్వశక్తులను హరించాలని చూస్తుంది. ఇనుపసంకెళ్ల మధ్య తెరలు తెరలుగా మనిషితనం ఆవిరైపోతుంది. సూర్యోదయం, సూర్యాస్తమయాల అభేదం లేని నేల ఒకటి సమాజానికి ఆవల ఉంటుంది. అది అనుభవంలోకి వస్తేనే తెలుస్తుంది. దాశరథి నిజామాబాద్ జైల్లో బందీగా ఉన్న కాలాన్ని కవి సమయం చేసాడు. బందీ అయిన మనిషి, పాడువడిన గోడలు ఈ దృశ్యం అందరి అనుభవంలో ఉంటుంది. ఆ ఖైదీ కవి అయితే పరిశీలనా దృశ్యం ప్రత్యేకంగా ఉంటుంది. ఆ జైలులో గాయపడిన పక్షులు, వాడిపోయిన పువ్వులు కవి ఆవరణలోకి వస్తాయి. వాడిపోతున్న ఆ మొగ్గలకు నీళ్లు కావాలని కవి ఆశ. కాని బండవారిన హృదయాలకు ఆ పట్టింపు ఉండదు కదా! కనుక చల్లని వాగులో చిల్లుతున్న తుంపరుల కోసం ఆశ. అక్కడ తానమాడిన కన్నె వస్త్రాలను పరిహరించి నృత్యం చేస్తుందనే ఊహ చేసాడు. జైలులో ఉండే రాజకీయ ఖైదీలు తమ గురించి, కుటుంబాల గురించి మాత్రమే కాకుండా ఒక ప్రజారాజ్యాన్ని కలగంటారు. అక్కడ బందీయైన నిరుపేద నెత్తురు చుక్కలో దాగున్న విప్లవాల సమూహం కోసం

దాశరథి వెతుకులాట. దూరమైన సతులు, సుతులు ఎందరు ఈ కనికరం లేని కాలంలో చల్లారిపోయారో!? అందుకే

*"ఇట వసంతము లేదు, సహింపరాని*
*గ్రీష్మ హేమంత కాల కాళికలెగాని*
*ఇట ఉషస్సులు లేవు భరింపరాని*
*అంబువాహ సందోహ నిశాళికాని*
*. . . . . . . . . . . . . . . . . . .*
*వెన్నెలలు లేవు, పున్నమకన్నెలేదు*
*పైడి వన్నెల నెలవంక జాడలేదు*
*చుక్కలే లేవు ఆకాశ శోకవీధి*
*ధూమధామమ్ము దు:ఖ సంగ్రామభూమి"*

(దాశరథి కవిత, 1977:27)

కవి దాశరథి నిర్బంధంలో కూడా ప్రాకృతిక సౌందర్యాన్ని ఆస్వాదించి వేడి నిట్టూర్పులతో జీవితం సాగుతున్న వారికి కాసిన్ని నీళ్లు గొంతు తడుపు కోవడానికని ఆశపడ్డాడు. అయితే కవి తన బాల్యావస్థను దాటవలసిన అనివార్యతను తెలంగాణ సమాజం నిర్దేశించింది. ప్రకృతి ప్రీతి, ప్రణయం, రసికతకు హద్దులు గీసింది కూడా తెలంగాణయే. పువ్వులు రాలిపోతుంటే పుష్ప విలాపాన్ని విన్పించవలసిందే తప్పా మేఘ సందేశాన్ని కాదు. అగ్నిశిఖగా మారిన తెలంగాణ దాశరథి కవితా దృక్పథాన్ని, తాత్వికతను రూపొందించి. ప్రజా కవిగా తీర్చిదిద్దింది. భావకవులు స్వేచ్ఛాగానాన్ని విన్పించడానికి ఏ విధంగా మార్మిక కవితా శిల్పాన్ని ఆశ్రయించారో దాశరథి నేరుగానే ప్రకృతి కవితలో స్వేచ్ఛారావాన్ని ఏ విధంగా విన్పించాడో 'జైల్లో' కవిత అద్దం పడుతుంది. అగ్నిధారలో కాల్పనికత భావకవిత్వం లాంటి అమూర్తం కాదు. అదొక వాస్తవిక చిత్రణ. తెలంగాణ ప్రజల స్వేచ్ఛా కాంక్షకు ప్రతిబింబం.

**శ్రామిక/రైతు కవిత:**

తెలుగు నేల మీద పాటకు ప్రత్యేక అస్తిత్వం ఉంది. కవిత్వంలో పాటనే అగ్రస్థానం. వచన కవిత, పద్యం ఆ తర్వాతి స్థానాలే. ప్రజానాట్యమండలి, జననాట్యమండలి అనే రెండు సాంస్కృతిక సంస్థలు పాటకు పట్టం కట్టాయి. నిజాం వ్యతిరేక రైతాంగ సాయుధ పోరాటంలో బండి యాదగిరి, సుద్దాల హనుమంతు, సుంకర పాటకవులుగా ప్రసిద్ధిపొందారు. నక్సల్బరీ రాజకీయాలలో గద్దర్ పాట కోట్ల మంది ప్రజలను చేరుకున్నది. ఒక సభ జరగాలంటే లక్షలాది మందిని సమీకరించాలి. వచ్చిన ప్రజలను కూర్చోపెట్టాలంటే పాటనే ప్రధానం. గద్దర్ పాట లేకుండా విప్లవోద్యమ సమావేశాలు ప్రారంభమై ముగిసేవి కావు. అంతటి ప్రాధాన్యత, ప్రభావం గద్దర్ పాటకు ఉండింది. అలాగే ఆంధ్ర మహాసభ, ఆంధ్ర సారస్వత పరిషత్తు సమావేశాలు ప్రారంభం కావాలంటే దాశరథి కవిత, గేయం చదవవలసినదే. కవిత్వం ప్రజలపరం అయిందంటే ఆ కాలంలో శ్రీశ్రీ, దాశరథిల కృషి మాత్రమే. కవితా రచనకు దాశరథి ఎంపిక చేసుకున్న ఇతివృత్తం శ్రమజీవులు, రైతులు కావడం వలన అంతటి ఆసక్తి, ప్రాధాన్యత ఏర్పడింది. అగ్నిధార కావ్యం బహుళ ప్రచారం పొందడానికి ఆ కవితాతత్వం, గానయోగ్యత ప్రధాన కారణాలని తెలుస్తుంది. దాశరథి గుండెలో మండిన మంట నుంచి వ్యక్తరూపాలే అగ్నిధార కవితలు. నిజాంకు తెలంగాణ సమాజానికి మధ్య జరిగిన అనంత సంగ్రామం ఈ కవితలకు ఇతివృత్తం, దేశంలో, తెలంగాణలో జరుగుతున్న రాజకీయ పోరాటానికి ప్రతిబింబమే అగ్నిధార. సాహిత్యంలో కూడా ఒక తిరుగుబాటు అవసరం వచ్చింది, అగ్నిధార ఆ అవసరాన్ని తీర్చింది.

రైతు అవిశ్రాంత జీవి. అడవులను నరికి నేలను చదును చేసి మాగాణాన్ని సృష్టించేది రైతే. నిజాం పాలనలో ఆ రైతులు నిలువు దోపిడికి గురయ్యారు. శ్రమ, నెత్తురు, కన్నీళ్లు కలిసిన ధాన్యం దొరల గడీలలో గుమ్ములు నిండుతున్న దృశ్యం చూసి రైతులు సామూహిక దు:ఖగానం చేసారు. గ్రామాల నుంచి ఎదిగివచ్చిన దాశరథి, అజ్ఞాతంలో పనిచేసిన దాశరథి రైతులతో నిత్యం సంభాషిస్తుండేవాడు. అందుకే అగ్నిధారలో మూడో కవిత రైతు మీద రాసాడు.

*"ఎముకల్ నుసిజేసి పొలాలు దున్ని భో*
*షాణములన నవాబునకు*
*స్వర్గము నింపిన రైతుదే తెలం*
*గాణము రైతుదే ముసలి*
*నక్కకు రాచరికంబు దక్కునే"*

(దాశరథి కవిత, 1977:15)

అనే ప్రశ్నను వేసాడు. బంగారు పంటలు పండించిన రైతును కాదని గోతికాడి నక్కకు దఖలుపడిన అధికారాన్ని కూలదోయాలనే సంకల్పం ఈ కవికి ఆది నుంచి ఉంది. ఈ కవితలో ఆవృతి అయిన పాదం 'రైతుదే, తెలంగాణము రైతుదే' అనే ముగింపు కవితకు మకుట వాక్యం లాంటిది, తార్కిక ముగింపు కూడా ఇదే. నిజానికి కవితను ఇక్కడితో ముగించవచ్చు. కానీ ఏదో పూర్తికాని ఉక్కపోత ఉంది. లోపల

నుంచి తన్నుకొస్తుంది. ఎక్కడో ఆయనకు అసంతృప్తి ఉంది. అందుకే అదే ఊపుతో కవితను బెబ్బిలిలా ముందు నడిపాడు. ఈ కవితను రాసి ఎనభై ఏళ్లు అవుతుంది. బహుశ కోట్లాది మంది నోళ్లల్లో గేయంగా మారింది.. గద్దర్ పాటకున్న ప్రాచుర్యం ఈ గేయానికి ఉంది. గోడలు కవిత్వాన్ని అల్లుతాయనడానికి ఈ కవిత ఒక నిదర్శనం. జైలుగోడలు, నిజామాబాద్ జిల్లా జైలుగోడలు ఈ గేయాన్ని ప్రసవించాయి. అందుకే ఆ కవితకు అంతటి పదును. నిర్బంధంలో బందీఖాన గొంతులో పూసిన గేయమిది.

కొన్ని నిర్మాణాలు చరిత్రలో జరిగిపోయాయి. ఈ కాలానికి అవి కళాత్మక కట్టడాలుగా మిగిలిపోయాయి. వాటి సౌందర్యాన్ని మనందరం ఆస్వాదిస్తాం. చార్మినార్, ఆర్ట్స్ కాలేజీ, తాజ్‌మహల్, ఎర్రకోట, పార్లమెంట్ భవనం ఇలా ఎన్నో... అందమైన ఆ దృశ్యాల వెనుక కన్నీటి చరిత్రను చదవగలిగితే గతం తాలూకు చేదు జ్ఞాపకాలు మన స్మృతిపథంలోకి వస్తాయి. తాజ్‌మహల్ ప్రపంచ వింతలో ఒకటి కావడం వలన "తాజ్‌మహల్ నిర్మాణానికి రాళ్ళెత్తిన కూలీలెవ్వరని" శ్రీశ్రీ ప్రశ్నించాడు. కానీ దాశరథి స్థానికత నుంచి వ్యక్తమవుతాడు. తెలంగాణ అనే తన నేల నుంచి ఈ ప్రపంచాన్ని చూస్తాడు. అందుకే చార్మినార్ నిర్మాణానికి మట్టిమోసిన కూలి తల్లి కోసం ఒక కవిత రాసాడు. ఆకాశ హర్మ్యాలను నిర్మించుకుంటూ శ్రమవిలువ తెలియని ధనవంతుల స్వభావం ఒకవైపు. విలయాగ్నుల పేద తల్లి మరోవైపు.

*"వ్రాసి వ్రాసి పొత్తమ్ములు మాసినా క*
*లమ్ములో సిరా యింకి, రక్తమ్ము పోసి*
*అరుణ తారుణాక్షరాల పద్యాలు మార్చి*
*ఆకలికి మాడిపోయేద నీ కొఱకయి"*

(దాశరథి కవిత, 1977:69)

దాశరథి కవిత్వంలో నిర్దిష్టత, విశ్వజనీనత ఉంటుంది. స్థానికతను ఆధారం చేసుకొని ప్రపంచాన్ని వ్యాఖ్యానిస్తాడు.

*"విశ్వవిపణి వీధుల్లో*
*చావు చాల చవకైనది*
*బతుకును బ్లాక్ మార్కెట్ ధర*
*వ్యాపారులు ప్రపంచాన్ని*
*తుంచుకొని పంచుకొని*
*పరిపాలిస్తున్నారని"*

(దాశరథి కవిత, 1977:89)

పెట్టుబడి, మార్కెట్, సరుకు స్వభావం మొదలైన ఆర్థికాంశాలను దాశరథి కవితలోకి తీసుకొచ్చాడు. పేదలు, రైతులు, కూలీలు మాత్రం ధనికుల కాళ్ల కింద నలిగిపోతున్న దృశ్యాన్ని కళ్లకు కట్టాడు. శ్రమదోపిడి గురించిన అవగాహన దాశరథికి ఉంది. అంటే మార్క్సిజానికి సంబంధించిన ప్రాథమిక జ్ఞానం ఉండటం వలన, వర్గపోరాట రాజకీయాలు తెలంగాణలో జరిగాయి కనుక ఆ ప్రభావం కూడా తన కవితలో కన్పిస్తుంది.

*"దిక్కులేని పేదవాళ్లు*
*డొక్కలలో*
*చిక్కటిల్లు ఆకలి మంటలతో"*

(దాశరథి కవిత, 1977:92)

ప్రయాణమయ్యారు. కానీ వాళ్లు ఎక్కడికి చేరుకుంటారో గమ్యం పట్ల స్పష్టత లేదు. దేశమేదైన సరే దోపిడి ఒక్కటే. లండన్, వాషింగ్టన్ ప్రపంచంలో ఏ మూలకు పోయినా శ్రామికుల దోపిడి తప్పటం లేదు. అంతర్జాతీయ దృక్పథంతో దాశరథి ఈ కవితను నిర్వహించాడు. పేదల ఎంగిలి మెతుకులను కూడా దొంగలించిన ధనికుల తీరును ఆవిష్కరించాడు. హిట్లర్, ముస్సోలిని, అట్లీ నేతలు ఎవరైనా తీరొకటే, పేదల ఓట్లతో పదవినందుకోవడం.

మార్క్సిజం వర్గపోరాటం గురించి బోధిస్తుంది. గతితార్కిక భౌతికవాదం, చారిత్రక భౌతికవాదం మార్క్సిజం అంతస్సూత్రం. సమాజంలో నిర్మాణమయ్యే ఉత్పత్తి శక్తులు, ఉత్పత్తిలో భాగంగా ఏర్పరచుకునే ఉత్పత్తి సంబంధాలు భరించరానివిగా మారినప్పుడు శ్రామికవర్గం, దోపిడి వర్గాన్ని బలవంతంగా తోసివేస్తుంది. ఇది చరిత్రలో జరిగే ఒక అనివార్య ప్రక్రియ. మార్క్సిస్టు రచయితలు దీనినే బోధిస్తారు. ప్రచారం చేస్తారు. దాశరథి ప్రారంభంలో కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తగా అజ్ఞాతంలో ఉన్నాడు. అదే విధంగా ఆంధ్ర మహాసభలో పనిచేసాడు. ఆ సందర్భంలో మార్క్సిజం మూలసూత్రాలు నేర్చుకొని ఉంటాడు. అందుకే...

*"అనాదిగా సాగుతుంది*
*అనంత సంగ్రామం*
*అనాథుడికి, ఆగర్భ*
*శ్రీనాథుడికీ మధ్య"*

(దాశరథి కవిత, 1977: 104)

కర్షకులు, కార్మికులు, మేధావులు ఐక్యంగా ఆలోచిస్తే, ప్రశ్నిస్తే పాలకుల దృష్టిలో 'తిరుగుబాటు' అవుతుంది. దోపిడి

హింసలకు వేగలేక తిరగబడితే 'అతివాదం' అవుతుంది. ఇదే చరిత్ర పొడగున సాగుతుందని దాశరథికి తెలుసు.

**నిజాం వ్యతిరేక కవిత:**

దాశరథి కవిత్వం పుట్టిందే నిజాం వ్యతిరేకత నుంచి. తెలంగాణ ప్రజల మీద అమలైన దోపిడి, అణచివేత, హింస ప్రాతిపదికగా అగ్నిధార రూపొందింది. ప్రతీ కవితలో అంతస్సారం నిజాం వ్యతిరేకత ఉంటుంది. దృగ్గోచరంలో వివిధ సామాజిక సమస్యలు కవితా వస్తువులయ్యాయి. ఫ్యూడలిజం తాలూకు లక్షణాలన్నీ మధ్య యుగాల నుంచి స్వీకరించినవే. తెలంగాణ సమాజం వందల సంవత్సరాలు కదలబారకుండా, గనీభవించి ఉండటానికి కారణం నిజాం పాలకులే. వారందరి అంతిమ రూపంగా మీర్‌ఉస్మాన్ అలీఖాన్ వ్యక్తమయ్యాడు. జాగీర్‌దార్, జమీందార్, అమీన్‌దార్, పోలీస్ పటేల్ ఈ నిర్మాణమంతా నిజాం రాజ్యాన్ని కాపాడేది. ప్రజల మీద అలవికాని పన్నులు రుద్ది బలవంతంగా వసూలు చేసేవాళ్లు. నిజాం ఖజానా ఖాళీ కాకుండా కాపలా కాస్తుండేవాళ్లు. అందుకే కవిగా దాశరథి తీవ్రంగా ప్రతిస్పందించాడు. ప్రజల నెత్తురు గడగడతాగిన రాజును పడతోస్తానని కవి ప్రతిజ్ఞ. గ్రామాలలో పెత్తందారులు స్త్రీల మానాలు దోసేవారు. వారికి నిజాం పోలీసు బలగాలు మద్దతుగా నిలబడ్డాయి.

నిజాం సొంత సైన్యం ప్రజాపోరాటాలను నిలువరించలేకపోయింది. ప్రజా తిరుగుబాటు ముందు తలవంచారు. కనుక కుట్రపూరితంగా కాసీంరజ్వీ నాయకత్వంలో రజాకార్ అనే ప్రైవేట్ సైన్యాన్ని ఏర్పాటు చేసుకొని వూళ్లు తగలపెట్టారు. ఇల్లు కూలగొట్టారు. తల్లి పిల్ల కదుపుకొట్టారు. అందుకే

*"కోటిన్నర నోటివెంట*
*పాటలుగా మాటలుగా*
*దిగిపొమ్మని దిగిపొమ్మని*
*ఇదే మాట అనేస్తాను*
*వద్దంటే గద్దె ఎక్కి*
*పెద్దరికం చేస్తావా*
*మూడు కోట్ల చేతులు నీ*
*మేదను పడతోస్తాయి"*

(దాశరథి కవిత, 1977:111)

ప్రజలే చరిత్ర నిర్మాతలని మార్క్సిజం చెబుతుంది. వీరులు పుట్టరు, తయారవుతారని భావం. కనుక ప్రజారాశులు చేసిన పోరాటం ప్రపంచ చరిత్రలో లిఖింపబడింది. హిట్లర్, నిజాం ఇద్దరి స్వభావం ఒక్కటే. కానీ వీళ్లిద్దరూ చరిత్రలో ప్రజల ముందు లొంగిపోక తప్పలేదు. బలవంతులు ఎప్పటికీ పాలకులుగా ఉంటారనే థియరీ తెలంగాణ ప్రజల సందర్భంలో ఓడిపోయింది. చలిచీమల చేతిలో ఎంతటి బలవంతులైన చిక్కుతారనేది ప్రకృతి సత్యం.

*"గెలిచినది గడ్డిపోచ ముక్కలయిపోయి*
*మన్ను కరచెను గొడ్డలి కన్నులోని*
*వేడి అశ్రువు గెలిచెను వాడి కత్తి*
*ఓడిపోయెను ముస్సి పారాడిపాయె"*

(దాశరథి కవిత,1977:79)

శీర్షిక లేని కవిత ఒక్కటి అగ్నిధారలో ఉంది. దాశరథి అంతర్జాతీయ ప్రమాణాలు కల్గిన కవి అని చెప్పడానికి ఆ కవిత ఒక్కటి చాలు. కవి ఎంత సున్నితంగా ఉంటాడో, గాయపడుతాడో, కన్నీళ్లు పెట్టుకుంటాడో, మౌనంగా దు:ఖిస్తాడో... కాలం విసిరిన కత్తులకు సమాధానంగా అగ్నిధారలు ఎలా కురిపిస్తాడో శీర్షిక లేని కవితను చదివితే తెలుస్తుంది. దాశరథి తన పంచేంద్రియాలు కేంద్రీకరించి ఈ కవితను అల్లాడనిపిస్తుంది. కవి భావన, భావజాలం, తాత్వికత, శిల్పనైపుణ్యం, వ్యక్తిత్వం... సమస్తం ఈ కవితలో వ్యక్తమవుతాయి. లోతైన భావుకతతో, ఇతివృత్తంతో కవిత నడిచింది. ఏదో ఒక కవిత కవిని నిలబెడుతాయని అంటారు కదా! అలా దాశరథి జీవితంలో పాపులారిటి పొందిన కవితలు ఎన్నో ఉన్నాయి. ప్రజాదరణ కూడా పొందాయి. కోట్లాది గొంతుల్లో మారుమ్రోగాయి. కానీ కవికి సంతృప్తినిచ్చే కవితలు కొన్నే ఉంటాయి. వాటన్నింటికి మకుటధారి ఈ శీర్షిక లేని కవిత. ప్రతీ కవితకు ఒక ఎత్తుగడ ఉన్నట్లే ఈ కవిత ఎత్తుగడ విశాలత్వంతో కూడిన లోతైన ప్రారంభం. ఎత్తుగడ ఎంత సాంద్రంగా ఉందో, అదెక్కడ సడలకుండా మిగతా పాదాలు నడిచాయి. కవిత రూపొందిన క్రమమంతా దాని ప్రారంభం, ముగింపులో ఉంటుందని అంటారు. తార్కిక ముగింపు జరిగినప్పుడే కవిత ప్రయోజనం నెరవేరుతుంది.

ఈ కవిత ఇప్పటికే విస్తృతంగా జనాదరణ పొందింది. వందలాది మంది గాయకుల గొంతులో వేలాది వేదికల మీద విన్పించారు. ఆ పాటను విన్న శ్రోతలందరూ కొద్ది సమయం తన్మయత్వం పొందుతారు. భావుకతకు లోనవుతారు. పాట వెంట నడిచిన ప్రశ్నలకు సమాధానం పొంది కార్యోన్ముఖులు అవుతారు.

*"ఆ చల్లని సముద్రగర్భం*
*దాచిన బడబానలమెంతో*
*ఆ నల్లని ఆకాశంలో*
*కానరాని భానువులెందరో?*

(దాశరథి కవిత,1977:102)

ఈ పాటలో ప్రకృతి శాస్త్రాలు, సామాజిక శాస్త్రాలు, మానవీయ శాస్త్రాలు మిలితమై ఉంటాయి. మనిషి ప్రకృతిని ఎలా దర్శించాలో పాట చెబుతుంది. మనిషి పరిణామక్రమం, చారిత్రక సత్యంగా ద్యోతకమవుతుంది. కొత్త సమాజాన్ని కలగంటుంది. అది దోపిడి లేని సమాజమే. కులమతాలు రాజకీయానికి ఆసరాగా ఉన్నప్పుడు వాటి మధ్య జరిగే విధ్వంసం గూర్చి ఆర్తి. ఈ మొత్తం పాటను టేకాఫ్ చేసిన పాదాలు మాత్రం

*"పసిపాపల నిదుర కనులలో*
*ముసిరిన భవితవ్యం యెంతో*
*గాయపడిన కవి గుండెల్లో*
*వ్రాయబడని కావ్యాలెన్నో"*

(దాశరథి కవిత,1977:103)

దాశరథి వ్యక్తిత్వమే ఆయన కవిత్వం. తెలంగాణ వ్యక్తిత్వమే దాశరథి వ్యక్తిత్వాన్ని రూపుదిద్దింది. దాశరథి కవిత్వంలో ఉండే విశిష్ట లక్షణమేమిటంటే, ఆయన జీవితం నుంచి కవిత్వం నుండి తెలంగాణను విడదీయలేము. తెలంగాణలో రాచరిక పాలనను కూలదోయడానికి కవిగా సమాజాన్ని సమాయత్తం చేసాడు. దాశరథి అభ్యుదయాన్ని కోరుకున్నాడు. పీడిత ప్రజలవాణికి తన గొంతును 'మైక్'గా అమర్చాడు. ఆచరణ, కవిత్వం కలగలిసిన మొదటితరం కవి దాశరథి. దాశరథికి సంస్కృతం, తెలుగు, ఉర్దూ భాషలు వచ్చు కనుక ఆ మూడు భాషల కవితా రహస్యం తెలిసి కొత్త కవితారీతిని ప్రతిపాదించాడు. "మంచి కవిత్వం ఏ భాషలో ఉంటే అదే నా భాష. నాకు ఉర్దూ, తెలుగూ రెండు కళ్లు. రెండు కళ్లతో అన్ని భాషలను చదవగలను"(మహాకవి దాశరథి, 2014:29) అని దాశరథి ప్రకటించాడు. దాశరథి సహజకవి. అందుకే కవిత్వంలో ప్రవాహగతి ఉంటుంది. దాశరథికి అగ్ని అంటే చాలా ఇష్టం. కనుక అగ్నిధార అతని కవితకు శీర్షిక. రుధిర సంధ్య, జ్వాలాతోరణం, ఎండలు, ఋతుషట్కము వంటి కవితా శీర్షికలు పెట్టాడు. 'అగ్ని వేడిగా, వేడి వెలుగుగా మారటం ఆయన సాహిత్య వ్యక్తిత్వ పరిణామమని' అమ్మంగి వేణుగోపాల్ అన్నారు. నన్నెచోడుడి తర్వాత కవిత్వంలో మోదుగుపువ్వుల సౌందర్యాన్ని చెప్పింది దాశరథియే.

దాశరథి కవిత్వంలో ఒక కొత్త భావాన్ని ప్రతిపాదించాడు. నా ప్రాణం ఉన్నంత వరకు రాస్తానని చెప్పడం సాధారణ విషయం. అందరూ చెప్పేదే. కాని ఆయన నా విశ్వాసములు ఆగిపోవు వరకు రాస్తానని ప్రకటించాడు. అంటే కవిత్వంలో ఆయన కోరుకున్న సమాజం ఆవిష్కరించబడే వరకు అని అర్థం. దాశరథి కవిత్వం సంస్కృత సమాసాలతో కూడినదైనా క్లిష్టంగా లేకుండా సరళంగా ఉంది. ధారగా సాగుతుంది. ఏ శబ్దాన్ని ఎక్కడ వాడాలో తెలసిన కవితాశిల్పి.

దాశరథి ఎవరికీ లొంగని వ్యక్తిత్వం. కానీ సమైక్యాంధ్రను కోరుకున్నాడు. శ్రీకాకుళ పోరాటం సందర్భంలో జలగం వెంకళరావుతో ఉన్న స్నేహం వలన భిన్నాభిప్రాయం వ్యక్తం చేసాడు. ఆంధ్రప్రదేశ్ ఆస్థాన కవిగా ఉన్నాడు. ఇవి చరిత్రలో రికార్డు కావటం వలన ఆయన వ్యక్తిత్వానికి వచ్చిన నష్టమేమి లేదు.

*"నా గీతావళి ఎంత దూరము ప్రయా*
*ణంబౌనో అందాక ఈ*
*భూగోళమ్మున అగ్గివెట్టెదను"*

(దాశరథి కవిత, 1977:80)

అనే ఆయన స్ఫూర్తి ఎప్పటికీ ఈ తరం కవులలో రాజుకోవాలని కోరుకుందాం.

**జ్ఞాపికలు:**

1. దాశరథి, దాశరథి కవిత: 1977

2. జలందర్‌రెడ్డి గంటా(సం), మహాకవి దాశరథి సాహిత్య సమాలోచన: 2014

3. జలందర్‌రెడ్డి గంటా(సం), సాహిత్య ప్రపంచంలో దాశరథి: 2014

4. నాగయ్య జి. తెలుగు సాహిత్య సమీక్ష, రెండో సంపుటం; 1985

5. సీతారాములు గుఙ్హం(సం), శివసాగర్ కవిత్వం: 2019

15 జూలై, 2024

★ రచయిత: ప్రొఫెసర్, ఓయు T

# తెలంగాణ పట్టణీకరణలో పెరుగుతున్న అసమానతలు

డా.సిరిమన్ నవీన్

**సంక్షిప్తి(Abstract):**

తెలంగాణలో వేగవంతమైన పట్టణీకరణ ద్వారా ఆర్థికవృద్ధి, మౌలిక సదుపాయాల అభివృద్ధిలో గణనీయమైన మార్పులు వచ్చాయి. అయితే, ఇది సామాజిక-ఆర్థిక అసమానతలను కూడా తీవ్రతరం చేసింది. ఈ పరిశోధనా పత్రం తాగునీరు, పారిశుధ్యం, గృహాలు, విద్య, ఆరోగ్య సంరక్షణ వంటి ప్రాథమిక సౌకర్యాల లభ్యతపై దృష్టి సారించి, పట్టణ తెలంగాణలో పెరుగుతున్న అసమానతలను పరిశీలిస్తుంది. ఈ విశ్లేషణ కొరకు 2012, 2018 NSSO డేటాను ఉపయోగించుకుంది. ఈ డేటాను ఉపయోగించడం ద్వారా వివిధ సామాజిక సమూహాలలో, ముఖ్యంగా షెడ్యూల్డ్ కులాలు(SC), షెడ్యూల్డ్ తెగలు(ST), ఇతర వెనుకబడిన తరగతులు(OBC) మధ్య జీవన పరిస్థితులలో పూర్తి వైరుధ్యాలను హైలైట్ చేస్తుంది. పట్టణ పేద జనాభాతో కాసింత అభివృద్ధి కనిపిస్తున్నప్పటికీ, తరచుగా ప్రాథమిక సౌకర్యాల రాహిత్యాన్ని ఎదుర్కొంటున్నారు. అనధికారిక స్థావరాలలో నివసిస్తున్నారని, ఫలితంగా జీవన నాణ్యత తక్కువగా ఉంటుందని పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. చివరగా ఈ పరిశోధన పత్రం సమ్మిళిత వృద్ధి సాధించానికి అవసరమైనటువంటి విధాన సిఫార్సులతో ముగుస్తుంది.

**కీలకపదాలు**

*పట్టణీకరణ, సామాజిక-ఆర్థిక అసమానతలు, ప్రాథమిక సౌకర్యాలు, ఆర్థికసరళీకరణ, జీవన ప్రమాణాలు, NSSO సర్వే, అసంఘటిత ఆర్థిక వ్యవస్థ, విద్య- ఆరోగ్య సేవలు, పాలన సవాళ్లు, పట్టణ ప్రణాళిక.*

## 1. పరిచయం

తెలంగాణలో ముఖ్యంగా హైదరాబాద్‌లో పట్టణీకరణ అనేది రెండంచుల కత్తి. ఇది ఆర్థికవృద్ధి, సాంకేతిక పురోగతి, మౌలిక సదుపాయాల అభివృద్ధిని ఉత్ప్రేరకపరిచినప్పటికీ, ఇది సామాజిక-ఆర్థిక అసమానతలను కూడా తీవ్రతరం చేసింది. తెలంగాణ పట్టణ ప్రకృతి దృశ్యం ప్రాథమిక సౌకర్యాలు, గృహాలు, విద్య, వైద్యం, ఉపాధిలో తీవ్ర అసమానతలను ప్రతిబింబిస్తుంది. ఈ వ్యాసం పట్టణ తెలంగాణలో పెరుగుతున్న అసమానతలను విమర్శనాత్మకంగా పరిశీలిస్తుంది, వాటి చారిత్రక మూలాలు, సామాజిక-ఆర్థిక కొలతలు, విధాన పరమైన చిక్కులు, మరింత సమానమైన పట్టణ భవిష్యత్తుకు సంభావ్య మార్గాలను అన్వేషిస్తుంది.

**పరిశోధన పద్ధతి, సమాచార సేకరణ (డేటా)**

ఈ పత్రం విశ్లేషణాత్మకమైన, వివరణాత్మక రూపంలో ఉంటుంది. ఇది ప్రధానంగా తెలంగాణ పట్టణ ప్రాంతంలోని ప్రజలు తాగునీరు, మరుగుదొడ్డి, డ్రైనేజీ, గృహ, విద్యుత్ సౌకర్యాల వంటి ప్రాథమిక సౌకర్యాలను పొందడంపై దృష్టి సారిస్తుంది. STATA ("Statistical software for data science") ఉపయోగించడం ద్వారా NSSO యూనిట్‌స్థాయి[1] డేటా నుండి ద్వితీయ డేటా సేకరించబడింది. ఈ పేపర్ 2012, 2018లో నేషనల్ శాంపిల్ సర్వే ఆర్గనైజేషన్ (NSSO), స్టాటిస్టిక్స్ అండ్ ప్రోగ్రామ్ ఇంప్లిమెంటేషన్ మంత్రిత్వ శాఖ ద్వారా గృహ పరిస్థితులు, సౌకర్యాలపై భారతదేశం జాతీయ నమూనా సర్వే (NSS) రెండు రౌండ్లను ఉపయోగిస్తుంది.

సెకండరీ డేటా ప్రధానంగా NSSO 69వ[1] సర్వే రౌండ్ యూనిట్-స్థాయి డేటా, 2012 - 76వ[2] సర్వే రౌండ్ యూనిట్-స్థాయి డేటా, 2018, 2020 సంవత్సరాలలో విడుదలైంది. 2012 సర్వే కోసం, 95,548 కుటుంబాల నుండి డేటా సేకరించబడింది. గ్రామీణ భారతదేశంలో 53,393, పట్టణ భారతదేశంలో 42,155, అయితే 2018లో 106,992 కుటుంబాలు సర్వే చేయబడ్డాయి. గ్రామీణ భారతదేశంలో 63,754, పట్టణ భారతదేశంలో 43,238. రెండు సర్వేలు గృహ లక్షణాలపై డేటాను సేకరించాయి, ముఖ్యంగా జీవన ప్రమాణాలు, సౌకర్యాలు, కుటుంబ సామాజిక-ఆర్థిక నేపథ్యం, నివాస యూనిట్ చుట్టూ ఉన్న సూక్ష్మ పర్యావరణం ఆధారంగా

1 Drinking Water, Sanitation, Hygiene and Housing Condition in India, NSSO, 69th round, 2012.
2 Drinking Water, Sanitation, Hygiene and Housing Condition in India, NSSO, 76th round, 2018.

ఈ డేటా సేకరించబడింది. ఈ రెండు రౌండ్ల NSSని ఉపయోగించాము, గృహాలలో అసమానతలను, కాలక్రమేణా అసమానతలో మార్పులను కుటుంబ సామాజిక హోదాలో పరిశీలించడానికి ఉపయోగించాము.



## 2. తెలంగాణ పట్టణీకరణ చారిత్రక నేపథ్యం

రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు కుతుబ్‌షాహీ రాజవంశం, నిజాం కాలం నాటి గొప్ప చరిత్ర ఉంది. ఇది దాని ఆర్థిక, సాంస్కృతిక ప్రాముఖ్యతకు పునాది వేసింది. స్వాతంత్ర్యా నంతరం, పారిశ్రామికీకరణ, విద్యాసంస్థల స్థాపన, మౌలిక సదుపాయాల అభివృద్ధితో హైదరాబాద్ అభివృద్ధి మరింత వేగవంతమైంది (ఖాన్ ఇ., ధక్వాన్ ఎం., బౌల్కల్ ఎ. కె. అండ్ ఆర్. 2022).

1990లలో భారత ఆర్థిక వ్యవస్థ సరళీకరణ విధానం ఒక ముఖ్యమైన మలుపునకు కారణమైంది. హైదరాబాద్‌ను సమాచార సాంకేతికత(IT), బయోటెక్నాలజీకి కేంద్రంగా మార్చింది(సిరిమాన్, ఎన్. 2022). ఈ ఆర్థిక విజృంభణ ఉపాధిని కోరుతూ వలసదారుల భారీ ప్రవాహాన్ని ఆకర్షించింది. ఇది పట్టణ వృద్ధికి మరింత ఊతమిచ్చింది. ఏది ఏమైనప్పటికీ, ఈ వేగవంతమైన పట్టణీకరణ అసమానతలతో కూడుకొని ఉంది. పట్టణ పేదల జీవన ప్రమాణాలను తక్కువ చేస్తూ సంపన్నులకు ఎక్కువ ప్రయోజనం చేకూరుస్తుంది (హార్వే, డి. 2012).

## 3. సామాజిక-ఆర్థిక అసమానతలు, గృహనిర్మాణం, ప్రాథమిక సౌకర్యాలు

తెలంగాణలో పట్టణ అసమానత అత్యంత స్పష్టమైన వ్యక్తీకరణలలో ఒకటి గృహనిర్మాణంలో అసమానత, ప్రాథమిక సౌకర్యాలను పొందడం. హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ బూమ్, ఐటి రంగం ద్వారా నడపబడుతున్నాయి. స్థిరాస్తి(భూములు, గృహాలు) ధరలు ఆకాశాన్నంటాయి. జనాభాలో గణనీయమైన భాగానికి గృహాలు అందుబాటులో లేవు (స్టోర్పర్, ఎమ్. 2016). నేషనల్ శాంపిల్ సర్వే ఆఫీస్ (NSSO) డేటా ప్రకారం, పట్టణ పేదలలో గణనీయమైన భాగం స్వచ్ఛమైన నీరు, పారిశుధ్యం మరియు విద్యుత్ వంటి ప్రాథమిక సౌకర్యాలకు తగిన ప్రాప్యతతో అనధికారిక ఆవాసాలలో నివసిస్తున్నారు.

2012, 2018 నుండి NSSO సర్వేలు షెడ్యూల్డ్ కులాలు (SC), షెడ్యూల్డ్ తెగలు (ST), ఇతర వెనుకబడిన కులాలు (OBC) సహా అట్టడుగు వర్గాలు అసమానంగా ప్రభావితమవుతున్నాయని వెల్లడిస్తున్నాయి. ఈ సమూహాలకు పంపు నీరు, పారిశుధ్య సౌకర్యాల యాక్సెస్ పరిమితంగా ఉంది. రవాణా, ఆరోగ్యం, మంచి నీటి సౌకర్యాల విషయంలో కొంత మెరుగుదల ఉన్నప్పటికీ, ఈ సేవల నాణ్యత, విశ్వసనీయత సరిపోకపోవడం వల్ల పట్టణ పేదల జీవన స్థితిగతులు మరింత దిగజారుతున్నాయి(NSSO) (2012), NSSO (2018).

ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (PMAY) వంటి పథకాల ద్వారా సరసమైన గృహాలను ప్రోత్సహించడానికి ప్రభుత్వం చేసిన ప్రయత్నాలు పరిమిత విజయాన్ని సాధించాయి. మునుపటి రాష్ట్ర ప్రభుత్వం కనీస సౌకర్యాలు అందించడంలో, తెలంగాణా పట్టణ పేద ప్రజల జీవన ప్రాణాలు పెంచే అంశంలో సరైన శ్రద్ధ చూపించటం లేదు అనటంలో కూడా సందేహం లేదు (గార్గ్ వి., గార్గ్ ఎస్. 2020).

## 4. ఉపాధి, అసంఘటిత ఆర్థిక వ్యవస్థ

తెలంగాణ పట్టణ కేంద్రాలలో ఉపాధి నమూనాలు సామాజిక-ఆర్థిక అసమానతలను మరింత హైలైట్ చేస్తున్నాయి. పట్టణ కార్మిక మార్కెట్, సాధారణ కార్మికులు, స్వయం ఉపాధి పొందిన వ్యక్తులు, చిన్న వ్యాపార యజమానులతో కూడిన ముఖ్యమైన అనధికారిక రంగం ద్వారా వర్గీకరించబడుతుంది. ఈ కార్మికులు తరచుగా ప్రమాదకర ఉపాధి పరిస్థితులు, తక్కువ వేతనాలు, పరిమిత సామాజిక భద్రతను ఎదుర్కొంటారు. అయితే NSSO డేటా రెగ్యులర్ వేతన కార్మికుల నిష్పత్తి తగ్గిందని, అనధికారిక ఉపాధిలో (అసంఘటిత)నిమగ్నమై ఉన్న వ్యక్తుల సంఖ్య పెరిగిందని తెలుపుతుంది NSSO (2012), NSSO(2018).

ఈ మార్పు ప్రాథమిక సౌకర్యాల లభ్యతపై తీవ్ర ప్రభావాలను కలిగి ఉంది. అనధికారిక ఆర్థిక వ్యవస్థ

కార్మికులు, సాధారణంగా తక్కువ స్థిరమైన ఆదాయాన్ని సంపాదించేవారు, నాణ్యమైన గృహాలు, సేవలను కొనుగోలు చేసే అవకాశం తక్కువ. అంతేకాకుండా, వారు తరచుగా అనధికారిక స్థావరాలలో (ఇన్ఫార్మల్ సెటిల్మెంటు) ఉంటారు, ఇక్కడ మౌలిక సదుపాయాల అభివృద్ధి వెనుకబడి ఉంటుంది, కొన్ని ప్రాంతాల్లో అయితే వాటి లభ్యత కష్టతరం అయింది. ఈ దృశ్యం అనధికారిక రంగ కార్మికుల జీవన నాణ్యతను మెరుగుపరచవలసిన అవసరాన్ని నొక్కి చెబుతుంది NSSO (2012), NSSO(2018).

**5. విద్య, ఆరోగ్య సేవలు**

విద్య, ఆరోగ్య సేవలు సామాజిక-ఆర్థిక చలనశీలత, జీవన నాణ్యతకు కీలకమైన నిర్ణయాధికారులు. తెలంగాణలో ఈ సేవలను పొందడంలో గణనీయమైన అసమానతలు ఉన్నాయి. పట్టణ ప్రాంతాలు, ముఖ్యంగా మురికివాడలు, అనధికారిక నివాసాలు, తరచుగా సరిపోని విద్యా సౌకర్యాలతో బాధపడుతున్నాయి. ఈ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలలు సాధారణంగా తక్కువ వనరులు, పేలవమైన మౌలిక సదుపాయాలు, అర్హత కలిగిన ఉపాధ్యాయుల కొరతతో ఉన్నాయి. అట్టడుగు వర్గాలకు చెందిన పిల్లలు నాణ్యమైన విద్యను, అది తెచ్చే అవకాశాలను కోల్పోతున్నందున ఈ పరిస్థితి పేదరికం చక్రాన్ని శాశ్వతం చేస్తుంది (సిరిమాన్, ఎన్. 2022).

అదేవిధంగా, ఆరోగ్య సంరక్షణ సేవలకు ప్రాప్యత అసమానంగా పంపిణీ చేయబడింది. పట్టణ పేద జనాభా తరచుగా ప్రజారోగ్య సౌకర్యాలపై ఆధారపడతారు. ఇవి తరచుగా రద్దీగా ఉంటాయి, నిధులు తక్కువగా ఉంటాయి. దీనికి విరుద్ధంగా, సంపన్న నివాసితులు ప్రైవేట్ హెల్త్‌కేర్ సేవల్ని కలిగి ఉన్నారు. ఇవి మెరుగైన నాణ్యతను అందిస్తాయి. కానీ ఇవి పేదలకు ఖరీదైనవి. కోవిడ్-19 మహమ్మారి ఈ అసమానతలను మరింత బహిర్గతం చేసింది, అట్టడుగు వర్గాలకు సరిపడా ఆరోగ్య సంరక్షణ మౌలిక సదుపాయాలు లేవు (సిరిమాన్, ఎన్. 2022).

**6. విధానం, పాలన సవాళ్లు**

తెలంగాణలో పట్టణ అసమానతలు కొనసాగడానికి కొంతవరకు విధానపరమైన, పాలనాపరమైన సవాళ్లే కారణమని చెప్పవచ్చు. పట్టణాభివృద్ధి, పేదరిక నిర్మూలన లక్ష్యంగా వివిధ ప్రభుత్వ కార్యక్రమాలు ఉన్నప్పటికీ, అమలు అంతరాలు, సంస్థాగత బలహీనతలు వాటి ప్రభావానికి ఆటంకం కలిగిస్తాయి (కెన్నెడీ ఎల్., సూద్.ఎ. (2019).

**7. పట్టణ ప్రణాళిక, అభివృద్ధి**

తెలంగాణలో పట్టణ ప్రణాళిక సామాజిక సమానత్వం కంటే ఆర్థికవృద్ధికి అనుకూలంగా ఉందని తరచుగా విమర్శించ బడింది. పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, రియల్ ఎస్టేట్ అభివృద్ధి సంపన్నులకు ప్రధానంగా ప్రయోజనం చేకూర్చగా, పట్టణ పేదల అవసరాలు పట్టించుకోలేదు. ఉదాహరణకు, హైదరాబాద్‌లోని ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్ (ITIR) అభివృద్ధి గణనీయమైన పెట్టుబడులను ఆకర్షించింది. అనేక ఉద్యోగాలను సృష్టించింది. ఇటువంటి ప్రయోజనాలు లేకపోలేదు. (కెన్నెడీ, , ఎల్. 2007) ఈ ప్రయోజనాలు అసమానంగా పంపిణీ చేయబడ్డాయి. అధిక ఆదాయ నిపుణులు అత్యధిక ప్రతిఫలాలను పొందుతున్నారు, అయితే తక్కువ-ఆదాయ కార్మికులు పెరుగుతున్న జీవన వ్యయాలను ఎదుర్కోవటానికి పోరాడుతున్నారు.

అంతేకాకుండా, పట్టణ ప్రణాళికా ప్రక్రియలు తరచుగా చేరికను కలిగి ఉండవు. అట్టడుగు వర్గాల నుండి పరిమిత భాగస్వామ్యం ఉంటుంది. ఈ మినహాయింపు ఫలితంగా పట్టణ పేదల అవసరాలు, ఆకాంక్షలను తగినంతగా పరిష్కరించని విధానాలు, ఇప్పటికే ఉన్న అసమానతలను శాశ్వతం చేస్తాయి (కెన్నెడీ, ఎల్., జెరా, ఎం ఎచ్. 2008)

**8. హౌసింగ్ పాలసీలు**

తెలంగాణలో హౌసింగ్ పాలసీలు ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (PMAY) వంటి పథకాల ద్వారా సరసమైన గృహాలను ప్రోత్సహించడంపై దృష్టి సారించాయి. ఈ కార్యక్రమాలు తక్కువ-ఆదాయ కుటుంబాలకు గృహాలను అందించడంలో కొంత విజయాన్ని సాధించినప్పటికీ, సవాళ్లు అలాగే ఉన్నాయి. పట్టణ ప్రాంతాలలో సరసమైన భూమి లభ్యత పరిమితంగా ఉంది. ఇది ఉపాధి కేంద్రాలు, అవసరమైన సేవలకు దూరంగా నగర సరిహద్దుల్లో గృహ ప్రాజెక్టుల అభివృద్ధికి దారి తీస్తుంది. ఈ ప్రాదేశిక విభజన సామాజిక-ఆర్థిక అసమానతలను మరింత తీవ్రతరం చేస్తుంది, పట్టణ పేదలకు అదనపు భారాలను సృష్టిస్తుంది (గృహనిర్మాణం, పట్టణ పేదరిక నిర్మూలన మంత్రిత్వ శాఖ, 2019).

అదనంగా, సరసమైన గృహాల పథకాలలో ప్రైవేట్ డెవలపర్‌ల ప్రమేయం అందించిన గృహాల యూనిట్ల నాణ్యత, స్థోమత గురించి ఆందోళనలను లేవనెత్తింది. లాభాపేక్షతో నడిచే ఉద్దేశ్యాలు తరచుగా నిర్మాణ నాణ్యతను, సౌకర్యాల సమృద్ధిని

రాజీ చేస్తాయి, దీని వలన లబ్ధిదారులు నాసిరకం జీవన పరిస్థితులను కలిగి ఉంటారు.

**9. సామాజిక రక్షణ, సంక్షేమ కార్యక్రమాలు**

పట్టణ అసమానతలను తగ్గించడంలో సామాజిక రక్షణ, సంక్షేమ కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయి. తెలంగాణలో ఆసరా పింఛన్లు, మాతాశిశు ఆరోగ్యానికి కేసీఆర్ కిట్, రైతులకు రైతుబంధు వంటి పథకాలు బడుగు బలహీన వర్గాలకు విలువైన సహాయాన్ని అందించాయి. అయితే, ఈ కార్యక్రమాల ప్రభావం బ్యూరోక్రాటిక్ అసమర్థత, అవినీతి, మినహాయింపు లోపాలు వంటి సమస్యల ద్వారా పరిమితం చేయబడింది (సిరిమాన్, ఎన్. 2022).

ఉదాహరణకు, సామాజిక రక్షణ పథకాలకు ప్రాప్యత తరచుగా అవసరమైన డాక్యుమెంటేషన్‌ను కలిగి ఉంటుంది. ఇది చాలా మంది పట్టణ పేదలకు లేదు. ఫలితంగా, అట్టడుగు జనాభాలో గణనీయమైన భాగం ఈ ప్రయోజనాల నుండి మినహాయించబడింది. ఇంకా, సంక్షేమ కార్యక్రమాల అమలు కొన్నిసార్లు అవినీతి, దుర్వినియోగం వల్ల దెబ్బతింటుంది, వాటి మొత్తం ప్రభావాన్ని తగ్గిస్తుంది.

**10. ప్రాదేశిక అసమానతలు, విభజన**

ప్రాదేశిక అసమానతలు, విభజన తెలంగాణలోని పట్టణ అసమానతల ప్రధాన లక్షణాలు. పట్టణ ప్రకృతి దృశ్యం సంపన్న పొరుగు ప్రాంతాలు, అనధికారిక స్థావరాల మధ్య పూర్తి వ్యత్యాసాలను కలిగి ఉంటుంది. ఇది సామాజిక-ఆర్థిక విభజనలను ప్రతిబింబిస్తుంది.

**గేటెడ్ కమ్యూనిటీలు, లగ్జరీ హౌసింగ్**

హైదరాబాద్ వంటి నగరాల్లో గేటెడ్ కమ్యూనిటీలు, లగ్జరీ హౌసింగ్ డెవలప్‌మెంట్‌ల పెరుగుదల సంపన్న నివాసితుల ప్రాదేశిక విభజనను హైలైట్ చేస్తుంది. ఈ ఎన్‌క్లేవ్‌లు ప్రైవేట్ భద్రత, వినోద సౌకర్యాలు, అంతరాయం లేని యుటిలిటీల వంటి ప్రత్యేక సౌకర్యాలను అందిస్తాయి. ఇవి ఐశ్వర్యం విభక్త పాకెట్‌లను సృష్టిస్తాయి. అటువంటి పరిణామాల విస్తరణ ఆస్తిని పెంచింది. ఆకాశాన్ని అంటుతున్న ధరలు, తక్కువ, మధ్య-ఆదాయ కుటుంబాలకు మధ్య పట్టణ ప్రాంతాలలో సరసమైన గృహాలను పొందడం కష్టతరం చేస్తుంది (సూద్, ఎ. 2015).

అనధికారిక నివాసాలు, మురికివాడలు దీనికి విరుద్ధంగా, అనధికారిక నివాసాలు, మురికివాడలు సరిపోని మౌలిక సదుపాయాలు, రద్దీ, దిగజారిన జీవన పరిస్థితులతో గుర్తించబడతాయి. ఈ ప్రాంతాల్లో స్వచ్ఛమైన నీరు, పారిశుధ్యం, సరైన విద్యుత్ వంటి ప్రాథమిక సౌకర్యాలు లేవు. నివాసితులు తరచుగా నాసిరకం పదార్థాలతో నిర్మించిన తాత్కాలిక గృహాలలో నివసిస్తున్నారు. ఇవి పర్యావరణ ప్రమాదాలకు గురవుతాయి. అనధికారిక స్థావరాలలో అట్టడుగు వర్గాల కేంద్రీకరణ సామాజిక-ఆర్థిక అసమానతలను శాశ్వతం చేస్తుంది. ఈ ప్రాంతాలలో నాణ్యమైన విద్య, ఆరోగ్య సంరక్షణ, ఉపాధి అవకాశాలకు పరిమిత ప్రాప్తి, నివాసితులను పేదరికం చక్రంలో బంధించి, వాళ్ల అభివృద్ధిని అడ్డుకుంటుంది (సూద్, ఎ.2015).

**11. లింగం(జెండర్), పట్టణ అసమానతలు**

తెలంగాణలో పట్టణ అసమానతలకు లింగ కొలతలు మరో పొరను జోడిస్తున్నాయి. పట్టణ పేద వర్గాలలోని మహిళలు, బాలికలు వారి అశక్తతను పెంచే ప్రత్యేక సవాళ్లను ఎదుర్కొంటారు.

అనధికారిక స్థావరాలలో ఉన్న మహిళలు తరచుగా అనధికారిక ఆర్థిక వ్యవస్థలో తక్కువ-చెల్లింపు, అసురక్షిత ఉద్యోగాలలో పాల్గొంటారు. పట్టణ పేద మహిళలకు ఇంటి పని, వీధి వ్యాపారం, గృహ ఆధారిత ఉత్పత్తి సాధారణ ఆదాయ వనరులు. ఈ ఉద్యోగాలు సాధారణంగా ఉద్యోగ భద్రత, సామాజిక రక్షణ లేదా చట్టపరమైన గుర్తింపును అందించవు. దీని వలన మహిళలు ఆర్థికంగా బలహీనపడతారు (రైనా, ఎం., చో,ఇ. 2024).

అంతేకాకుండా, అధికారిక ఉపాధి అవకాశాలను పొందడంలో మహిళలు గణనీయమైన అడ్డంకులను ఎదుర్కొంటున్నారు. సాంస్కృతిక నిబంధనలు, విద్య లేకపోవడం, సరిపోని పిల్లల సంరక్షణ సౌకర్యాలు అధికారిక లేబర్ మార్కెట్‌లో వారి భాగస్వామ్యాన్ని పరిమితం చేస్తాయి. పర్యవసానంగా, మహిళల ఆర్థిక సహకారాలు తరచుగా తక్కువగా అంచనా వేయబడతాయి, తక్కువగా నివేదించబడతాయి. లింగ-ఆధారిత ఆర్థిక అసమానతలను శాశ్వతం చేస్తాయి.

**12. విద్య, ఆరోగ్య సంరక్షణ లభ్యత**

పట్టణ పేదవర్గాలలోని బాలికలకు విద్యను పొందడంలో ఆర్థిక పరిమితులు, భద్రతా సమస్యలు, సాంస్కృతిక వైఖరులు వంటి అనేక కారణాల వల్ల ఆటంకం ఏర్పడుతుంది. పరిమిత వనరులు ఉన్న కుటుంబాలు బాలికల కంటే బాలుర విద్యకు

ప్రాధాన్యత ఇవ్వవచ్చు, రెండోది ఆర్థికంగా తక్కువ ప్రయోజన కరంగా ఉంటుంది. అదనంగా, పాఠశాలల్లో సరైన పారిశుధ్య సౌకర్యాలు లేకపోవటం వలన బాలికలు ఋతుస్రావం సమయంలో హాజరుకాకుండా నిరోధిస్తున్నారు. అనధికారిక స్థావరాలలో ఉన్న మహిళలకు ఆరోగ్య సంరక్షణ యాక్సెస్ కూడా పరిమితం చేయబడింది. ప్రసూతి ఆరోగ్య సేవలు, పునరుత్పత్తి ఆరోగ్య సంరక్షణ, సాధారణ వైద్య సంరక్షణ తరచుగా సరిపోవు. ఇది స్త్రీలు, పిల్లల ఆరోగ్య ఫలితాలకు దారి తీస్తుంది. సరసమైన, అందుబాటులో ఉన్న ఆరోగ్య సంరక్షణ లేకపోవడం లింగ అసమానతలను పెంచుతుంది. ఎందుకంటే మహిళలు వారి కుటుంబాల్లో ఆరోగ్య సంబంధిత భారాలను భరిస్తున్నారు (హౌసింగ్, పట్టణ పేదరిక నిర్మూలన మంత్రిత్వ శాఖ, 2019).



పట్టణ పేద మహిళలు వారి కమ్యూనిటీలలో, బహిరంగ ప్రదేశాల్లో హింస, వేధింపులను, ప్రమాదాలను ఎదుర్కొంటున్నారు. సరిపడా వీధి దీపాలు, సురక్షితమైన గృహాలు లేకపోవడం, పరిమిత పోలీసింగ్ అసురక్షిత వాతావరణాలకు దోహదం చేస్తాయి. హింస భయం మహిళల చలనశీలతను, అవకాశాలను పొందడాన్ని పరిమితం చేస్తుంది, వారి సామాజిక-ఆర్థిక అట్టడుగునకు కారణమవుతుంది. (రైనా, ఎం., చో, ఇ. 2024) .

**13. ఉదారవాద (నియో లిబరల్) విధానాల ప్రభావం**

నయా ఉదారవాద విధానాలు తెలంగాణ పట్టణ ప్రకృతి దృశ్యాన్ని రూపొందించడంలో గణనీయమైన పాత్రను పోషించాయి. తరచుగా అసమానతలను పెంచుతున్నాయి. ఈ విధానాలు మార్కెట్-ఆధారిత వృద్ధి, ప్రైవేటీకరణ, నియంత్రణ సడలింపులకు ప్రాధాన్యతనిస్తాయి, తరచుగా సామాజిక ఈక్విటీని నష్టపరుస్తాయి.

**నిత్యసేవల, కనీసవసరాల ప్రైవేటీకరణ**

నీటి సరఫరా, వ్యర్థాల నిర్వహణ, విద్యుత్ వంటి పట్టణ సేవల ప్రైవేటీకరణ యాక్సెస్, నాణ్యతలో అసమానతలకు దారితీసింది. ప్రైవేటీకరణ సామర్థ్యాన్ని మెరుగుపరచడం లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ, ఇది తరచుగా అధిక వ్యయాలను కలిగిస్తుంది, అట్టడుగు వర్గాలకు ప్రాప్యతను తగ్గిస్తుంది. ఈ సేవలను భరించలేని పట్టణ పేదలు, కనీస సౌకర్యాలను పొందడంలో ఎక్కువ కష్టాలను ఎదుర్కొంటున్నారు (హార్వే, డి. 2012).

**రియల్ ఎస్టేట్ అభివృద్ధి**

నయా ఉదారవాద విధానాలు రియల్ ఎస్టేట్ అభివృద్ధికి, పెట్టుబడులను ఆకర్షించడానికి, ఆస్తి ధరలను పెంచడానికి కూడా దోహదపడ్డాయి. ఇది తక్కువ-ఆదాయ కుటుంబాలు స్థానభ్రంశం చెందడానికి, విలాసవంతమైన గృహ నిర్మాణాల విస్తరణకు దారితీసింది. హై-ఎండ్ రియల్ ఎస్టేట్ ప్రాజెక్ట్‌లపై దృష్టి కేంద్రీకరించడం వల్ల సరసమైన గృహనిర్మాణ కార్యక్రమాల నుండి వనరులను మళ్లించారు, పట్టణ పేదలకు గృహ సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేసింది (ఏడుకొండలు, కే, 2017).

ఆర్థిక సరళీకరణపై ఉద్ఘాటన కార్మిక అనధికారికీ కరణకు దోహదపడింది. రెగ్యులేటరీ రక్షణల తగ్గింపుతో, ఎక్కువ మంది కార్మికులు సామాజిక భద్రత లేకుండా ప్రమాదకరమైన, తక్కువ-వేతన ఉద్యోగాలలో పనిచేస్తున్నారు. ఇది అధికారిక, అనధికారిక రంగ కార్మికుల మధ్య అంతరాన్ని పెంచింది, సామాజిక-ఆర్థిక అసమానతలను తీవ్రతరం చేసింది (మిశ్రా, యు. ఎస్., శుక్లా, వి. 2015).

**14. పట్టణ అసమానతలను పరిష్కరించడానికి విధాన సూచనలు:**

1. తెలంగాణలో పట్టణ అసమానతలను పరిష్కరించ డానికి, సమగ్ర పట్టణ ప్రణాళిక, లక్ష్య సామాజిక రక్షణ, అట్టడుగు వర్గాల సాధికారతతో కూడిన బహుముఖ విధానం అవసరం.

2. పట్టణ ప్రణాళిక ప్రక్రియలు తప్పనిసరిగా చేరిక మరియు భాగస్వామ్య విధానాలకు ప్రాధాన్యత ఇవ్వాలి.

ప్రణాళిక, నిర్ణయం తీసుకోవడంలో అట్టడుగు వర్గాలను నిమగ్నం చేయడం వారి అవసరాలు, ఆకాంక్షలను పరిగణనలోకి తీసుకొనడం అవసరం.

3. పాలసీలు మిశ్రమ వినియోగ అభివృద్ధి, పట్టణ కేంద్రాలలో సరసమైన గృహాలు, అనధికారిక నివాసాలలో మెరుగైన మౌలిక సదుపాయాలపై దృష్టి పెట్టాలి. మురికివాడల రెగ్యులరైజేషన్, అప్‌గ్రేడ్ చేయడం వల్ల జీవన పరిస్థితులను మెరుగుపరుస్తుంది, నివాసితులకు సురక్షితమైన పదవీకాలం అందించబడుతుంది.

4. పట్టణ అసమానతలను పరిష్కరించడానికి సామాజిక రక్షణ పథకాలను విస్తరించడం, మెరుగుపరచడం చాలా కీలకం. అట్టడుగు వర్గాలకు సామాజిక రక్షణ ప్రయోజనాలకు ప్రాప్యత ఉందని నిర్ధారించడానికి డాక్యుమెంటేషన్ అడ్డంకులను పరిష్కరించడం, పరిపాలనా సామర్థ్యాన్ని మెరుగుపరచడం అవసరం. అదనంగా, అనధికారిక రంగ కార్మికులు, మహిళలతో సహా పట్టణ పేద జనాభా నిర్దిష్ట అవసరాలను పరిష్కరించడానికి సామాజిక రక్షణ కార్యక్రమాలను రూపొందించాలి.

5. పేదరికం చక్రాన్ని విచ్ఛిన్నం చేయడానికి పట్టణ పేద వర్గాలలో నాణ్యమైన విద్య, ఆరోగ్య సంరక్షణ సేవలలో పెట్టుబడి పెట్టడం చాలా అవసరం. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, వనరులను మెరుగుపరచడం, ఉపాధ్యాయులకు శిక్షణ అందించడం, తగిన పారిశుద్ధ్య సౌకర్యాలు అందుబాటులో ఉండేలా విధానాలు దృష్టి సారించాలి.

6. అదేవిధంగా, ప్రజారోగ్య సంరక్షణ సౌకర్యాలను మెరుగుపరచడం, మాతా, పునరుత్పత్తి ఆరోగ్య సేవలను విస్తరించడం, అందరికీ అందుబాటులో ఉండే ఆరోగ్య సంరక్షణను నిర్ధారించడం వల్ల అట్టడుగు జనాభాకు ఆరోగ్య ఫలితాలను గణనీయంగా మెరుగుపరుస్తుంది.

7. పట్టణ పేద కమ్యూనిటీలలో మహిళలు ఎదుర్కొంటున్న ప్రత్యేక సవాళ్లను పరిష్కరించడానికి లింగ సమానత్వాన్ని ప్రోత్సహించడానికి ఉద్దేశించిన విధానాలు కీలకం. ఇందులో మహిళలకు వృత్తిపరమైన శిక్షణ, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను అందించడం, అధికారిక ఉపాధి అవకాశాలను మెరుగుపరచడం, సరసమైన పిల్లల సంరక్షణ సౌకర్యాల లభ్యతను నిర్ధారించడం వంటివి ఉన్నాయి.

8. అదనంగా, మెరుగైన వీధి దీపాలు, సురక్షితమైన హౌసింగ్, సమర్థవంతమైన పోలీసింగ్ వంటి మహిళల భద్రత చైతన్యాన్ని మెరుగుపరచడానికి చర్యలు లింగ-ఆధారిత దుర్బలత్వాలను తగ్గించడంలో సహాయపడతాయి.

9. అనధికారిక ఆర్థిక వ్యవస్థను గుర్తించడం మరియు నియంత్రించడం వలన అనధికారిక రంగ కార్మికుల పని పరిస్థితులు, సామాజిక భద్రత మెరుగుపడుతుంది. ఇది కార్మిక రక్షణలను పొడిగించడం, న్యాయమైన వేతనాలను నిర్ధారించడం మరియు సామాజిక భద్రతా ప్రయోజనాలకు ప్రాప్యతను అందించడం వంటివి కలిగి ఉంటుంది. అదనంగా, విధానాలు అనధికారిక సంస్థల అధికారికీకరణకు మద్దతు ఇవ్వాలి, వాటికి అవసరమైన వనరులు, వృద్ధికి మరియు వృద్ధికి మద్దతునిస్తాయి.

10. రియల్ ఎస్టేట్ అభివృద్ధి విధానాలు సరసమైన గృహాలకు ప్రాధాన్యతనివ్వాలి, తక్కువ-ఆదాయ కుటుంబాల స్థానభ్రంశం నిరోధించాలి. ఆస్తి ధరలను నియంత్రించడానికి నిబంధనలను అమలు చేయడం, కలుపుకొని జోనింగ్ పద్ధతులను ప్రోత్సహించడం, సరసమైన గృహ ప్రాజెక్టుల అభివృద్ధికి ప్రోత్సాహం అందించడం వంటివి ఇందులో ఉన్నాయి. అదనంగా, పట్టణ అభివృద్ధి ప్రాజెక్టులలో పాఠశాలలు, ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలు, బహిరంగ ప్రదేశాలు వంటి సామాజిక మౌలిక సదుపాయాలకు సంబంధించిన కేటాయింపులు ఉండేలా చూసుకోవడం ఇది. నివాసితులందరికీ జీవన నాణ్యతను మెరుగుపరుస్తుంది.

11. పట్టణ అసమానతలను పరిష్కరించడానికి సమర్థవంతమైన పాలన, జవాబుదారీ యంత్రాంగాలు అవసరం. విధాన అమలులో పారదర్శకతను మెరుగుపరచడం, బ్యూరోక్రాటిక్ అసమర్థతలను తగ్గించడం, అవినీతిని ఎదుర్కోవడం వంటివి ఇందులో ఉన్నాయి. పట్టణ అభివృద్ధిని పర్యవేక్షించడం, మూల్యాంకనం చేయడంలో పౌర సమాజ సంస్థలు, కమ్యూనిటీ సమూహాలను నిమగ్నం చేయడం. ప్రాజెక్టులు జవాబుదారీతనాన్ని పెంపొందించగలవు. పాలసీలు అట్టడుగు వర్గాలకు ప్రయోజనం చేకూర్చేలా చేస్తాయి.

## 14. ముగింపు

***పట్టణ తెలంగాణలో పెరుగుతున్న అసమానతలు సంక్లిష్టమైన, బహుముఖ సమస్య, దీనికి సమగ్రమైన, సమగ్రమైన విధానపరమైన జోక్యం అవసరం.***

ఈ అసమానతలను పరిష్కరించడానికి, సమ్మిళిత పట్టణ ప్రణాళిక, లక్ష్య సామాజిక రక్షణ, అట్టడుగు వర్గాల సాధికారత వైపు మారడం అవసరం. పట్టణ పేదల అవసరాలకు ప్రాధాన్యత

ఇవ్వడం, నాణ్యమైన విద్య, ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్య మివ్వడం, లింగ సమానత్వాన్ని ప్రోత్సహించడం, సమానమైన రియల్ ఎస్టేట్ అభివృద్ధికి భరోసా ఇవ్వడం ద్వారా తెలంగాణ మరింత న్యాయమైన, సమానమైన పట్టణ భవిష్యత్తు కోసం పని చేయవచ్చు. నిరంతర, సమ్మిళిత ప్రయత్నాల ద్వారా మాత్రమే రాష్ట్రం సామాజిక-ఆర్థిక విభజనలను తగ్గించగలదు, పట్టణీకరణ ప్రయోజనాలను దాని నివాసితులందరూ పంచుకునేలా చూసుకోవచ్చు.

**15. ఉపయుక్త గ్రంథ సూచిక**



1. Edukondalu, K. (2017). Urban regional centers growth in India-A Study in Telangana. Desh Vikas, 4(2), 167.
2. Garg, V., & Garg, S. (2020). Effect on Quality of life of slum Dwellers due to PMAY In-Situ Slum Redevelop ment. International Research Journal of Engineering and Technology.
3. Harvey, D. (2012). Rebel cities: From the right to the city to the urban revolution. Verso books.
4. Kennedy, L and Sood.A. (2019). Outsourced urban governance as a state rescaling strategy in Hyderabad, India. Cities, 85, 130-139.
5. Kennedy, L. (2007). Regional Industrial Policies Driving Peri-urban Dynamics in Hyderabad, India. Cities, 24 (2), 95-109.
6. Kennedy, L. (2007). Regional Industrial Policies Driving Peri-urban Dynamics in Hyderabad, India. Cities, 24, 95–109.
7. Kennedy, L., & Zérah, M. H. (2008). The shift to city-centric growth strategies: Perspectives from Hyderabad and Mumbai. Economic and Political Weekly, 110-117.
8. Khan, I., Zakwan, M., Pulikkal, A. K., & Lalthazula, R. (2022). Impact of unplanned urbanization on surface water quality of the twin cities of Telangana state, India. Marine Pollution Bulletin, 185, 114324.
9. Ministry of Housing & Urban Poverty Alleviation, (2008). Report on "Government Initiatives and Programme for Affordable Housing", presented in National Workshop on Pro-Poor Housing Finance New Delhi.
10. Ministry of Housing & Urban Poverty Alleviation, (2019). National Buildings Organization Report of The Technician Group on Urban Housing Shortage (TG-12) 2012-17, National Buildings Organization, Ministry of Housing & Urban Poverty Alleviation.
11. Ministry of Housing and Urban Poverty Alleviation. (2010). Guidelines for slum-free city planning. Rajiv Awas Yojana. New Delhi: Govt. of India.
12. Mishra, U. S., & Shukla, V. (2015). Provisions of basic household amenities in India: A progress report. Social change, 45(3), 421-439.
13. MoHUA (2019). Handbook of Urban Statistics 2019, Government of India.
14. NSSO. (2012). Drinking Water, Sanitation, Hygiene and Housing Condition in India, 69th round, (July 2012-December, 2012), NSS Report No. 556 (69/1.2/1).
15. NSSO. (2018). Drinking Water, Sanitation, Hygiene and Housing Condition in India, 76th round, (July 2018-December, 2018), NSS Report No. 584 (76/1.2/1).
16. Raina, M., & Cho, E. (2024, April). Contextualizing work-family experiences in India: sex, gender role perception and urbanization. In Evidence-based HRM: a Global Forum for Empirical Scholarship. Emerald Publishing Limited.
17. Siriman, N (2022). Development and socially inclusive urbanization The case of access to basic amenties in peri urban Telangana.
18. Sood, A. (2015). Industrial townships and the policy facilitation of corporate urbanisation in India. Urban Studies, 52(8), 1359-1378.
19. Storper, M. (2016). The neo-liberal city as idea and reality. Territory, Politics, Governance, 4(2), 241-263.


*రచయిత: అసిస్టెంట్ ప్రొఫెసర్,*
*స్కూల్ ఆఫ్ లిబరల్ ఆర్ట్స్ అండ్ హ్యూమానిటీస్*
*వొక్సెన్ యూనివర్సిటీ హైదరాబాదు, తెలంగాణ.*

# విమర్శకుడిగా ఏనుగు నరసింహారెడ్డి

డా.చంద్రయ్య ఎస్.

**డా.** ఏనుగు నరసింహారెడ్డి 'ఊహల వేదిక' పుస్తకాన్ని 2023లో ముద్రించారు. ఈ పేరు వినగానే చాలామంది దీన్ని కవిత్వ సంపుటి అనుకునే అవకాశాలే ఎక్కువ. కానీ ఇది కవుల ఊహల, వాటి విశ్లేషణల వేదిక. ఇది 62 వ్యాసాల సంపుటి. 'అంతరంగం' (2018), 'సమాహార' (2019) విమర్శా సంపుటాల తర్వాత వస్తోన్న మూడో విమర్శాసంపుటి. ఈ విమర్శాసంపుటిలో ఆధునిక కవిత్వం, పద్య కవిత్వం, సినిమా పాటలపై వ్యాసాలున్నాయి. కథకులుగా ప్రసిద్ధులైన కొలకలూరి ఇనాక్, అంబల్ల జనార్ధన్ మొదలైనవారు రాసిన కవితా సంపుటులపై విశ్లేషణ వ్యాసాలున్నాయి. ముఖ్యంగా ఇటీవల కవిత్వం రాసి, మొదటిసారిగా పుస్తకం ముద్రించిన వారిపై వ్యాసాలున్నాయి. 'అమ్మ' మొదలైన ప్రత్యేక 'విషయం' ఆధారంగా వ్యాసాలున్నాయి. ఇలా ఇది అనేక ప్రక్రియల, వ్యక్తుల, విభిన్న వయస్కుల కవిత్వ ఊహలపై రాసిన విశ్లేషణ వ్యాసాల సమాహారం. ఏనుగు నరసింహారెడ్డిని తులనాత్మక సాహితీవేత్తగా, విస్తృతమైన అధ్యయనశీలిగా, విమర్శకుడిగా గుర్తించటానికి కావలసిన ఎన్నో ఆకరాలను ఈ పుస్తకంనుంచి వెలికి తీయవచ్చు. విమర్శకుడిగా, అయనకున్న ప్రాపంచిక దృక్పథం, కవి, కవిత్వంపై ఆయనకు గల స్పష్టమైన వైమర్శిక అభిప్రాయాలను మూల్యాంకనం చేయడం ఈ వ్యాసాంశం.





ఆయన తన వ్యాసాల్లో అనుసరించిన విమర్శా శిల్పం తన విమర్శకు ఎట్లా ఉపబలకమవుతుందో ఈ వ్యాసం చూపిస్తుంది.

ప్రాచీనకాలంలో 'వాచక విమర్శ'(textual criticism) ఎక్కువగా ఉండేది. ఒక వాచకాన్ని పరిష్కరించడం కోసం అందుబాటులో ఉన్న ఇతర పాఠాంతరాలను పరి శీలించడం దీంట్లో ప్రధానంగా కనిపించే లక్షణం. ఇది ఎక్కువగా ఒకే భాషా పరిధిలో కనిపించినా, అప్పుడప్పుడు సంస్కృత పాఠ్యాలతో సరిపోల్చడం కూడా ఉండేది. ఆధునిక కాలంలో అందివచ్చిన విమర్శా పరికరం 'తులనాత్మ అధ్యయనం'. రూప లేదా భావసారూప్యత కలిగిన ఒకే భాష లేదా వేర్వేరు భాషాగ్రంథాలను విమర్శించడం ఈ అధ్యయనంలోని ముఖ్యాంశం. ఈ పద్ధతి మన సాహిత్య పరిధుల్ని విస్తరింపచేసుకోడానికి పనికివచ్చే గొప్ప ఉపకరణం. డా. ఏనుగు నరసింహారెడ్డి 'గుర్రం జాషువా, డిలాన్ థామస్ కవిత్వంలో బాల్యం', 'తెలుగు, హిందీ జాతీయోద్యమ గీతాల'పై చేసిన తులనాత్మక పరిశోధనలు ఆయనకు విమర్శలో కొత్త చూపును అందించాయి. సాహిత్యాన్ని తులనాత్మకంగా పరిశోధిస్తే, వచ్చే ఫలితాలు ఎలా ఉంటాయో ఏనుగు నరసింహారెడ్డికి తెలుసు. అందుకే ఆయన రాసిన ప్రతివ్యాసంలో కనిపించే సాధారణ లక్షణం తులనాత్మకత. ఇది భావనల, ప్రక్రియల, కాలాల, సాహిత్యకారుల, విభిన్న భాషల మధ్య ఇలా చాలా అంశాల్లో కనిపిస్తుంది. ఇది ఆయన విమర్శకు బలమైన చేర్పు. కొలకలూరి ఇనాక్ కవిత్వాన్ని పరామర్శిస్తూ, నాయిని సుబ్బారావు 'మాతృమూర్తి'ని గూర్చి చేసిన వలపోతను తులనాత్మకంగా ఉదాహరిస్తారు. దీనివల్ల కొలకలూరి రాసిన 'అమ్మ' కవితలోని ఆర్ద్రత పాఠకుడిపై బలమైన ముద్ర వేయడానికి దోహదపడుతుంది. "క్రొత్త మెరుంగులద్దె నొక కోమటి బిడ్డ ప్రపంచ పూజ్యుడై" పద్యంలో గర్రెపల్లి సత్యనారాయణ రాజు వాడిన (తెలంగాణ) పదగుంభన శైలిని చర్చిస్తూ "Poems are not made out of Ideas, they are made of words" అని చెప్పిన స్టీఫెన్ మల్లార్మేను ఉదహరిస్తాడు. గర్రెపల్లి వాడిన 'కోమటి బిడ్డ' పదం వ్యక్తంచేసే గాఢమైన అభినివేశాన్ని "కొల్లాయిగట్టితేనేమి మా గాంధీ కోమటై బుట్టితేనేమి" అన్న పద్యాన్ని తులనాత్మకంగా పరిశీలించి, "ఇక్కడే సీమాంధ్ర కవుల ఉపరితలానికి, తెలంగాణ పండిత కవుల గాఢవ్యక్తీకరణకు తేడా కూడా కనిపిస్తుంది" అనే నిశ్చితమైన అభిప్రాయం నరసింహారెడ్డిది.

నరసింహారెడ్డి 'అధ్యయనశీలత్వం' ఆయన తులనాత్మక పరిశీలనాదృక్కులను మరింత విశాలం చేసింది. అందుకే విస్తృతమైన అధ్యయన అవసరాన్ని గుర్తుచేస్తూ, "అధ్యయనశీలత విమర్శకుల మౌలిక లక్షణం. సాధారణ పాఠకుల్లా కాకుండా రాయడం లక్ష్యంగా చేసుకునే చదువుతారు వాళ్ళు (ఊ.వే. పుట.171) అంటాడు. ఈ అధ్యయన దృష్టి ఉంది కాబట్టే, ఆయన ప్రాచీన, ఆధునిక తెలుగులో సాహిత్యాన్నీ, హిందీ, ఇంగ్లిష్ వంటి భాషాసాహిత్యాలను విస్తృతంగా అధ్యయనం చేసాడు. తద్వారా వచ్చిన జ్ఞానాన్ని సాధికారికంగా ఉపయోగించుకొన్న విధానం ఈ పుస్తకంలోని ప్రతి వ్యాసం పట్టిచూపుతుంది. తులనాత్మకంగా తెలుగుతో అన్వయించి పరిశీలించడం ఏనుగు నరసింహారెడ్డి ప్రత్యేకత. పాఠకులకు సమగ్రమైన అవగాహన కల్పించే బాధ్యతను ఎంతో నేర్పుగా సాధించాడు నరసింహారెడ్డి. ఆయన చెప్పదల్చుకున్న అభిప్రాయానికి విస్తృత కాన్వాసును ఏర్పర్చుకోడానికి ప్రాచీన, అధునిక తెలుగు కావ్యాలనుంచీ, హిందీ, ఇంగ్లిష్ భాషలనుంచీ ఎన్నో కవితల్ని, అభిప్రాయాలను ఉటంకిస్తాడు. "ఈ విధంగా తప్ప ఇంకే విధంగానూ రాయడానికి వీలుకానిది ఉత్తమ కవిత" అని చెప్పటానికి ఎమర్సన్ ను ఉటంకిస్తాడు."Poems are not made out of Ideas, they are made of words" అని చెప్పిన స్టీఫెన్ మల్లార్మేను, Poetry is the language of imagination" అన్న హాజ్ లిట్‌ని తీసుకొస్తాడు. "నెట్ లేకుండా ఆడే లాంటెన్నిస్ వచన కవిత" అని చెప్పిన రాబర్ట్ ఫ్రాస్ట్ ను సందర్భానుసారం తాను చేసిన కవితా విమర్శకు దినుసులుగా వాడుకొన్నాడు. బాల్యాంక చేష్టల్ని చెప్పటానికి "ఆజా బచ్ పన్ ఏక్ బార్ ఫిర్" అన్న సుభద్రాకుమారీ చౌహాన్ ను గుర్తుచేస్తాడు మరోచోట. గేయాన్ని "Illusive of definition" అన్న డేవిడ్ లిండ్సేనీ తెలుగు పాఠకులకు పరిచయం చేస్తాడు. పుస్తకం ఒక మధుశాల. ఆ మధువుని ఎంతమంది తాగినా ఒడవదు అనీ "మధుర్ భావనా ఓంకా నిత్య్ బనాతా హూ.. హాలా/భర్‌తా హూ... ఉస్ మద్ సే అపనే హీ ఉర్ కా ప్యాసాప్యాలా" అని చెప్పిన హరివంశరాయ్ బచ్చన్ నరసింహారెడ్డి అధ్యయనాన్ని ప్రేరేపించిన వ్యక్తిగా గుర్తుచేసుకుంటాడు.


రూప్ కుమార్ డబ్బీకార్ కవిత్వాన్ని పరామర్శిస్తూ, ఆయన చెప్పిన Nostalgia కవిత్వాన్ని విశ్లేషిస్తాడు. ఆ సందర్భంలో ఆలీవర్ గోల్డ్ స్మిత్, తన ఊరిని తలపోస్తూ "Be it is a weakness, it deserves some praise" అన్న మాటల్ని ఉదహరిస్తాడు. తద్వారా ప్రపంచసాహిత్యంలో 'అస్తిత్వ చిత్రణ' ఒక సాధారణాంశంగా ఎలా ఉందన్న విషయాన్ని పాఠకులకు ఎరుక పరుస్తాడు. ప్రపంచ సాహిత్యంతో తల తూగగల ఊహాలు, ఆలోచనలు తెలుగుకవుల్లో కూడా ఉండటాన్ని పాఠకుడి మస్తిష్కం మీద ముద్రిస్తాడు. తద్వారా పాఠకునిలో స్వీయ భాషా సాహిత్యాలపై మరింత గౌరవాన్ని, ప్రేమను కలిగింపజేస్తాడు నరసింహారెడ్డి. ప్రణయ కవిత్వంలోని దుఃఖాన్ని చెప్పే సందర్భంలో "దుఃఖ విషమింక గళమునే దూరలేదు/నరమున్ జేరినపుడెంత నరకమౌనో'' అని చెప్పిన గాలిబ్ ను మనముందుంచుతాడు. సందర్భం డిమాండ్ చేసినప్పుడు ఏనుగు నరసింహారెడ్డి ప్రపంచ సాహిత్యంలో ఎక్కడెక్కడో ఉన్న విషయాల్ని, వాక్యాల్ని ఏరుకొచ్చి మనముందు కుప్పపోస్తాడు. ప్రస్తుత కవితను అర్థంసుసుకోడానికి టూల్స్ అందిస్తాడు. ఆ సమయంలో ఒక టీచర్‌లా కనిపిస్తాడు. "లగ్‌జా గలే, కే ఫిర్ హసీరాత్ హోనహో/షాయద్ ఫిర్ ఇస్ జనమ్ ములాఖత్ హో నహో"-రాజా మెహదీ అలీఖాన్ అన్న మాటలూ, "ఇలాంటి" వ్యక్తిత్వాల్ని చూసినప్పుడే యురిపిడిస్ చెప్పిన మాట ఒకటి బాగా గుర్తుకుతెచ్చుకుంటూ "In case of dissension, never dare to judge till you have heard the other side" అంటాడు. ఇలా తన విస్తృతమైన తన అధ్యయన శీలత్వాన్ని పాఠకులకు పంచడంలో, వారి జ్ఞానాన్ని విస్తృతపరచడంలో ఎంతో ఆనందాన్ని వెతుక్కుంటాడు ఏనుగు నరసింహారెడ్డి. ఇది ఆయనకు గల తులనాత్మక దృష్టివల్ల అలవడిందనేది నిర్వివాదం. ఇప్పటితరం పాతతరాన్నీ, పాతతరం ఇప్పటితరాన్నీ చదవడంలేదనే అభిప్రాయం వినబడుతోన్న ఈ కాలంలో నరసింహారెడ్డి ఒక ఆదర్శ విమర్శకుడిగా కనబడుతాడు.




నరసింహారెడ్డిది ప్రాయికంగా పురోగామి ప్రాపంచిక దృక్పథం. ఆర్థిక నియతివాద సిద్ధాంతాన్ని అవసరమైన సందర్భంలో అన్వయిస్తాడు. దేశీయ పరిస్థితుల సందర్భంలో కులం/మతం నిర్వహించే పాత్రనూ చర్చిస్తాడు. ఈ రకంగా

ఈయనది వర్గ, కుల దృక్పథాలు జమిలిగా సాగిన ప్రాపంచిక దృక్పథం. తెలంగాణ వ్యావసాయిక కుటుంబంనుంచి రావడం, రైతాంగ సాయుధపోరాటానికి వేదికైన నల్గొండలో పుట్టిపెరగడం మొదలైన సామాజికాంశాలు కవిగా, విమర్శకుడిగా ఆయన ఎటువైపు నిలబడాలో నిర్ణయించాయి. ఆయన సున్నితమైన మనస్తత్వం, రైతు హృదయం సహజంగానే పీడితులవైపు గొంతు వినిపించేలా చేసాయి. ఆ విలువలన్నీ ఆయన 'ఊహల వేదిక' పుస్తకంలో సందర్భానుసారం ప్రకటించాడు. ఈ పుస్తకంలో నరసింహారెడ్డి విమర్శించిన గ్రంథాలన్నీ ఎక్కువగా కొత్త వాళ్లు రాసినవే కావడం గమనార్హం. కాబట్టి తాను విమర్శ రాస్తున్న కవికి దృక్పథస్పష్టతను ఇవ్వాల్సిన విషయాన్ని బాధ్యతగా స్వీకరించాడు. అట్లాంటి ప్రతి సందర్భంలోనూ నరసింహారెడ్డి ప్రాపంచిక దృక్పథం పాఠకులకు స్పష్టమవుతోంది. ఆయన ప్రపంచీకరణ మీదా, తెలంగాణ మీదా, కళలమీదా, పెట్టుబడి దారుల దోపిడీ విధానం మీదా, కులం/మతంమీదా చాలా స్పష్టమైన దృక్పథాన్ని కలిగి ఉన్నాడని 'ఊహల వేదిక' చదివిన వారికెవరికైనా ఇట్టే తెలిసిపోతుంది. ప్రపంచీకరణ గురించి రాస్తూ, "ప్రత్యామ్నాయం చూపకుండా వృత్తుల విధ్వంసం శ్రామిక కులాలను మరింత వేదనకు గురిచేస్తున్నది (ఊ.వే.పుట.51) అంటాడు. ఆయన సోకాల్డ్ విమర్శకుల్లాగా కులాలను, కులసంస్కృతిని, కులవృత్తుల్ని కాపాడాలని బహుజనుల మీద అదనపు భారాన్ని మోపే మాటలు చెప్పడు. కవులకు వర్గస్పృహ కూడా ఉండాల్సిన అవసరముందని ఎమ్మార్పీఎస్ ఉద్యమకారుడైన యాదగిరికి సూచన చేయగలడు. 'సామాజిక సమానత'ను గురించి ఆలోచిస్తోన్న యాదగిరి కవిత్వాన్ని పరామర్శిస్తూ, "కేవలం కులస్పృహవల్ల ఇది సాధ్యపడదు. కులాలకు అతీతమైన చాలా విషయాలు పట్టించుకోవాల్సిన అవసరం ఉంది" (ఊ.వే.పుట.126) అంటాడు నరసింహారెడ్డి. వర్గపోరాటాలు, కుల ఉద్యమాలు జమిలిగా జరగాల్సిన నేటి సామాజిక అత్యవసరస్థితిని గుర్తుచేస్తాడు. నరసింహారెడ్డి పుట్టుకరీత్యా 'రెడ్డి' సామాజికవర్గమైనా సాహిత్య విమర్శకుడిగా తన ప్రాపంచిక దృక్పథాన్ని స్పష్టంగా వ్యక్తపరుస్తాడు.

ప్రాచీన కవుల దృక్పథాల గురించి చెబుతూ...వారంతా "కళ కళ కోసమని భ్రమపడి ఉంటారు. రాచరికాలు, భూస్వామ్యాలు దాటి వచ్చిన తర్వాత ఇప్పుడు ఎవరూ అలా అనుకోవడానికి అవకాశం లేదు. ఏ రాజుల దర్బారులోనో, ఏ రాణుల అంతఃపురంలోనో అణిగి ఉన్న కళను అందరికీ ఎరుక పరిచి ప్రజా మార్గం పట్టించడమే ఇప్పుడు కళాకారుల, గాయకుల, కవుల పని"(ఊ.వే.పుట.123) అనే స్పష్టమైన 'ఎరుక' కలిగిన వ్యక్తి ఏనుగు నరసింహారెడ్డి. 'పెరుమాళ్ళ ఆనంద్: తడితడిగా కవిత్వ స్పర్శ' అనే వ్యాసంలో "ఇతర మతాలవారి ఆకృత్యం ఏదైనా కనబడగానే 'మన మతం ఎంత గొప్పది చెప్పు' అనే ప్రశ్న ఏ స్వార్థపరశక్తి వేసినా, మనకు వెంటనే 'అవును' అనిపిస్తుంది. ఇదే ప్రశ్న కులానికి, భాషకు, ప్రాంతానికి, జిల్లాకు, చివరికి ఊరికీ ఊరికి మధ్య కూడా వర్తిస్తుంది. ఈ లాయల్టీని జయించడం చాలా కష్టం. భద్రజీవులైన అగ్రవర్ణాలు కానీ, సంఘర్షణమయమైన జీవితాలలో నెట్టుకొస్తున్న దళిత, బహుజనులు కానీ ఈ లాయల్టీకి అతీతంగా ఆలోచించడం అరుదు". యురిపిడస్ చెప్పిన "In case of dissension, never dare to judge till you have heard the other side' అన్నటువంటి మూలాల నుండి వచ్చే వ్యక్తి నాకు ఇష్టం. ఆయన కవిత్వం అన్న అంతే ఇష్టం" (ఊ.వే.పుట.166) అంటాడు. ముఖ్యంగా మైనారిటీ మతాల, నిమ్నకులాల విషయంలో ఈనాడు జరుగుతోన్న ఏఖముఖ దుష్ప్రచార సందర్భంలో నరసింహారెడ్డి చెప్పిన అభిప్రాయం ఎంతో విలువైనది. సాహిత్యంలో ఈ విలువల్ని ప్రోదిచేయాల్సిన తరుణం కూడా ఇది.




అదేవిధంగా "నిచ్చెనమెట్ల కులవ్యవస్థలో చాలా కులాలు తమ కింది కులాల కంటే తాము గొప్పవారమని భ్రమను కలిగి ఉండేట్లు చేయడంలో మనువాదం విజయం ఇంకా కొనసాగుతూనే ఉంది"(ఊ.వే.పుట.110) అంటాడు. భారతదేశ కులవ్యవస్థమీద, మనువాదపు ఆకృత్యాలమీద స్పష్టమైన అవగాహన నరసింహారెడ్డికి ఉంది. "జిజ్ఞాస దాహంతో ఉన్న

కవి ప్రతి వస్తువును భిన్నంగా దర్శించగలుగుతాడు. ధనవంతుల సంపత్తికి కారణం అదృష్టం కాదు, జన్మసుకృతం కాదు, తెలివితేటలు కాదు, 'దోపిడి' అని తెలుసుకోగలుగుతారు. ఎంతటి ధనవంతుడు అయితే అంతటి దోపిడీదారుడు అన్న గమనిక వస్తుంది. రాజ్యంలో వాడు గౌరవించబడుతున్నాడంటే అది 'రాజ్యస్వభావం' అని అర్థం అవుతుంది. చట్టాలు వాళ్లకు అనుగుణంగా ఉన్నాయని, చట్టాలను వాళ్లే అలా చేస్తారని తెలుస్తుంది. ఇన్ని విషయాలు తెలిసొచ్చాక కవి తను ఎటుండాలో కూడా తెలిసివస్తుంది. అప్పుడు 'కష్టజీవికి ఇరువైపులా ఉండేవాడే కవి' అన్న మహాకవి మాట మరింత స్పష్టంగా అర్థం అవుతుంది (ఊ.వే.పుట.140) అని 'కవిత్వం: గొలుసుకట్టు కవిత్వం' అనే వ్యాసంలో ప్రకటిస్తాడు. నేటి కాలపు కవిత్వాన్ని పరామర్శిస్తూ ఈ మాటలు చెప్పినా ఇది నరసింహారెడ్డి ప్రాంపంచిక దృక్పథం కూడా.

'పక్షపాత బుద్ధిలేకపోవడం', 'నిర్మోహమాటం' 'రాగ ద్వేషాలకు అతీతంగా ఉండటం' విమర్శకూ, విమర్శకుడికీ ఉండాల్సిన మౌలిక లక్షణాలు. తన స్నేహితుల కావ్యాలపై విమర్శ చేసినా, అపరిచయస్థుల కవిత్వంపై అభిప్రాయాలు రాసినా నరసింహారెడ్డి రాగద్వేషాలకు అతీతంగా స్పందిస్తాడని ఆయన 'ఊహల వేదిక'లో ఎన్నో ఆధారాలు దొరుకుతాయి. రూప్ కుమార్ డబ్బీకార్ కవిత్వాన్ని సమీక్షిస్తూ, "ఆయన కవిత్వంలో కాంక్రీట్ గా వస్తువు ఇదీ అని చెప్పగలిగిన కవితలు తక్కువే. అట్లా అని కవిని రూపవాది అనలేం. ఆయనది వ్యాఖ్యానానికి ఒదగని కవిత్వం. పూర్తి వ్యంగ్యమూ కాదు. పూర్తి వాచ్యమూ కాదు. వాస్తవికతకు అధివాస్తవికతకు కట్టిన వారధి" (ఊ.వే.పుట.67) అని నిర్మోహమాటంగా చెబుతాడు. కవులంతా అటు దేశభక్తి ఇటు ప్రణయాసక్తితో రాస్తున్న కాలంలో నిమ్నజాతి వస్తువును కవిత్వం చేయడం జాషువా చేసిన సాహసం. జాషువాది అప్పటికి ఒక ప్రయోగమే"(ఊ.వే.పుట.13) నంటాడు. కథకుడిగా పేరుగాంచిన ఇనాక్‌లో కవిని దర్శించే సాహసం చేస్తాడు. "కొలకలూరి ఇనాక్ కవిత్వంలో వాడిన పదజాలానికి సంప్రదాయత ఉన్నా కొత్త ఊహలు ఉన్నాయి అని చెప్పగలిగాడు"(ఊ.వే.పుట.31).

ఏనుగు నరసింహారెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంనుంచి పిహెచ్.డి. డిగ్రీ తీసుకొన్నారు. ముప్పై ఏళ్లుగా వివిధ విశ్వవిద్యాలయాలను, అందులో జరిగే పరిశోధనల్ని విమర్శనాత్మకంగా పరిశీలిస్తున్నాడు. ఆచార్యులుగా ఉన్నవారి సాహిత్యకృషిని బహుశా చాలా దగ్గరినుంచీ గమనిస్తుండవచ్చు. "ఆధునికులం పాల్కురికి సోమన, శ్రీనాథుడు సృజించిన రచనల్లో అందుబాటులో ఉన్నవి కూడా పూర్తిగా జీర్ణించుకోలేకపోతున్నాం" (ఊ.వే.పుట.202) అనే అభిప్రాయం ఆయనకు బలంగా ఉంది. 'దాసరి శ్రీనాథ్: అబ్బురపరిచే బహుముఖీనత' అనే వ్యాసంలో "ఇప్పటి విశ్వవిద్యాలయ ఆచార్యులు ఆదిపర్వం ఎక్సుర్టులుగా, వసుచరిత్ర విశ్లేషకులుగా జీవితకాలాన్ని లాక్కొస్తూ ఉన్నారు" (ఊ.వే.పుట.202) అనగలిగే ఒక పరిశీలన చేసాడు. ఆయన ఇలా విమర్శించడానికి కూడా కారణాలు లేకపోలేదు. విశ్వవిద్యాలయస్థాయిలో పనిచేస్తున్న అధ్యాపకులు, పరిశోధనల్లో ఉన్న విద్యార్థులు సీరియస్ గా పట్టించుకోవాల్సిన అవసరం ఉంది. ఈ విమర్శలో ఉన్న నిజానిజాలను నిగ్గుతేల్చాల్సి ఉంది.

తెలంగాణ ప్రాంతీయవిమర్శకోణంలోంచి కూడా నరసింహారెడ్డికి కొన్ని ఖచ్చితమైన అభిప్రాయాలే ఉన్నాయని పిస్తుంది. "హైదరాబాదీయులు తెలుగు, సంస్కృతాలను ప్రేమించారు. అందుకే తెలంగాణలో సంస్కృత పండితులు ఎక్కువ"(ఊ.వే.పుట.42) అంటాడు. భావ కవిత్వంలోని మౌలికతను తన కవిత్వంలో పలికించిన గర్రెపల్లి సత్యనారాయణ రాజు తెలంగాణవాడైనందుకు సరైన గుర్తింపు పొందలేదంటాడు నరసింహారెడ్డి. 'కలస్వనం' కావ్యకర్త గర్రెపల్లి, "ఏ సీమాంధ్ర కవి సరసన కూర్చోదగిన ప్రచారం పొందలేక పోయాడు. తెలంగాణ కవులను తగ్గించే వ్యూహం ఉందో లేదో కానీ తెలంగాణలోకి చొచ్చుకువచ్చే వ్యూహం ఉంది సీమాంధ్రులకు. తెలంగాణ రచయితల సంఘం ఆంధ్రప్రదేశ్ ను ఆహ్వానించింది. మహాంధ్ర సౌభాగ్యగీతం పాడింది. తెరసం విద్వాన్ విశ్వం గారి పెన్నేటి పాటను కూడా ప్రచురించింది. ఇక్కడ ఆశ్చర్యం ఏంటంటే గంగిరెద్దు, కలస్వనం, మహాంధ్రోదయం, నాగార్జునసాగరంకు వచ్చిన పేరు కన్నా పెన్నేటి పాటకు ఎక్కువ ప్రచారం వచ్చింది. అంతేకాదు ఒక్క తెలంగాణ కవి కావ్యాన్ని కూడా సీమాంధ్ర సంస్థలు ప్రచురించలేదు. అప్పటి తెలంగాణ కవులను మహాంధ్రోదయ భ్రమల్లో ముంచి, తమ సాహిత్యం ఆంధ్రకు కూడా విస్తరిస్తుందని ఒప్పించి, వాళ్లు మాత్రమే ఇటు విస్తరించారు" (ఊ.వే.పుట.46) అని నిర్మొహమాటంగా ప్రకటిస్తాడు. మరో సందర్భంలో "రెండు రాష్ట్రాలు వేరయ్యాక కూడా సాహిత్యకారుల

ధోరణి పెద్దగా మారలేదు. వాళ్ళిటు చొరబాటు ఎంత మాత్రం వదలలేదు. కానీ ఒక్క తెలంగాణ కవిని గానీ రచయితను కానీ సీమాంధ్రకు ఆహ్వానించరు" (ఊ.వే.పుట.47) అన్న నరసింహారెడ్డి మాటల్తో ఏకీభవించేవాళ్లు ఎంతమందో? అయితే దీనికి కారణం కూడా లేకపోలేదని నరసింహారెడ్డి గారి మాటల సందర్భంలో ఆలోచిస్తే అర్థమవుతోంది. ఏంటంటే, ఇంకా తెలంగాణ రాష్ట్రంలో 'విషయనిపుణుల' గుర్తింపు ఇదమిద్ధంగా జరగలేదు. ఉన్న కొద్దిపాటి సాహితీవేత్తలకు ప్రచారం అంతగా లేదు. కలిసి జీవించినకాలంలో 'అటువైపు'గా తెలంగాణవారు ఆలోచించి ఎదిగించుకోలేదు అని ఇప్పటికిప్పుడు తోస్తున్న కారణాలు. ఇప్పటికీ 'శాస్త్ర విమర్శ', 'భాష-సాంకేతికత'ను గూర్చి పనిచేస్తోన్న నిపుణులు ఆంధ్ర ప్రాంతంనుంచే ఎక్కువున్నారు. తెలంగాణాలో ఉన్న ఆ కొద్దిమందికీ పెద్దగా ప్రచారం లేదు. ఇక్కడున్న పెద్ద ఖాళీని పూరించటానికి ఇకనైనా పూనుకోవాలి.

సరిత నరేష్ రాసిన కవితా సంపుటి 'సరిత్సాగరం'పై రాసిన వ్యాసంలో 'మహిళా ఉద్యోగి' కవితను విశ్లేషిస్తూ, "64 పాదాలున్న ఈ కవిత ఇంకా సంక్షిప్తకి అవకాశం ఉన్నది. 'మహిళా ఉద్యోగి' అని కవితను శీర్షికనే ఉంచడం జరిగాక 'ఆమే ఓ మహిళా ఉద్యోగి' అనే చివరిపాదం అవసరం లేదంటాడు" (ఊ.వే.పుట.132) నరసింహారెడ్డి. సంస్కృతం, తెలుగు పదాలతో కూర్చే సమాసాల విషయంలోనూ నరసింహారెడ్డికి స్పష్టమైన అభిప్రాయాలున్నట్టు ఈ వాక్యం తెలియజేస్తుంది. 'కర్తవ్య బాట' అనే పదానికి పూర్తి తెలుగు మాట కానీ, పూర్తి సంస్కృతం మాట కానీ దొరుకుతుంది" (ఊ.వే.పుట.132) అని సూచిస్తాడు. 'అలసినా ఆదివారమైనా, తన విధికి విశ్రాంతికోరని నిత్యశ్రమయంత్రమై' అన్నమాట బాగానే ఉన్నా ఒక ప్రఖ్యాత స్త్రీవాద కవయిత్రి రాసిన 'అమ్మకు ఆదివారం' చదివి ఉంటే ఈ కవిత ఇంకా భిన్నంగా వచ్చి ఉండేది. 'అమ్మ, నాన్న, మామయ్య, నేడు నా దేశం'లాంటి కవితలు చర్విత చర్వణమైన విషయాలు. వీటిపై రాసి మెప్పించాలంటే కవయిత్రి ఊహాశక్తి ఎంతో విస్తరించాలి" (ఊ.వే.పుట.132). అంటూ సూచిస్తాడు నరసింహారెడ్డి. 'మధుకర్ వైద్యుల బొగ్గుపూలకు స్వాగతం' అనే వ్యాసంలో "మధుకర్ వైద్యుల కవిత్వంలో నవ్యత్వాన్ని తీసుకొచ్చారు. ఐటీ సంబంధ శబ్దజాలాన్ని భావోద్వేగాలను ప్రకటించడానికి వాడారు. పూర్వం ఇటువంటి ఎమోషనల్ భావాలను చెప్పవలసి వచ్చినప్పుడు 'నా భావాలు భాషాహద్దులను దాటిపోతున్నాయి', 'భాష పరిమితత్వం ఇప్పుడే బయటపడింది' అనేవారు. కవిత్వ విషయంలో ఉర్దూ కవులు 'కాగజ్ పర్ రఖ్ దియా మై ఖలేజా నికాల్ కే' అని వ్యక్తపరిచేవారు. అయితే వస్తునవ్యత, భాషానవ్యత ఏకకాలంలో సాధించగలిగినవాడు అత్యుత్తమ స్థాయి కవి. అది అంత సులభమైన పనికాదు'' (ఊ.వే.పుట.135) అంటాడు నరసింహారెడ్డి. ఇటీవలి కవిత్వంలోని భాషాప్రయోగాల్లో వచ్చిన మార్పులను నరసింహారెడ్డి గుర్తించారు. వాటి బలాన్ని అంచనా వేసారు.

నరసింహారెడ్డి ఏదైనా చెప్పదలిస్తే రాగద్వేషాలకు పోకుండా సూటిగా చెప్పుకొస్తారు. ఆయనకు పద్య లయపైన, ఛందోవైవిధ్యంమీద ఉన్న అధికారానికి ఈ అభిప్రాయం మచ్చుతునక. 'వడిచర్ల సత్యం' సృష్టించిన 'మణిపూసల' గురించి 'సాంప్రదాయానికి ఆధునిక అభివృద్ధి' పేరుతో రాసిన వ్యాసంలో ఇలా అంటారు.

"ముక్కోపి దుర్వాసముని
స్వర్గానికి పోయెముని
స్వర్గమందు దేవేంద్రుడు

ఐరావతమెక్కగ కని" అన్నారు కవి. 1, 2, 4 పాదాల ప్రాసకోసం 'ముని, ముని, కని' అని వాడారు. రెండో పాదంలో 'వచ్చెనని' ప్రాస ఇంతకంటే బాగా ఉండేదేమో. చివరిపాదంలో 'కని'కి బదులు ఇంకెన్నో ప్రాసావకాశాలు ఉన్నాయి. ఇంత పొట్టి పద్యంలో 'స్వర్గం' అనే మాట రెండుసార్లు వాడారు. స్వర్గానికి బోలెడన్ని పర్యాయపదాలున్నాయి. ఎన్ని అక్షరాలలో కావాలంటే అన్ని అక్షరాలలో. ఇలా ఎన్ని పద్యాలనైనా పునరాలోచించగలిగే అవకాశం ఉంది ఈ కావ్యంలో అని ఊర్కోకుండా పరిష్కారమార్గంగా "భాషాపరిమితిని, వ్యుత్పత్తి రాహిత్యాన్ని అధిగమించడానికి అధ్యయనం ఒకటే పరిష్కారం. కనీసం వంద కావ్యాలైన పరిశీలించకుండా ఒక కావ్యం ప్రచురించడం సాహసం అనుకునే రోజులు మళ్లీ రావాలి" (ఊ.వే.పుట.144) అని ఆకాంక్షిస్తాడు నరసింహారెడ్డి.

'రావూరి వనజ' రాసిన 'ముక్తకమాల'ను పరామర్శిస్తూ, ఆ వ్యాసానికి విపులమైన నేపథ్యాన్ని రాశాడు. 'పాల్కురికి సోమనాథుని 'వృషాధిశతకం' అంతటి బిగించిన తీగలాగా వచ్చిందంటే శతక శకలాలు అంతకుముందే ఉండి ఉంటాయి"

(ఊ.వే.పుట.163), "జాషువా కులంవల్లనో, వంశ ప్రతిష్టవల్లనో కాక, తన వాక్పటిమవల్ల గుర్తించబడ్డాడు. ఉద్యమాలవల్లనో, రాజకీయాలవల్లనో కాక, కరుణరస హృదయంవల్ల కవితాపతాకనెగురవేసాడు''(ఊ.వే.పుట.11), ప్రేమ, శృంగారంలాంటి భావనల నేపథ్యంలో రాసిన బాలకృష్ణ కవిత్వాన్ని పరామర్శిస్తూ, "ప్రణయం పాతదే కానీ ప్రేమ కొత్తది అంటాడు. గిరికలు, సత్యలు మగసృష్టి. ముద్దుపళని మగ ఊహకు వేషధారిణి. అప్పటి స్త్రీల అంతరంగం అస్సలు బయటకు రాలేదు" (ఊ.వే.పుట.152) మొదలైన అభిప్రాయాలు చెప్పినా నరసింహారెడ్డి తెలుగు విమర్శను పరిపుష్టం చేయడంకోసమేననేది సుస్పష్టం. అవును 'ముద్దుపళని' అనే స్త్రీ పేరుమీదుగా మగవారే 'రాధికాసాంత్వనం' రాసారనే ప్రచారం ఉన్నదే కదా. కాబట్టి ఆనాటి స్త్రీలు పురుషులకు భోగలాలసతను అందించే 'సరుకు'గానే చిత్రించబడ్డారు కానీ, నరసింహారెడ్డి అన్నట్టు వారి హృదయాంతరంగాల్లో ఎటువంటి అభిప్రాయాలున్నాయో చిత్రించే కావ్యం ఒక్కటైనా రాలేదనేది వాస్తవం.

నరసింహారెడ్డి విమర్శకుడిగా, అనువాదకుడిగా ఎంత ప్రసిద్ధో కవిగా అంతే ప్రసిద్ధి. ఆయన 'సమాంతార స్వప్నం' మొదలుకొని 'పూలపూలవాన' వరకు ఆరు కవితా సంపుటాలను ప్రచురించిన సీనియర్ కవి. విమర్శను చర్చిస్తున్న సందర్భంలో ఆయన రాసిన కవిత్వంగూర్చి ప్రస్తావన ఎందుకంటే, ఆయనకు 'కవి' అన్నా 'కవిత్వం' అన్నా ఎంతో మురిపెం. ముఖ్యంగా కొత్తకవుల్ని గుండెలకు హత్తుకుంటాడు. దానికి నిదర్శనం 'ఊహల వేదిక' విమర్శాగ్రంథమే. దీంట్లో అనేకమంది కవులు వేసిన మొదటి కవితా సంపుటాల పరామర్శ ఉంది. ఆ వ్యాసాల్లో అవసరమనుకున్నచోటల్లా కవి స్థానం గురించీ, కవిత్వ నిర్మాణం గురించీ తనకున్న అభిప్రాయాలను పంచుకున్నాడు. "కవిత్వాన్ని జీవితంలో అవిభాజ్యం చేసుకోవడం మాత్రం సులభం కాదు. కవిత్వంతో కలిసి జీవించడం అసిధార. నిజమైన కవికెప్పుడు సగం నిద్రే అన్న మాట నిజం" (ఊ.వే.పుట.48). కవిత్వం రాయడంలో కొందరికున్న ఉద్దేశాలను ఇలా చెబుతాడు. "కొందరు వ్యవస్థల్ని నిందించే స్వేచ్ఛ ఉందని కవిత్వాన్ని మోహిస్తారు. ధిక్కారస్వరం అందివస్తుందని కొందరు ఆవేశంతో కవిత్వాన్ని శ్వాసిస్తారు. ఇంకా కొందరు రాజ్యాన్ని మచ్చికచేసుకోవచ్చని కవిత్వంలోకి దిగుతారు. కొందరు అలంకారాలకోసం, సత్కారాలకోసం, పురస్కారాలకోసం కవిత్వపు మేలువస్త్రాన్ని కప్పుకుంటారు. ఇలాంటివాళ్లు చాలా తొందరలోనే అలసిపోతారు. ఇదింక ఏమాత్రం మోయలేని బరువనుకుంటారు. కొందరు నిస్సంకోచంగా, మరికొందరు సంకోచిస్తూ కవితాలోకంనుండి నిష్క్రమిస్తారు. ఇంక ఇటు చూడరు. ఈ పారిభాషికాలు వాడరు. ఈ లోకం దరిదాపుల్లోకి రారు. (ఊ.వే.పుట.48) అని లోకంలోని వివిధ రకాల కవుల్ని, వారి మనస్తత్వ రీతుల్ని మనముందుంచుతాడు. కవులు ఎలా ఉండకూడదో చెప్పకనే చెబుతాడు. కవిత్వం పార్ట్ టైం జాబ్ కాదని అయన ఉద్దేశం. కవిత్వంతో తాదాత్మ్యంచెందనివారు కవులుగా ఎక్కువకాలం నిలబడలేరని సూత్రీకరిస్తాడు.

కవి నిలబడాలంటే కవిత్వ రసవిద్యతోపాటూ, నిరంతర అధ్యయనం, స్వీయ ప్రతిభ, తాత్త్విక పునాది, పురోగామి దృక్పథం మొదలైన దినుసులు ఉండాలని నరసింహారెడ్డి స్పష్టంగా చెబుతున్నాడు చూడండి. "కాల ప్రవాహంలో కొట్టుకుపోకుండా నిలబడే కవులు కొందరే ఉంటారు. వారికి కవిత్వ రసవిద్య తెలిస్తేనే ఉంటారు. తమను తాము నిరంతరం పుటంపెట్టుకుంటేనే ఉంటారు. తమను తాము విస్తరించుకుంటూ పోతేనే ఉంటారు. వారిలోనే కొత్త అభివ్యక్తులుంటాయి". (ఊ.వే.పుట.145). "కవి తనకు తానుగా కనిపించని సొంత ఛందస్సొకటి ఏర్పరచుకొని రాసుకుంటాడు. అతనికి ఒక తాత్విక పునాది, శైలీపునాది ఉంటాయి. ఉంటేనే ఉంటాడు. కుక్కపిల్లా, సబ్బుబిల్లా కవిత్వ వస్తువులే కాని, ఆ వస్తువును ఆశ్రయించి కవి ఏమి చెప్పదల్చాడనే దృక్పథం మరింత ముఖ్యం. కవి మాత్రం తప్పనిసరిగా పురోగామి దృక్పథం కలిగి ఉండవలసిందే. లేకపోతే కవిత్వం రాయలేడు. రాసినా అది వేస్ట్'' (ఊ.వే.పుట.131) అని కుండబద్దలుకొట్టి మరీ ప్రకటించగలడు. "ఎవరి ప్రతిభ వారి సొంతం. కానీ వ్యుత్పత్తితో కూడిన సాధన కవిగా నిలబెడుతుందన్నది ఎవరు కాదనలేని సత్యం. అందుకోసం కవి రచనావస్తువుతో తాదాత్మ్యం చెందాలని ప్రాచ్య, పాశ్చాత్య విమర్శకులు చెప్పిన ఒకే ఒక్క అభిప్రాయం" (ఊ.వే.పుట.138) అని వర్తమాన కవులకు గుర్తుచేస్తాడు.

కవిత్వం, దాని నిర్మాణం గురించీ నరసింహారెడ్డికి తనవైన అభిప్రాయాలున్నాయి. స్వయానా కవి కావడం, ఆ రసవిద్య తెలియడం నరసింహారెడ్డికి అదనపు అర్హత. "వస్తుశిల్పాల సమన్వయం ఏ స్థాయిలో ఉంటుందో ఆ స్థాయిలో కవిత్వం పాఠకుల హృదయాలను చేరుతుంది. చాలామంది

ఆధునిక కవులు వస్తువువరణంలో చూపిన వైవిధ్యం, అభివ్యక్తి వైవిధ్యాలకు ఇవ్వడంలేదు. అభివ్యక్తికోసం చేసే సిన్సియర్ ఎఫర్ట్ అత్యాధునికుల కవిత్వాన్ని శ్రద్ధగా చదవడం, డిక్షన్ ను మననంచేస్తూ చదవడం, మంచి అభివ్యక్తికోసం వస్తువు బహిరంతరాలను అరమరికలు లేకుండా శోధించాలి. సంక్షిప్తి, నూతనత్వం ఆధునిక కవిత్వానికి ప్రాణప్రదమైన అంశాలు. కవిత్వంలో నిలబడాలంటే కవిత్వంలోకి చొరబడాలి (ఊ.వే.పుట.126) అంటాడు. శాంతికృష్ణ కవిత్వం గురించి రాస్తూ, "కవిత్వ రచనకు ముఖ్య లక్షణం వ్యుత్పత్తి. వస్తువైవిధ్యం ఎంత ముఖ్యమో అగ్రీకరణం అంతే ముఖ్యం. (ఊ.వే.పుట.129). "ఎవరు ఏది ఊహిస్తే వాళ్లకు ఆ భావం స్మరించడం ఉత్తమ కవిత్వ లక్షణం" (ఊ.వే.పుట.168). "కావ్యత్వసిద్ధికి మూలం కవి శక్తి. కవికున్న కల్పనా, నిర్వహణ సామర్థ్యం మాత్రమే కావ్యాన్ని నిలబెడుతుంది. ప్రక్రియ ఏదైనా ఇదే నిజం. వచనం రాసి విజయవంతమైన వాళ్ళున్నారు. పద్యం రాని ఫెయిల్ అయిన వాళ్లు కూడా ఉన్నారు''. (ఊ.వే.పుట.143). "వచన కవిత్వ నిర్వహణ కత్తిమీద సామే. ఎందుకంటే దానికి ఛందస్సు లేదు. అలంకారం ఆప్షనల్. కథ లేదు. పునాది కూడా లేదు. ఆధునిక వచన కవిత్వం అంటే కనిపించని పునాదులమీద కట్టవలసిన రంగుల హర్మ్యం" (ఊ.వే.పుట.131). 'వెన్నెల సత్యం కవిత్వంలో అరుదైన అభివ్యక్తులు' అనే వ్యాసంలో "నిజమైన జీవితానుభవాలను ఆర్ద్రతతో కవిత్వం చేసిన కవుల కవిత్వం సార్వజనీనతను, సార్వకాలీనతను సంతరించుకుంటుంది. అదే నిలబడే కవిత్వం. అది కాలం నిర్ధారించవలసిన విషయం. అందాకా కవిత్వం ప్రవహిస్తూనే ఉంటుంది. (ఊ.వే.పుట.145) మొదలైన ఎన్నో అభిప్రాయాలను 'అవసరం' డిమాండ్ చేసినచోటల్లా తన రీడర్స్ తో పంచుకొంటాడు.

ఎంపిక చేసుకొన్న పుస్తకాన్ని ఆసాంతం చదివాక దానిలోని మౌలిక విషయాన్ని ఆకలింపు చేసుకొన్నాక, మౌలికతకు సంబంధించిన నేపథ్య/సిద్ధాంత/చారిత్రక జ్ఞానాన్ని అధ్యయనం చేస్తాడు ఏనుగు నరసింహారెడ్డి. ఇది ఆయన రచనా పద్ధతి. పాఠకునికి ఈ భూమికను సులభమైన భాషలో, పద్ధతిలో చెప్పిన తరువాత పాఠకుల్ని మెల్లిగా వేలుపట్టుకొని ప్రస్తుత గ్రంథంలోకి అడుగులు వేయించే శిల్ప లక్షణం ఆయన రాసిన ఏ వ్యాసాన్ని చూసినా కనిపిస్తుంది.

దోరవేటి రాసిన పద్యకావ్యం 'దోస్తానా'ను సమీక్షిస్తూ, విపులమైన భూమికను వ్యాసం ప్రారంభంలో రాసాడు. కావ్య శీర్షిక స్నేహం గురించి కాబట్టి, ప్రపంచ సాహిత్యంనుంచి బ్రూటస్, జూలియస్ సీజర్ ల స్నేహాన్ని ప్రస్తావిస్తూ మొదలుపెడతాడు. భారతీయ సాహిత్యంనుంచి, కర్ణుడు, దుర్యోధనుల ప్రాణస్నేహాన్ని గురించి చెబుతారు. ఆ స్నేహ ఉన్నతికి సంబంధించిన ఒక ఉదాహరణ కూడా ఇస్తాడు. డామన్ పిథియస్ ల కథలు, శ్రీకృష్ణ కుచేలుల కథల్ని పాఠకుల జ్ఞప్తికి తెస్తాడు. స్నేహవాతావరణంలోకి పాఠకుల్ని తీసుకొచ్చి, 'దోస్తానా'తో జతకట్టిస్తాడు. ఆ కావ్యంలోని విశేషాల్ని ఇక ఒక్కక్కటిగా విప్పి చెబుతాడు.

"అమ్మ... కవులకు ఓ భిన్నమైన జ్ఞాపకం" అనే వ్యాసం ఈ శిల్పరీతిని మరింత బలపరుస్తుంది. తెలుగులో అమ్మ మీద రాసిన కవిత్వాన్ని సమీక్షించటం ఆయన వ్యాస పరిధి. లేగదూడను లాక్కెళుతోన్న మనిషిపై తల్లి ఆవు తిరగబడిన విధానాన్ని చిత్రించిన 'ఇత్తనపు కోడె' (ఉప్పల నరసింహం) అనే కథలో చిత్రించిన అమ్మ ప్రేమతో వ్యాసం ప్రారంభిస్తాడు. జానపద కథల్లో ప్రసిద్ధమైన 'ఆవు-పులి' కథను ప్రస్తావిస్తాడు. గాంధారి సుయోధున్ని మరణంలేని వజ్రకాయున్ని చేయాలని పరితపించినప్పటి తల్లిప్రేమను గుర్తుచేస్తాడు. గ్రీకుగాథల్లో కనిపించే, ట్రోజాన్ వార్ లో తన కొడుకు 'అచిలిస్' చనిపోకుండా ఉండేందుకు 'అపోలో' దేవతను ప్రార్థించి, దివ్యపాయసాన్ని పొందుతుంది. ఇట్లా మాతృమూర్తి ప్రేమ పిల్లలపై ఏ కాలంలోనైనా, ఏ సమాజంలోనైనా ఒకేలా ఉంటుందని చెబుతూ దానికి కొనసాగింపుగానే తెలుగులో 'అమ్మ' కవిత్వం వచ్చిందంటూ విపులమైన భూమికను నిర్వచించాడు ఏనుగు నరసింహారెడ్డి. ఇలాంటి ఉదాహరణలు ప్రతి వ్యాసానికి ఇవ్వొచ్చు. ఈయన వ్యాససంపుటిలో ఏ వ్యాసం తీసుకొన్నా 3-5 పేజీలకు మించదు. ఆధునికకాలంలో ఉండే వేగంవల్ల రీడర్స్ సమయాన్ని గౌరవించడం నరసింహారెడ్డికి బాగా తెలుసు. నరసింహారెడ్డి దీన్ని ఒక నియమంగా పెట్టుకొన్నట్టున్నాడు. ఇట్లా రాయలనుకున్నవారికి ఇందులోని ప్రతి వ్యాసం ఒక నమూనానే.

చాలామంది రాసే విమర్శ బరువైన పరిభాషతో, సిద్ధాంతాల ప్రస్తావనలతో, వాక్యాల్లో అస్పష్టతతో, అర్థ సందిగ్ధతతో సాధారణ పాఠకున్ని అధ్యయనానికి దూరంచేస్తాయి. పఠనాన్ని కనీసం వాయిదానైనా వేయిస్తాయి. దీనికి పూర్తి

భిన్నమైన రచనాశైలి, భాషాప్రయోగదక్షత ఏనుగు నరసింహారెడ్డి సొంతం. సాదాసీదా పదజాలంతో, స్పష్టమైన ఆలోచనలతో సూటీగా వాక్యం రాయడం ఈయన ప్రత్యేకత. ఈయన వ్యాసం చదువుతుంటే పాఠకునికి అలసట అనేదే ఉండదు. చదివించే గుణం ఎక్కువ. ఇదీ స్థూలంగా ఏనుగు నరసింహారెడ్డి అనుసరించే విమర్శా శిల్పరీతి.

నరసింహారెడ్డి వ్యాసరచనలో మరొక ప్రయోగం కూడా చేసాడు. ముచ్చటేసింది. తెలంగాణ ఉద్యమం జరుగుతోన్నప్పుడు తెలంగాణ రచయితలు తెలంగాణ భాషలో వ్యాసాలు రాసే ప్రయత్నం జిద్దుకు చేసారు. కవిత్వం, కథ, నవలవంటి సృజనాత్మక ప్రక్రియల్లో ఇది ఎప్పటినుంచో జరుగుతోంది. విజయవంతమై ఇతర ప్రాంతాల తెలుగు రచయితలకు నమూనాలు అందించింది కూడా. వాళ్లలో భాషపట్ల చైతన్యాన్ని, ఆత్మగౌరవాన్ని, అస్తిత్వస్పృహను నింపింది అంటే విజ్ఞులైనవారెవరూ వ్యతిరేకించరనుకుంటా. ఉద్యమ సమయంలో తెలంగాణ రచయితలు సామజిక, రాజకీయశాస్త్ర సంబంధమైన రచనల్లో వాక్యాంతంలో తెలంగాణ క్రియను వాడేంతవరకు విజయవంతం అయ్యారు. పత్రికాభాషలోని వాక్యనిర్మాణ స్వభావమే రాసి, చివర్లో తెలంగాణ క్రియ రాయడం ఆ కాలంనాటికి మెచ్చదగింది. కానీ తెలంగాణ వాక్యంలో మౌఖికభాషలో ఉండే 'కాకు'సంబంధమైన అంతర్నిర్మాణాన్ని పట్టుకోలేదనే అన్పిస్తోంది. స్థిరపడిన తెలంగాణ లిఖిత వాక్యస్వరూపం లేకపోవడంవల్ల మౌఖిక వాక్య లక్షణమే పత్రికాభాషకు ప్రత్యామ్నాయం. వ్యాసాల్లో పలుకుబడులకు శీర్షికాదక్షతను కలిగించేంతవరకు అనేకమంది రచయితల కృషి ఉంది. కానీ, వాటిని సాహిత్య, సామాజిక, రాజకీయశాస్త్ర సంబంధమైన రచనల్లో భావ ఉద్దీప్తికి ఉపబలకంగా వాడే ప్రయత్నం దాదాపు చేయలేదనే చెప్పాలి. వ్యాసరచనలో తెలంగాణ భాషాప్రయోగ ఫలితాలు ఎలా ఉన్నాయో కూడా చూసాం. నేడు ఆ ప్రయత్నం కూడా పూర్తిగా తగ్గిపోయింది. తెలంగాణ భాషాస్పృహ క్రమంగా లేకుండా పోతుంది. ఉద్యమ సమయంలో తెలంగాణ భాషలో రాసిన ఎంతోమంది రచయితలు నేడు పత్రికాభాషలో రాయడం చూస్తున్నాం. తెలుగును శాస్త్రభాషగా ఎదిగించుకోవాలని ప్రయత్నాలు ఎప్పటినుంచో జరుగుతున్నాయి. దానికోసం పారిభాషిక పదకోశాలు, మాండలిక పదకోశాలు, వృత్తిపదకోశాలను కూడా కొన్నింటిని నిర్మించుకున్నాం. మళ్లీ నేడు 'నూతన జాతీయ విద్యావిధానం'లో ఒక ప్రధానాంశంగా ముందుకొచ్చిన తర్వాత 'శాస్త్రభాషగా తెలుగు' గూర్చి ఆలోచనలు చేస్తున్నాం.

తెలంగాణ భాషకు సంబంధించి ఇంత సుదీర్ఘ ఉపోద్ఘాతానికి కారణం ఏనుగు నరసింహారెడ్డి. ఈ నేపథ్య కృషి అర్థమైతేనే ఏనుగు నరసింహారెడ్డి రాసిన "నూరు మల్కల ఇమ్లి రాశిన శీనయ్య" వ్యాసం అర్థమవుతుంది. ఆ వ్యాసంలో నరసింహారెడ్డి చేసిన తెలంగాణ వాక్యప్రయోగాన్ని హత్తుకుంటాం. అభినందిస్తాం. తాదాత్మ్యం చెందుతాం. అందులో ఉన్న కష్టనష్టాలు బేరీజు వేస్తాం. మొత్తంగా తెలంగాణ భాషను సాహిత్యవిమర్శాభాషగా ఎదిగించుకోవాలనే ప్రయత్నాన్ని మనమూ మొదలుపెడుతాం. కింద కొన్ని వాక్యాలు చూడండి.

"పూకెనే కాయిదం మల్లెయ్యకుంద్రి. ఈ వొయి దెరువకుంద్రి. ఇండ్ల శానమంది పట్కపడే శాని రాతలేం లేవు. పట్నంలబుట్టి గల్లీలల్ల దిర్గి కాన్వెంట్ల బట్టీపట్టినోల్లకిది ఏం సమజ్ కాదు"(ఊ.వే.పుట. 114).

"ఒగ ముచ్చటగాదు. ఒగ లెక్కగాదు. అటుకుల గిర్ని కాన్నించి కాకి ఎంగిలి దాక సైకిల్ పయ్యమీద సొంతం దిప్పుతడు మనల. కొద్ది కొద్దిగ జదివి ఈ కైతల నుంచి 'బోకంచె కప్ప దుంకుల్ల' తోటి బైట వడ్దామనుకుంటే ఈ పిల్లగాడేంది ఇట్ల నన్నుదించిండు సీసలకు(ఊ.వే.పుట. 116).

ఏనుగు నరసింహారెడ్డిది తెలంగాణ విమర్శా ప్రస్థానంలో ఒక ప్రత్యేకమైన స్థానం. కవిగా, అనువాదకుడిగా ఎంత విజయం సాధించారో విమర్శకుడిగా కూడా అంతే. తులనాత్మక పరిశీలన ఈయన విమర్శలో కనిపించే మేలిమి గుణం. ఇతర విమర్శకుల్లో తక్కువ కనిపిస్తుంది. ఈ వ్యాసంలో చర్చించిన ప్రాతిపదికల నేపథ్యంలోంచి ఆయన రాసిన విమర్శనంతా ఒకేసారి అధ్యయనంచేస్తే, తెలంగాణ విమర్శకు ఆయన చేసిన సమగ్రకృషి తెలిసివస్తుంది. విమర్శకుడిగా ఆయన పరిణామాన్ని అంచనావేయడం సులభమవుతుంది. ఆయన తాత్త్విక ప్రస్థానంలో వచ్చిన మార్పులు అవగతం అవుతాయి. ఆ మార్పులకు సామయిక సందర్భాల దోహదం తెలిసివస్తుంది. ఇక మిగిలింది ఆయన అందించిన టూల్స్ పట్టుకొని సాహిత్యాన్ని విమర్శించడమే.

★ **రచయిత: అసిస్టెంట్ ప్రొఫెసర్, నిజాం కళాశాల** T


# పదేళ్ల "భారత్‌కు మార్క్స్ అంబేద్కర్" పాట

ఇమ్మిడి మహేందర్

మానవ పరిణామ క్రమంలో పాట ఒక సహజ ప్రక్రియ. వ్యక్తి ఆలోచనను సమూహపరం చేయడానికి రూపొందిన ప్రజా ప్రక్రియ పాట. శారీరక శ్రమ మొదలు సామాజిక మార్పు పోరాటాల వరకు పాట తన ప్రస్థానాన్ని కొనసాగిస్తూనే ఉన్నది. తలకిందులుగా దోపిడి స్వభావంతో ఉన్న సమాజాన్ని సమసమాజంగా మార్చేందుకు పని చేస్తున్న రాజకీయ శక్తులకు పాట ఒక పోరాట వ్యక్తీకరణ. అట్లాంటి పోరాట వ్యక్తీకరణ క్రమంలో పుట్టుకొచ్చిన పాటగాడు జయరాజు. జయరాజు అనగానే మనకు అనేక పాటలు మదిలో మెదులుతాయి. కానీ ఒక్క పాట మనల్ని సైద్ధాంతిక పొలిమేరల్లో నిలబెట్టి, లాల్ నీల్ మైత్రిని ఆకాంక్షిస్తుంది. "భారతుకు మార్క్స్ అంబేద్కర్" అన్న సాహసాన్ని చేసి ఈ సంవత్సరానికి సరిగ్గా పదేళ్లు అవుతుంది. పాట వచ్చిననాటి నుండి ప్రగతిశీల శిబిరాల మొదలు అంబేద్కరిస్టు శిబిరాల దాకా అనేక ప్రశ్నలను జయరాజు ఎదుర్కొన్నాడు. మరికొన్ని చోట్ల అభినందనలను, ఆహ్వానాలను అందుకున్నాడు.

పాట రచయిత జయరాజు "భారతుకు మార్క్స్ అంబేద్కర్" అని అనడం వెనుకాల తన దీర్ఘకాలిక పోరాట ఆలంబన ఉన్నది. ఆలోచనల సంఘర్షణ ఉన్నది. తను విద్యార్థి జీవితం మొదలు కార్మిక జీవితం, ఉద్యమ జీవితం అంతా ప్రగతిశీల పోరాటాలకు నెత్తురును దారపోశారు. గొంతును అందించారు. చిందులు తొక్కి ప్రజలను చైతన్యవంతం చేసాడు. ప్రజలను పోరాటాలకు సంసిద్ధులను చేసాడు. ఆరోగ్య సమస్యల వల్ల అజ్ఞాత జీవితాన్ని వదులుకున్నారు. అనేక ఒడిదుడుకులు, ఆరోగ్య సమస్యల్లో అంబేద్కర్‌ని అధ్యయనం చేసాడు. అప్పటి వరకు ప్రగతిశీల పోరాటాల్లో కేవలం రాతలకే పరిమితమైన సామాజిక న్యాయ సాధన పోరాటాలను తన మనస్సులో కూలంకషంగా చర్చకు పెట్టాడు. ఈ చర్చల సారంలోంచి పుట్టిన పాటనే "భారతుకు మార్క్స్ అంబేద్కర్" అనే పాట.

గతం లేకుండా వర్తమానం, ఈ రెండు లేకుండా భవిష్యత్తు ఉండదు. గతాన్ని తెలుసుకోవాలి, అధ్యయనం చేయాలి. కానీ, గతంలోని ఆచరణకు బద్ధులు కాకుడదు. ఈ



అవగాహన ఉన్న దార్శనికులు కారల్ మార్క్స్, అంబేద్కర్‌లు. వీరిద్దరు తమ గతాలను క్షుణ్ణంగా తెలుసుకున్నారు. అధ్యయనం చేశారు. గతాన్ని, వర్తమానాన్ని పునాదిగా చేసుకొని భవిష్యత్తును కలగన్నారు. దోపిడి, పీడనలు లేని సమాజం కొరకు సైద్ధాంతిక అవగాహనతో పాటు ఉద్యమ కార్యాచరణను ప్రకటించారు. మార్క్స్, అంబేద్కర్‌లు సామాజిక, రాజకీయ, ఆర్థిక శాస్త్రవేత్తలు. కార్యశూరులు కూడా. ఈ ఇద్దరు సమాజాన్ని లోతుల్లోకి వెళ్లి చదివారు. ప్రతి వ్యక్తికి తాము జీవించిన కాలం నాటి నిర్దిష్ట స్థల, కాల ప్రభావాలు ఉంటాయి. ఈ ప్రభావాలకు అందరు లోను కావల్సిందే. ప్రతి వ్యక్తి చైతన్యం తన సామాజిక అస్తిత్వంపై ఆధారపడి ఉంటుందనేది మార్క్సిస్టు అవగాహన. ఈ సూత్రీకరణకు కారల్‌మార్క్స్, అంబేద్కర్‌లు కూడా మినహాయింపు కాదు. వీరిద్దరు తమ కాలాల్లోని, సమాజాల్లోని, స్థలాల్లోని నిర్దిష్ట పరిస్థితులకు, ఉన్న సమస్యలకు పరిష్కార మార్గాలు వెతుకుతూనే ప్రపంచం గురించి ఆలోచించారు. ఈ విధంగా ప్రపంచంలోని దోపిడిని గుర్తించే దశలో ఎదురయ్యే ప్రతి ప్రశ్నకు సమాధానం వెతికారు. సహజంగానే వీరిద్దరి ఆలోచన మార్గాల్లో కొద్దిపాటి మార్పులతో సారూప్యం కనబడుతుంది.

"భారతుకు మార్క్స్ అంబేద్కర్" పాటలో జయరాజు చెప్పిన విషయాలు సరిగ్గా అర్థం కావాలంటే భారతీయ సమాజం లోతులు తెలవాలి. ప్రపంచమంతా వర్గాల మయం, వర్గ పోరాటంలోనే సమస్త మానవ విముక్తి దాగి ఉందని మార్క్స్ అంటే, అంబేద్కర్ మాత్రం భారతీయ సమాజం ప్రపంచ మానవ సమాజానికి భిన్నమైన సామాజిక పునాదులపై నిర్మాణమైందన్నాడు. ప్రపంచ దేశాల్లో దోపిడి, పీడన, అణచివేత స్థూలంగా ఆర్థికపరమైనవే అయినప్పటికీ వీటిని భారతదేశంలో కుల వ్యవస్థ వ్యవస్థీకృతం చేసిందన్న అవగాహన అంబేద్కర్‌కి ఉంది. కులమంటే ఈ దేశ ప్రజలను సామాజికంగా సంఘటితం కాకుండా, అణచి వుంచడానికి అదే ప్రజల చేత ఆచరించ బడుతున్న ఆచార సంప్రదాయ రూపమే కులం అని నిర్ధారించాడు. ఈ కుల నిర్మాణానికి హిందూ మతంలో బలమైన పునాదులున్నాయన్నాడు. కనుక కులవ్యవస్థ చుట్టూ, మతం చుట్టూ ఉండే అన్ని రకాల దోపిడి, అణచివేతల రూపాన్ని లోతుగా అధ్యయనం చేసాడు. భారతదేశంలోని పీడిత కులాల అభ్యున్నతికి, రాజ్యాధికారమే అత్యున్నత లక్ష్యమని ప్రకటించాడు. భారతదేశంలో పీడనలు లేని సమసమాజం సాధించాలంటే అంబేద్కర్ ఆలోచన విధానికి చాలా ప్రాధాన్యత ఉంది. ఇవే లక్ష్యాలు కారల్ మార్క్స్‌కి కూడా ఉన్నాయి. ఈ ఇద్దరి లక్ష్యాలు ఒకటే అయినా ఆచరణ మార్గాలు భిన్నమైనవి. కారల్ మార్క్స్, అంబేద్కర్‌లు తాము గ్రహించిన విషయాలలో స్థూలంగా కార్మికులు రాజ్యాధికారం సాధించాలి. భారతదేశంలో అది నిమ్న కులాలు అధికారం సాధించాలి. అసమానతలు లేని సమాజాన్ని రూపొందించాలి. ఆర్థిక అసమానతలతో పాటు, కుల అసమానతలు రూపుమాపాలి. భద్రమైన జీవనాన్ని గడపాలి. నిరుద్యోగం లేని సమాజాన్ని సాధించాలి. మానవత వెల్లివిరిసి కుల, మత, వర్ణ, వర్గ, లింగ, ప్రాంత అసమానతలు లేని సమ సమాజాన్ని నిర్మించాలనే లక్ష్యాలు కొన్ని పరిమితులతో ఇద్దరికి ఉన్నాయి. వీటన్నింటి నేపథ్యం నుంచి జయరాజు కట్టిన "భారతుకు మార్క్స్ అంబేద్కర్" అనే పాటను చూడాలి.

జయరాజు రాసిన ఈ పాటలో ఒక పల్లవి, నాలుగు చరణాలు మాత్రమే ఉన్నాయి. పాటలో చెప్పదలచుకున్న భావం పల్లవిలో, వాటికి కారణాలు చరణాలలో చెప్పాడు. పాటలో పల్లవి చాలా ప్రధాన పాత్ర పోషిస్తుంది. తర్వాతి చరణాల్లో తెలిపే భావాలకు ఇది ఆలంబనగా నిలుస్తుంది. ఒక అధ్యయనపరునికి, అంబేద్కర్‌ని కేవలం కులం వైపు నుండి చూసేవారికి తేడా ఉంటుంది. అంబేద్కర్‌ని మొదట అంటరాని వాడిగా చూసారు. తన పోరాట క్రమంలో ఒక బ్రిటీష్ ఏజెంటుగా చిత్రించారు. కేవలం దళితులకు నాయకత్వం వహించినవాడిగా, వారికి మాత్రమే నాయకుడిగా నెలకొల్పే ప్రయత్నం చేసారు. నిజానికి అంబేద్కర్ అందరివాడు. ఆయన జ్ఞానం, ఆచరణ సమాజంలోని ప్రతి విషయానికి, సమస్యలకు పరిష్కారం చూపగలవు. రాష్ట్రాలు విడిపోవాలన్నా, మహిళ పరిస్థితులను చక్కదిద్దాలన్నా, దేశ ఆర్థిక పరిస్థితులపై ఒక అంచనాకు రావాలన్న అంబేద్కర్ అవగాహనను చెప్పకుండ మాట్లాడలేము. ప్రపంచ దేశాలన్ని అంబేద్కర్‌ని జ్ఞానానికి చిహ్నంగా గుర్తిస్తున్నాయి. కనుక జయరాజు అంబేద్కర్‌ని జగజ్జననేతగా చూసాడు. ఇలా అనడం వెనుకాల నిచ్చెన మెట్ల కుల సమాజంలో అణచివేయబడ్డ వారికి అంబేద్కర్ మార్గమే ప్రాణంగా భావించాడు. బడుగు బలహీన వర్గాల ఆర్థిక, సామాజిక, దాస్య విముక్తికి మార్గం వేసిన విషయాన్ని "భవితకు మార్గం అంబేద్కర్/ బడుగులకు ప్రాణం అంబేద్కర్ అని రాసాడు. వేలయేళ్లుగా చదువుకు దూరమై, అభివృద్ధికి దూరమైన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన విషయాన్ని "మా బల్లో టీచర్ అంబేద్కర్/ మా బతుకు ఫ్యూచర్ అంబేద్కర్/ మా దారికి టార్చ్ అంబేద్కర్" అని అన్నాడు.

మొదటి చరణంలో అంబేద్కర్ ఆచరణ మార్గాన్ని చెబితే, రెండవ చరణంలో అంబేద్కర్ సామాజిక ఆలోచన విధానాన్ని, మూడవ చరణంలో ఆర్థిక ఆలోచన విధానాన్ని, నాల్గవ చరణంలో రాజకీయ దృక్పథాన్ని, ఈ దృక్పథాలు సాధించే విజయాలను సూచించాడు జయరాజు. సాధారణంగా తాత్త్విక సిద్ధాంతాలను సరళంగా ప్రజలకు చెప్పడం చాలా కష్టమైన పని. విశాల ప్రజా సమూహంలో ఉన్నవారికి అది చాలా సులభమే. కానీ ఇక్కడ రెండు తాత్త్విక ధారలను కలిపే ప్రయత్నంలో కష్టమే. అది జయరాజు సాధించాడు. తెలుగు సాహిత్యంలో అస్తిత్వ ఉద్యమాల పవనాలు వీచి చల్లబడ్డాయి. శత్రువు బలపడుతున్న వేళ ఐక్యత రాగాన్ని పాడాల్సిన అనివార్యతను పరిస్థితులు కల్పిస్తున్నాయి. ఐక్య సంఘటనల దిశగా ప్రస్తుత సాహిత్య, సామాజిక, రాజకీయ చలనాలు ఉన్నాయి. కనుక నేటి సామాజిక, రాజకీయ అవసరాలను, వాటి లక్ష్యాలను సాధించేందుకు సాంస్కృతిక రంగం ఆసరాగా నిలుస్తుంది. భావజాల తాత్త్వికరంగంలో కుల, వర్గ జమిలి పోరాటాల ఆవశ్యకత గురించి సమాజం గుర్తిస్తుంది. ఆ వైపుగా ఆలోచిస్తుంది.

భారతీయ సమాజంలో కులం, మతం చాలా ప్రధాన పాత్ర వహిస్తాయి. వీటి ముసుగులో అనేక దోపిడి విధానాలు, అణచివేత రూపాలు అమలవుతుంటాయి. అంబేద్కర్ ఈ అణచివేతల నిర్మూలనకు, తన జీవిత ఆచరణ నుంచి చేసిన కృషిని చూపడమే ఈ పాట లక్ష్యం. పార్లమెంటరి విధానంలో భారతదేశం ప్రజాస్వామ్యబద్ధంగా విలసిల్లాలంటే కుల, మత రూపంలోని అణచివేతల వికృత రూపాలను అంబేద్కర్ ముందుగానే ఊహించారు. అణచివేతల నుండి విముక్తి పొందడానికి, హక్కులను సాధించడానికి, న్యాయాన్ని పొందడానికి రాజ్యాంగాన్ని రాసారు. కుల నిర్మూలన కోసం, కులాల సృష్టి చేసిన మనువాదానికి సవాళ్లు విసిరి దాని ఉనికినే ప్రశ్నార్థకం చేసాడు. దేశం మొత్తం విదేశీ వస్తువులను దగ్ధం చేస్తుంటే అంబేద్కర్ మనుస్మృతిని దగ్ధం చేసాడు. అక్కడితో ఆగిపోలేదు. తాను రాసిన రాజ్యాంగంలోని ప్రతి ఆర్టికల్‌లో మనువాద భావజాలాన్ని దగ్ధం చేస్తూనే ఉన్నాడు. అందుకే మతోన్మాద శక్తులు ఇప్పుడు రాజ్యాగంపై పడ్డారు. కొత్త రాజ్యాంగం కావాలని మాట్లాడుతున్నారు. ఇప్పుడు దాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది.

ప్రపంచ దేశాలకు దోపిడి, పీడన నుంచి విముక్తి పొందే మార్గాన్ని ప్రసాదించిన మార్క్స్ ఇక్కడ అంబేద్కర్ రూపంలో ఉన్నాడనే ప్రతిపాదనను చేసాడు జయరాజు. ఈ వాస్తవాన్ని గ్రహించాలని విజ్ఞప్తి చేస్తున్నాడు. ఉన్నత మానవ సమాజాన్ని భారతదేశంలో సాధించడానికి అవసరమైన అనేక భావనలను అంబేద్కర్ ప్రతిపాదించాడు. వాటిని గుర్తించి, అమలు పరచడంలోనే మన నీతి నిజాయితీలు అవసరం.

అభివృద్ధిని సాధించడానికి ఏయేమార్గాల్లో పయనించాలి, ఆ మార్గాలను చూపుతూ, దేశ ప్రజల జీవితాల్లో వెలుగులు నింపిన విధానాన్ని వ్యక్తీకరించాడు. ఆర్థిక అసమానతలను రూపుమాపడానికి ప్రపంచానికి మార్క్స్ ఎలానో, భారతదేశంలో అంబేద్కర్ అంతటి కృషిని, భావజాల ధారను అందించారని చెప్తూనే, భారతదేశ అభ్యున్నతికి మార్క్స్, అంబేద్కర్‌ల సిద్ధాంతాల ప్రాసంగికతను చెప్పాడు. భారతదేశంలో జీవించే హక్కు మొదలు, విద్య, పౌర, సామాజిక హక్కుల వరకు ఏ రూపంలో అణచివేతకు గురైనా, చివరకు ఇద్దరి మధ్య పుట్టిన ప్రేమకు ఆటంకాలు కలిగినా రాజ్యాంగం ద్వారా కల్పించిన హక్కులతో న్యాయాన్ని పొందవచ్చు. భారత రాజ్యాంగం ఒక హక్కుల సాధన పత్రమే కాదు, గొప్ప తాత్వికతతో ఆదర్శ సమాజాన్ని నిర్మించేందుకు ఉన్న ఆలోచనల సమాహార రూపం. భూములు పంచాలన్న, పరిశ్రమల్లో లాభాల వాట పంచాలన్నా, అంతిమంగా బహుజన వర్గాల రాజ్యాధికార సాధనకైనా మార్గం వేసింది అంబేద్కర్ అన్న విషయాన్ని చిన్న పాట రూపంలో చెప్పాడు. భారత సమాజ విమోచనకు మార్క్స్, అంబేద్కర్ ఇద్దరూ అవసరమే. లాల్ నీల్ అనేది ఒక సిద్ధాంతం కాదు, ఐక్య కార్యాచరణ రూపం. కమ్యూనిజం ప్రపంచ దేశాల్లోని వర్గాల నిర్మూలనకు, సాధించాల్సిన లక్ష్యాలను, భారతదేశంలో అంబేద్కర్ ప్రతిపాదించిన లేదా సూచించిన మార్గాలను అనుసంధానం చేయడం ఈ పాట సాధించిన విజయం. ఈ పాట కేవలం నాలుగు చరణాలతో ఉన్నా, నాలుగు వేల పేజీల అంబేద్కర్ ఆలోచన ధారను అందులో అందించారు.

ఇంతటి సుదీర్ఘమైన ఆలోచన, భావ ధారను ఒక పాట రూపంలో అందించిన జయరాజు పాటకు పదేళ్లు నిండాయి. ఈ సందర్భంగా అంబేద్కర్ ప్రాసంగికతను, మార్క్స్ అవసరాన్ని చర్చించాల్సిన చారిత్రక సందర్భం మన కళ్లముందర ఉంది.

★ **రచయిత: అసిస్టెంట్ ప్రొఫెసర్, ఓయు** T

# మిట్టపల్లి సురేందర్ పాటలు-వస్తు వైవిధ్యం

ఆవాల హరిబాబు

**పరిచయం:**

పాట సామాన్య ప్రజల సాహితీ రూపం. ఆదిమ మానవుని నోటి నుండి అలవోకగా పుట్టింది. సంతోషంలో, బాధలో, దుఃఖంలో, ఆనందంలో మనిషి పాట రూపంలోనే కళాత్మకంగా స్పందించాడు. ప్రకృతికి మేను పులకరిస్తే పాట పుడుతుంది. అలాగే, అవమానాలు చుట్టుముట్టి, ఆకలి మంటలతో నిత్యం రగిలిపోతున్నా పాట పుడుతుంది. పక్కవాడి బాధను తన బాధ అనుకున్నప్పుడూ పాట పుడుతుంది. అన్నింటికి మించి హృదయం ద్రవించే ప్రతి స్థితిలోనూ పాటపురుడు పోసుకుంటుంది. ఇట్లాంటి నేపథ్యంలో పాటకు ఆలంబనగా వరంగల్లు జిల్లా కేంద్రం అయింది. విప్లవ పోరాటాలకు ఆనవాలమయింది. ఉద్యమంలో ధిక్కార స్వరంగా నిలిచింది.

మనిషిపై తను పుట్టి పెరిగిన ప్రాంత ప్రభావం అధికంగా ఉంటుంది. ప్రతి వ్యక్తి చైతన్యాన్ని తన సామాజిక అస్తిత్వమే నిర్ణయిస్తుందని ఒక సూత్రీకరణ. ఈ నేపథ్యం నుంచి చూసినప్పుడు మిట్టపల్లి సురేందర్ సామాజికార్థిక, రాజకీయ కల్లోలాలకు నిలయమైన తెలంగాణ నేల నుంచి పాటగాడిగా నిర్మాణమయ్యారు. మిట్టపల్లి సురేందర్ ఉమ్మడి వరంగల్ జిల్లా, చిట్యాల మండలం, వెల్లంపల్లి గ్రామంలో పుట్టాడు. తండ్రి నర్సయ్య, తల్లి మధునమ్మ. మిట్టపల్లి సురేందర్ అనేక కారణాల రీత్యా ఉన్నత విద్యను అభ్యసించలేదు. కానీ, సమాజాన్ని తనదైన రీతిలో అధ్యయనం చేశాడు. ఇతరుల జీవితాన్ని తానై జీవించాడు. శ్వాసించాడు. అందుకే ఎంతో వైవిధ్యం కలిగిన పాటలను రాయగలిగాడు.

రచయితకు రాయడం రాకపోతే నేర్చుకోవచ్చు కానీ, జీవితం లేకపోతే రచయితగా రాణించలేడు. ఈ సమస్య మిట్టపల్లికి ఎక్కడా తలెత్తలేదు. నిత్యం సామాజిక అలజడులకు కేంద్రంగా ఉండే తెలంగాణ సమాజంలో మిట్టపల్లి భాగమయ్యారు. నక్సల్బరీ విప్లవ పోరాటం, తెలంగాణ ఉద్యమం, కుల ఉద్యమాలు, విద్యార్థి ఉద్యమాలు మిట్టపల్లి సురేందర్‌లోని కవిని రూపొందించాయి. ఇన్ని ఉద్యమాల పరంపరలో తన కవి తత్వాన్ని నిర్మాణం చేసుకున్నాడు గనుకనే మిట్టపల్లి సురేందర్ పాటల్లో వస్తు వైవిధ్యం చోటు చేసుకుంది. ఈ వైవిధ్యాన్ని పరిశీలించడమే ఈ వ్యాస ముఖ్యోద్దేశం.

**మిట్టపల్లి సురేందర్ పాటలు-వస్తు వైవిధ్యం:**

సమాజంలోని వాస్తవికత సాహిత్య రూపం తీసుకున్నప్పుడు సాహిత్య వస్తువు అవుతుంది. సాహిత్య వస్తువు సమాజాన్ని ఆలోచింపజేస్తుంది. కార్యోన్ముఖులను చేస్తుంది. కవి లేదా రచయిత సమాజానికి చెప్పాలనుకున్న భావం సాహిత్య వస్తువు. వస్తువు వ్యక్తమయ్యే విధానం శిల్పం, ఈ రెండు వ్యక్తమయ్యే మాధ్యమం రూపం. ఈ విధంగా చూసినప్పుడు మిట్టపల్లి సురేందర్ కవితా వస్తువులో వైవిధ్యం ఉంది. శిల్పంలో వైవిధ్యం ఉంది. ఈ రెండు వ్యక్తమయేందుకు భూమికగా సాహిత్య రూపం పాట ఉంది. పాటను అద్భుతమైన వాహికగా చేసుకొని సాహిత్యంలోకి ప్రవేశించాడు సురేందర్.

మిట్టపల్లి సురేందర్ పాటల్లో వస్తు వైవిధ్యాన్ని అంచనా వేసే కన్నా ముందు, ఈ వైవిధ్యానికి ఆలంబనగా నిలిచిన సమాజాన్ని అధ్యయనం చేయాలి. సమాజంలోని భిన్న వైరుధ్యాలు మిట్టపల్లి సురేందర్ పాటలను ఎలా ప్రభావితం చేశాయో చూడాలి. సురేందర్ ఏ విధంగా స్పందించాడో చూడాలి. ఈ అధ్యయనం లేకుండా వస్తు వైవిధ్యాన్ని అంచనా వేయలేం. కనుక తెలంగాణ సామాజికార్థిక, రాజకీయ, సాంస్కృతిక పరిస్థితులపై ఒక అంచనా లేకుండా, సురేందర్ ఆర్ద్ర హృదయాన్ని తయారు చేసిన జీవితాన్ని అధ్యయనం చేయకుండా వ్యాస నిర్మాణం సాధ్యం కాదు.

తెలంగాణ సమాజం నిత్య కల్లోలమే. దోపిడిని అంగీకరించని తత్త్వం. పరులకై పాటుపడేతత్త్వం. ఈ తత్త్వమే ఇక్కడి సామాజిక అంతరాలను ప్రశ్నిస్తూ అనేక ఉద్యమాలు పుట్టాయి. గ్రంథాలయోద్యమం మొదలు ఆంధ్ర జనసభ, ఆంధ్ర మహాసభ, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం, 1969 తెలంగాణోద్యమం, విప్లవోద్యమం, సామాజిక అస్తిత్వ

పోరాటాలు, మలిదశ తెలంగాణ పోరాటం వరకు అనేక ఉద్యమాలు ఈ నేలలో చైతన్యాన్ని అందించాయి. ఈ చైతన్యమే తెలంగాణ నేలలో పాటను ఒక పోరాట వ్యక్తీకరణగా ముందుకు తీసుకువచ్చింది.

బండి యాదగిరి, తిరునగరి ఆంజనేయులు, సుద్దాల హనుమంతు, గూడ అంజయ్య, గోరటి వెంకన్నల వారసత్వంతో పాటను ఒక వాహికగా సురేందర్ అందుకున్నాడు. ఇంతటి తెలంగాణ చైతన్యంపై మిట్టపల్లి సురేందర్‌కి ఒక సమ్యక్ అవగాహన ఉంది. అందుకే ఆయన ప్రతిపాటలో తెలంగాణ సామాజిక జీవితం ప్రతిబింబిస్తుంది. ఆయన పుట్టిన ప్రాంతం ఉద్యమాల తీరం కావడంతో, ఆ తీరాన్ని పట్టుకొని తెలంగాణ మొత్తాన్ని ఆకలింపు చేసుకొని ప్రతి పల్లె తల్లి గుండె సవ్వడిని తన పాటల ద్వారా వినిపిస్తున్నారు.

ఆయన 17 ఏండ్లకే పాటలు పాడడం, రాయడం నేర్చుకున్నాడు. అప్పటి నుంచి నిరంతరం పాటతో సోపతి చేస్తూనే వస్తున్నారు. పాటను తన జీవితం చిరునామాగా మార్చుకున్నారు. ఆయన కలం నుంచి వస్తు రీత్యా భిన్న పాటలు వెలువడ్డాయి. అమ్మ పాటతో మొదలుపెట్టి అడవి తల్లి వరకు పాటలు అల్లాడు. ప్రతి కవికి తొలి గురువు అమ్మ. కవి తొలి కవితా వస్తువు అమ్మే. మిట్టపల్లికి కూడా తొలి కవితా వస్తువు అమ్మే. వ్యక్తి జీవితంలో తల్లి స్థానాన్ని భర్తీ చేసే మరోక స్థానం లేదు. మంచికి ఆత్మీయ రూపం అమ్మ. ఏక వాక్య కావ్యం అమ్మే. నవ మాసాలు మోసి, రక్తపు ముద్దకు మనిషి రూపం అందించేది అమ్మే. అదే అమ్మ ప్రేమకు బిడ్డ దూరం అయితే ఆ బాధ వర్ణనాతీతం. ఈ విషయాన్నే మిట్టపల్లి పాటగా మలిచాడు.

*నవ మాసాలు మోసిన తల్లి*
*ప్రేమకే నే దూరమా*
*బువ్వ పెట్టి నను బుజ్జగించిన*
*తల్లి లాలనకు దూరమా*
*పొద్దు వాలుతుంది*
*నా కమ్మలాలనేది*
*వెన్నెల రాతిరిలో*
*నా గోరు ముద్దలేవి*
*ఓ తల్లి నీ జోల పాడలేక*
*కంటికి కునుకే రాదమ్మా*

(మిట్టపల్లి యూట్యూబ్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూ నుండి)

ఈ పాట సురేందర్ రాసిన మొదటి పాట. అమ్మ ఒడిలో నేర్చుకున్న అక్షరాలతో 'అమ్మ' మీద పాట రాశారు. తల్లి లేని పిల్లలను వస్తువుగా తీసుకొని ఈ పాట రాశారు. తల్లిలేని పిల్లలు ఈ సమాజంలో ఎందరో ఉంటారు. వారి కష్టాలు వర్ణించడం కవి కలానికి ఎన్నటికీ అందనివిగానే, ఇంకా మిగిలినవిగానే ఉంటాయి. అమ్మ మీద పాటలు అనేకం వచ్చినా వస్తు రీత్యా ఈ పాట వైవిధ్యాన్ని కలిగి ఉందని చెప్పవచ్చు. తల్లిలేని పిల్లలు తల్లిలేనందుకు తన ఏమేమి కోల్పోతున్నారో పాట ద్వారా మనకు తెలియజేస్తున్నారు.

ఈ మధ్యనే "అమ్మ పాడే జోల పాట, తేనేలూరి పారే ఏరులంట" అనే పాటను కూడా రాశారు. ఇది యూ ట్యూబ్ ప్రపంచంలో విస్తృతంగా ప్రయాణిస్తోంది.

మలిదశ తెలంగాణ ఉద్యమం ఎందరో కవులను కదిలించింది. వాళ్లు రక్తమోడుతున్న తెలంగాణ పోరాటాన్ని అక్షరాలలో చిత్రించారు. అలాంటి వారిలో మిట్టపల్లి సురేందర్ ఒకరు. తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలకు ఆలంబనగా తెలంగాణ ఔన్నత్యాన్ని, అస్తిత్వ ఆకాంక్షను, ఉద్యమ స్వరూపాన్ని, ఉద్యమకారులు, విద్యార్థి అమరులు అంటూ ఎంతో వైవిధ్యంతో కూడిన పాటలు రాశారు. మలిదశ తెలంగాణ ఉద్యమ సిద్ధాంత కర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్. మలిదశ తెలంగాణ ఉద్యమాన్ని తన అధ్యయనం ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లినవారు. ఆంధ్ర వలస పాలనలో అన్ని రంగాలలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించిన వ్యక్తి.

ప్రత్యేక తెలంగాణ పోరాటమంటేనే నీళ్లు, నిధులు, నియామకాలు అనే నినాదాన్ని ఇచ్చి, ప్రతి పల్లెను తెలంగాణ పోరుకు కదిలించిన వ్యక్తి జయశంకర్ సారే. ఈయన మరణం తర్వాత జయశంకర్ సార్ పై మిట్టపల్లి ఒక పాటను రాశారు.

*"తెలంగాణ పల్లెల్లల్ల పొద్దు పొడిసెనో...నగాదారిలో*
*పోరు నడిపెనో... తెలంగాణలో*
*ఆ పొద్దు ఎవరంటే జయశంకరుడే...నగాదారిలో*
*జనబాంధవుడే... తెలంగాణలో"*

(ప్రజల పాటలు, 2013:42)

తెలంగాణ అనగానే మనకు ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ గుర్తుకు వస్తారు. ఆయననే తెలంగాణ సమాజం జాతిపితగా భావించుకుంటున్నది. ఆయన జయంతిని ప్రభుత్వమే నేడు అధికారికంగా నిర్వహిస్తున్నది. అలాంటి వ్యక్తి మీద మిట్టపల్లి గొప్ప పాటను రాశారు.

నిజానికి తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి జయశంకర్ ఆధ్యుడుగా మనం భావించవచ్చు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు కావాలని డిమాండ్ చేశారు. అనేక పోరాటాలు చేశారు. తెలంగాణ ఉద్యమానికి సిద్ధాంత కర్త వ్యవహరించారు. ఈ పాటను సురేందర్ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడక ముందే జయశంకర్ అమరులైనారు. ఆయన గొప్పతనాన్ని, ఆయన త్యాగాన్ని గుర్తు చేస్తూ, ఈ పాట రాశారు.

ఉద్యమంలో పని చేస్తున్నవారికి అడవి ఒక తల్లి లాంటిది. విప్లవోద్యమానికి అడవి తల్లి. తల్లి గుణమే అడవికి ఉంటుంది. అడవిలోని పోరాటాలకు, ప్రజలకు, అందరికి ఆలంబనగా ఉన్న అడవి తల్లిపై సురేందర్ పాట రాయడం సహజమే. అనేక విప్లవ పోరాటాలకు పురిటి గడ్డగా ఉన్న వరంగల్ జిల్లా కేంద్రంగా పుట్టిన కవికి అడవి ప్రత్యేక సాహిత్య వస్తువే అవుతుంది. ఒక రకంగా చెప్పాలంటే ఆత్మీయ రూపం అవుతుంది.

*పురిటి నొప్పుల తల్లి కన్నా*
*అడవి తల్లి మనసు గొప్పది*
*బాధ్యతల్లో తండ్రి కంటే*
*అడవి తల్లి పాత్ర పెద్దది*
*అర్ధరాత్రి శత్రువు వస్తే*
*ఎండిన ఆకుల అలికిడి చేస్తది*
*పాడు శకునం కండ్ల పడితే*
*పక్షితోనే కబురు పంపుతది*

(యూ ట్యూబ్ నుండి)

అడవి అంటే పోరాటం అంటారు మిట్టపల్లి. అడవి తల్లి మనసు పురిటి నొప్పుల తల్లి కన్నా గొప్పది అంటారు. ఈ మాట మాట్లాడడం అందరికి సాధ్యం కాదు. ఎందుకంటే తల్లి మించిన దైవం లేదని లోకం అంటది. కాని మిట్టపల్లి కన్న తల్లి కన్నా అడవి తల్లే గొప్పదని అంటారు. అంతేకాకుండా బాధ్యతలో తండ్రి కన్నా అడవి తల్లి పాత్రే గొప్పదంటారు. ఇదంతా మిట్టపల్లి అనుభవపూర్వకంగానే చెప్పుతున్నారని అనుకోవచ్చు. ఇదంతా అడవి పోరాడే అన్నలకు తల్లి అయిందని, ఆ అన్నలను తండ్రి కన్నా ఎక్కువగా కాపాడేది అయిందని అంటారు. ఇక్కడ ఉద్యమం ప్రాధాన్యతను మనకు తెలియజేస్తున్నారు. ఎదిగిన కన్న కొడుకులు ఈ నేల విముక్తి కోసం దోపిడి లేని సమాజ నిర్మాణం కోసం కన్నా తల్లిని వదిలి అడవి తల్లి బాట పట్టిన అన్నలను సొంత బిడ్డలాగా అడవి కాపాడుకుంటుందని, కన్న తల్లిని మరిచిన బిడ్డలను గావురంగా పెంచుకుంటుందని న్యాయం కోసం ఉద్యమాలను సిద్ధం చేస్తుంది అడవి తల్లి.

తెలంగాణ ఉద్యమంలో అనేక పోరాట మార్గాలను ఉద్యమకారులు అనుసరించారు. ధర్నాలు, నిరాహార దీక్షలు, సడక్ బంద్, రైల్ రోకో, రాజీనామాలు, వంటా వార్పు వంటి ఎన్నో పోరాటాలను అనుసరించారు. సుదీర్ఘ పోరాటాలు నడిపారు. కానీ, కొంతమంది విద్యార్థులు, పౌరులు ఆంధ్ర వలస ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ఆత్మహత్యలను కూడా ఒక పోరాట రూపంగా స్వీకరించారు. ఇది తెలంగాణ ఉద్యమంలో ఒకానొక దశలో ఉద్యమ శ్రేణులకు నిరాశను కల్పించాయి. బరిలో నిల్చి పోరాటం చేయాలి కానీ, ఆత్మహత్యలకు పాల్పడ వద్దని చాలామంది తెలంగాణ సమాజాన్ని కోరాయి. ఇక్కడి రాజకీయ నాయకులు విద్యార్థులను రెచ్చగొట్టి ఆత్మహత్యలకు పురిగొల్పినా, సాంస్కృతిక సేనలు, నిజమైన ఉద్యమకారులు, రచయితలు ఆత్మహత్యలు మార్గం కాదని, తెలంగాణను కొట్లాడి సాధించాలని కోరాయి. ఈ విషయాన్ని కవిగా మిట్టపల్లి సురేందర్ ఆత్మహత్యలను నిరసిస్తూ పాటలు రాశారు.

*"మరణం అన్నిటా మార్గమైతే*
*చావుతో అన్ని సాధ్యమైతే*
*నాలుగున్నర కోట్ల చితులను తప్పక ఇప్పుడు పేర్చేద్దాం*
*తల్లిని పిల్లను గొడ్డును గోదను*
*భూమిని బూడిద చేసేద్దాం*
*స్మశాన వాటిక మన స్వరాజ్యమై*
*స్వరాష్ట్ర స్వప్నం తిలకిద్దాం*
*బలిదానాలకే ఒడిగడదాం"*

*"ఎందుకు చేస్తావు ఎందుకు చస్తావ్*
*పిరికితనంగా భయపడి*
*ఎందుకు చేస్తావ్ బలిదానాన్ని*
*పోరాటమని భ్రమపడి*
*మరణం కాదురా మనిషికి మార్గం*
*జీవితమంటే నిత్యం యుద్ధం"*

అంటూ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు విషయంలో మరణం పరిష్కారం కాదనీ, పోరాటమే అంతిమ మార్గమని చాటాడు. నాటి ఆంధ్ర వలస ప్రభుత్వం తెలంగాణ పోరాటాలపై నిర్లక్ష్యం వహిస్తుంటే, కొంత మంది విద్యార్థులు ఆ నిర్లక్ష్యాన్ని బరించలేక స్వరాష్ట్ర ఏర్పాటు కోసం ఆత్మబలిదాలు చేసుకున్నారు. ఇది సరైన నిర్ణయం కాదని అందరికి తెలుసు. కానీ, ఈ ఆత్మబలిదానాలు కొనసాగుతున్న క్రమంలో మిట్టపల్లి స్వరాష్ట్ర సాధనకు చావు సరైన నిర్ణయం కాదని తన కలం ద్వారా వెల్లడించారు. వస్తు రీత్యా ఈ పాట విభిన్నమైనది. పుట్టుక, చావు సహజమైన ప్రక్రియలు అని, వాటిని వ్యక్తి తనంతట తాను మధ్యంతరంగా ఆత్మహత్య చేసుకోవడం మంచి పరిణామం కాదని, అదే బలిదానమే సరైనది అయితే తెలంగాణ సమస్తాన్ని బలి చేద్దాం అంటారు. మరణం అన్నింటికి మార్గం కాదు. చావుతో అన్ని సాధ్యం కావని తెలియజేస్తున్నారు.

తెలంగాణలో ప్రతీ జిల్లాకు ఒక చరిత్ర ఉంది. భౌగోళికంగా ఉన్న ప్రత్యేకతలు ఆ స్థానిక సమాజాలను ఎంతగానో ప్రభావితం చేస్తాయి. అక్కడి మనుషుల ఆలోచనలను రూపొందిస్తాయి. ఈ విధంగా చూసినప్పుడు ఆదిలాబాద్ జిల్లా అనేక ప్రత్యేకతలను కలిగి ఉంది. ఇక్కడి ఉద్యమ పరంపర ఉంది. గోండుల పోరాటాలు ఉన్నాయి. సమసమాజాన్ని ఆకాంక్షించిన ఉద్యమాలు ఉన్నాయి. మనుషులు ఉన్నారు. సింగరేణి ఉద్యమాలు ఉన్నాయి. ప్రకృతి సంపద, సహజ వనరులు నిండుగా ఉన్న అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. ఇట్లాంటి అనేక విషయాలను చర్చకు పెడుతూ ఆదిలాబాద్ జిల్లాపై సురేందర్ పాటను రాశాడు.

*"ఆదిలాబాద్ జిల్లా రా*
*అది ఎర్రని అడవి మల్లెరా*
*పచ్చని అడివంత ఆకాశమైతే*
*పల్లెల్లన్ని జాబిలమ్మలు*
*ఆ గోండులే వేగు చుక్కలు రా"*

(ప్రజల పాటలు, 2008:47)

మిట్టపల్లి ఏ పాటను తీసుకొని పరిశీలించిన దానిలో మంచి వచన సాహిత్యం, మంచి శిల్పం ఉంటుంది. ఈ పాటలో భాష పరిజ్ఞానం, విషయ పరిజ్ఞానం పుష్కలంగా మనకు ఉంటాయి. ఈ రెండు కలిగిన వారు సాహిత్యంలో తనదైన గుర్తింపును పొందుతారు. పై పాటలో ఆదిలాబాద్ జిల్లాను వస్తువుగా తీసుకొని పాట రాశారు. జిల్లా పేరు చెపుతూనే అది ఎర్రని అడవి మల్లెరా అంటున్నాడు. ఎరుపు అనగా మనకు ఉద్యమం, త్యాగం గుర్తు వస్తాయి. ఆదిలాబాద్ అనగానే మనకు ఆదివాసులు, అక్కడి విప్లవోద్యమం గుర్తుకు వస్తుంది. ఈ పాటలో ఇంద్రవెల్లి, కొమురం భీం, సింగరేణి, కాగితం మిల్లుల ప్రస్తావించారు.

మిట్టపల్లి ప్రకృతి మనను ఎరిగినవాడు. దాని గుణమెరిగినవాడు. చెట్టే కదా అని మనం అనుకుంటే దాని జన్మ ఉన్నతమైనది అంటాడు. మనిషి గుణం ప్రకృతిలో దాగి ఉన్నదంటారు. ప్రకృతి గుణం మిట్టపల్లి గుండె నిండా నిండి ఉన్నది. ఇలాంటి పాటలు రాయాలంటే పల్లె జీవితం ఉండాలి. ఇతని పాటలను మనసు పెట్టి మదిస్తే ఆయన పాటలలో పల్లె, ప్రకృతి, దాని నుంచి పుట్టిన పోరాటాలు, ఉద్యమాలు ఉంటాయి. ప్రకృతిలో ప్రతి జీవి తల్లి ప్రేమను ఎరుగును. కాని తాటిచెట్టులో కన్నతల్లి ప్రేమను ఎరిగిన కవి ఇతను. ఇవాళ సాంకేతిక పరిజ్ఞానం పెరగడం వల్ల కాంక్రీట్ మేడలు వచ్చాయి. కాని ఒకప్పుడు తాటిచెట్టె ఇంటికి వెన్నుపూసై నిలిచింది. కష్టాన్ని మరచిపోవడానికి తాటికల్లు తోడైంది.

ఎంత ఉన్నతమైనది రా తాటిచెట్టు జన్మ దాని గుణంలో ఉన్న ది రా కన్నతల్లి ప్రేమా.... అంటూ ప్రకృతిలోని తాటిచెట్టు గొప్పదనాన్ని వ్యక్తీకరించాడు.

**ముగింపు:**

ఇంతటి విస్తృతమైన సామాజిక ఆవరణలో కవిగా మిట్టపల్లి వైవిధ్యంతో కూడిన కవిత వస్తువులను స్వీకరించాడు. తాటిచెట్టు, గోదావరి నది, పాపికొండలను, అడవి, ఆదిలాబాద్ జిల్లాను తీసుకొని భిన్న వస్తువులను తీసుకొని పాటలు రాశారు. ఆయన సిని రంగంలోకి ప్రవేశించి కూడా అనేక పాటలు రాశారు. తెలంగాణ ప్రత్యేక ఉద్యమం కాలంలో అనేక ఉద్యమ పాటలు రాసి, తెలంగాణ సమాజం మీద తనదైన ప్రభావాన్ని వేశారు. మంచి సాహిత్యం, వస్తు వైవిధ్యం కలిగిన అనేక పాటలు రాశారు.

★ **రచయిత: పరిశోధక విద్యార్థి, ఓయు** T

# తెలంగాణ కవిత్వ పరిశోధన

డా॥వి.వెంకటేష్

"మనం ఏదో ఒక సామాజిక బృందంలో పుడతాం. యీ బృందాలకి ఓ పలానా నడవడిక, అనుభూతి చెందేతీరు, ఆలోచనలు చేసేతీరు వుంటూ ఉంటాయి. మనం మన పట్ల మన చుట్టూ వున్న లోకం పట్లా ఎరుక తెచ్చుకుంటాం. యితరులతో పరిచయాలు కలిగించుకుంటాం. విషయాలతో పరిచయాలు కలిగించుకుంటాం. ఇవి విస్తృతమవుతూ ఉండే కొద్దీ వాటి అనుభవాల నుంచి చైతన్యం ఆవిర్భవిస్తుంది. అంటాడు హరోల్డ్ హెచ్.టిటస్(హరోల్డ్ హెచ్.టిటస్. జ్ఞానం యెలా వస్తుంది? పుట:2) మనిషికి చైతన్యం సమాజమే అందిస్తుంది.

కవిత్వం సమాజ ప్రతిబింబం. సమాజం లేనిదే కవిత్వం లేదు. డాక్టర్ నందిని సిధారెడ్డి కవిత్వం గురించి ఒక సందర్భంలో ఇలా అంటాడు. 'మైదానంలో ఎంత నడయాడినా, పూదోటలో విశ్రమించినా, మనసైన అనుభవ గానాలతో ఎంతగా ఒలలాడినా జీవితంలో తడవకపోతే పుష్పించది. కవిత్వానికి ప్రాణ కాంతినిచ్చేది జీవితమే. జీవితంలో పెనవేసుకుపోయి అన్ని స్థితుల్లో అనునయించే ఆత్మగల కళ కవిత్వమొక్కటే. సృజన లోకంలో కవిత్వం పొందుతున్న ప్రాధాన్యత పట్ల అసూయ పడటం సహజమే. జీవితంలో ఆర్ద్రతను అందిపుచ్చుకోవటమే కవిత్వ రహస్యం. కాలంలోని, సంఘంలోని, మానవునిలోని బహుముఖాలను మూలాలను, సందర్భాలను పరిణామాలను ఆవిష్కరించే సూక్ష్మ సాధనం కవిత్వం. బాధితుడికి కవిత్వం ఒక ఆసర'! వంటిదని కవిత్వం మాత్రమే సామాన్యుడి నాడిని పట్టుకుని సామాన్యునికి కావలసిన దాన్ని తన గొంతుకగా చేసుకొని పోరాడుతుంది. కావున ఈ సమాజంలో కవికి, రచయితకి అనర్హమైన వస్తువేది ఉండదు. సామాజిక బాధ్యత కలిగిన కవికి ప్రతీది వస్తువే అవుతుంది. ఆధునిక కాలంలో ఇలాంటి వస్తువుకు సంబంధించిన చర్చ, పరిశోధన తెలంగాణలో అధికంగానే జరిగిందని చెప్పవచ్చు.

1930 ప్రాంతం దగ్గరనుండి మొదలుకొని తెలంగాణ రాష్ట్రం ఏర్పడేవరకు తెలంగాణ సమాజం అటు నిజాం, ఇటు ఆంధ్ర వలస పాలనలో అనేక రంగాల్లో వివక్షకూ, పీడనకూ, అణచివేతకూ గురైంది. ఇలా గురికావడమనేది ఒక్కరోజులో తెలిసొచ్చే సత్యం కాదు. అనేక అనుభావాల సారం నేర్పిన పాఠం. అయితే తెలుగు సాహిత్యంలో ఏ వాదమైనా మొదట కవిత్వంలోనే వెలువడిందని తెలుగు సాహిత్య చరిత్రని గమనిస్తే బోధపడుతుంది. ఎందుకంటే కవిత్వానికున్న సౌలభ్యం అలాంటిది. అలాగే తెలుగునాట అస్తిత్వవాద ఉద్యమాలు ప్రతి కవిని, రచయితని తన ప్రాంతం నుండి, కులం నుండి మాట్లాడేలా చేశాయి. ఇది స్త్రీవాద, దళితవాద, మైనార్టీ మొదలైన అస్తిత్వవాద ఉద్యమాల్లో కనిపిస్తున్న తెలంగాణ ఉద్యమం మరింత ప్రభావాన్ని చూపగలిగింది. భాష, సంస్కృతి, చరిత్ర, వివక్ష మొదలైన అనేకాంశాల్లో తన నేలనుండి కవిని ఆలోచించుకునేలా చేసింది. తద్వారా ప్రతి కవి, రచయిత శత్రువును ప్రశ్నిస్తూనే, ఇన్నాళ్ళ వివక్షను, జరిగిన అన్యాయాన్ని లేవనెత్తుతూనే తన ప్రాంత గొప్పతనాన్ని, ప్రత్యేకతల్ని అక్షరాలుగా మలచడం మొదలు పెట్టాడు.


ఒక సమాజం నూతన మార్పుల కోసం పురిటినొప్పులు పడుతున్న సందర్భంలో నిత్య చైతన్యశీలి అయిన కవి అంతరంగ జగత్తు కల్లోలపడక మానదు. తెలంగాణ ప్రాంతంలో జరిగిన అనేక సంఘటనలని, ఇక్కడి పరిస్థితులని చూస్తూ ఊరుకోలేదు. 1948లో పోలీస్ యాక్షన్ జరిగిన దగ్గరి నుండి ఎదురైన అనేక చేదు అనుభవాల తర్వాత 1969లో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసుకోవడమే పరిష్కారమనే చైతన్యం వచ్చింది. దాని నుంచే ఉద్యమం రూపొందింది. అయినా పాలక వర్గాలు చేసిన ద్రోహాల కారణంగా ఆనాడు ఉద్యమం చల్లారిపోయింది. అయినా చేదు అనుభవాల పరంపర మాత్రం కొనసాగింది. ఇప్పటిదాక నడచివచ్చిన చరిత్ర నేర్పిన సత్యం అణచివేత ఎక్కడ ఉంటుందో అక్కడ తిరుగుబాటు తప్పక ఉంటుంది. ఆ తిరుగుబాటు విజయవంతం కావటానికి నిర్దిష్టమైన కాలం ఉండకపోవచ్చుగాని, అంతిమంగా మాత్రం ఏ ప్రజాబాహుళ్యపు ఆకాంక్షలతో అయితే అది మొదలైందో ఆ ఆకాంక్షలు నెరవేరేదాక నిత్యం జ్వలిస్తూనే ఉంటుంది. అందుకే 1996 తర్వాత మలిదశ తెలంగాణ ఉద్యమం రూపుదిద్దుకుంది. ఇలా

ఎన్నో అవరోధాల్ని దాటి, పోరాడి సాధించుకున్న తెలంగాణలో ప్రస్తుతం తెలంగాణ చరిత్ర(సాహిత్యపరంగానూ, చారిత్రకంగానూ) సంస్కృతీ సంప్రదాయాలు, భాషా, ప్రత్యేకతలు మొదలైన అంశాల్లో చర్చ జరుగుతుంది. ఇలాంటి చారిత్రక సందర్భంలో తెలంగాణలోని ప్రతి జిల్లా విశేషాల్ని, సంస్కృతి సంప్రదాయాల్ని, భాష, చరిత్రల్ని సాహిత్యపరంగా అధ్యయనం(పరిశోధించాల్సిన)చెయ్యవలసిన అనివార్యత తెలంగాణ సాహిత్యంలో ఏర్పడింది.

అస్తిత్వ ఉద్యమాలు బయలుదేరిన సందర్భంలో, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరుణంలో తెలంగాణ సాహిత్యాన్ని, సామాజిక రంగాన్ని పునర్నిర్మించుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. తెలంగాణ ఉద్యమంలో సాహిత్యం కావచ్చు, కవిత్వం కావచ్చు, పాటలు కావచ్చు ప్రముఖ భూమికని పోషించాయి. తెలంగాణ ఉద్యమం అంటేనే పాట, కవిత్వంతో కూడుకున్నది. తెలంగాణ రాష్ట్ర నవ నిర్మాణంలో తెలంగాణ సాహిత్యం ముఖ్యంగా ఆధునిక సాహిత్యం, కవిత్వం ఉపయోగపడుతుంది. అందులో భాగంగానే నేను తెలంగాణ కవిత్వంపై జరిగిన పరిశోధనలని ఈ పత్రంలో చర్చించాను. నా దృష్టిలోకి వచ్చిన తెలంగాణ పరిశోధనలని ప్రాచీన, ఆధునిక అనే రెండు విభాగాలుగా విభజించుకుని వాటిలో పరిశోధకులు చర్చించిన అంశాలని కొంతవరకు వింగడిస్తూ విశ్లేషించే ప్రయత్నం చేశాను. ఇది సమగ్రం కానప్పటకి ఈ వ్యాసం వలన కొంతవరకైనా తెలంగాణ కవిత్వం మీద జరిగిన పరిశోధనలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. అంతేకాకుండా తెలంగాణ అస్తిత్వ, ఆత్మగౌరవ నిలువుటద్దంగా ఈ పరిశోధనలు నిలబడిన విధానాన్ని ఈ పరిశోధనా వ్యాసంలో చర్చించటం జరిగింది.

తెలంగాణ సాహిత్యం అంతాకూడా ఏకశిలా సదృశ్యంగా లేదు. ఒక్కో జిల్లాకు ఒక్కో ప్రత్యేకత ఉంది. కనుక ఆయా జిల్లాల ప్రత్యేకతలు ఆయా కవుల కవిత్వంలో ప్రతిఫలించాయి. అలాంటి కవిత్వ ప్రత్యేకతల్ని వెలికి తీయడానికి అనేకమంది పరిశోధకులు కృషిచేశారు. నేడు ఆ కృషి మరింత తీవ్రమైంది. తెలంగాణ కవిత్వంపై వచ్చిన కవిత్వ పరిశోధనా వివరాలని నా ఈ పరిశోధనా వ్యాసంలో వివరించే ప్రయత్నం చేశాను. అది వస్తుపరంగా వచ్చిన పరిశోధన కావచ్చు లేదా శిల్ప పరంగా వచ్చిన పరిశోధన కావచ్చు. కనుక నా ఈ పరిశోధన తెలంగాణ సాహిత్య చరిత్ర నిర్మాణానికే కాకుండా రాష్ట్ర నవ నిర్మాణానికి కూడా దోహదపడుతుందని భావిస్తున్నాను. అంతే కాకుండా సమాజ సాహిత్య సంబంధాల దృష్ట్యా చూసినప్పుడు ఇది పరిశోధించాల్సిన అంశంగా కన్పించింది. తెలంగాణ కవిత్వం మీద పరిశోధన చేయాలి అనుకునే భావి పరిశోధకులకు ఈ పరిశోధనా పత్రం ఒక ఆకరంగా ఉపయోగపడుతుంది.

1929లో చిలుకూరి నారాయణరావు '11వ శతాబ్ది తెలుగు భాష'పై పరిశోధన చేసి మద్రాసు విశ్వవిద్యాలయం నుంచి పి.హెచ్.డి పట్టా పొందారు. ఇది తెలుగులో వచ్చిన తొట్టతొలి పరిశోధనా గ్రంథం. అంటే తెలుగులో పరిశోధన ప్రారంభమై 95 సంవత్సరాలు కావస్తోంది. ఈ తొంబై ఐదు సంవత్సరాల్లో తెలుగు పరిశోధన కొత్త పుంతలు తొక్కింది. సంవత్సరానికి ఒకటి రెండు సిద్ధాంతగ్రంథాలు వెలువడే రోజులనుంచి వందదాక పెరిగాయి. దీనిని బట్టి తెలంగాణ ప్రాంతంలో పరిశోధన కొంత ఆలస్యంగానే మొదలయ్యిందని చెప్పవచ్చు. 1956లో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి బిరుదురాజు రామరాజు డాక్టరేట్ పొందారు. తర్వాత 1957లో దివాకర్ల వేంకటావధాని, 1960లో పల్లా దుర్గయ్య, కేతవరపు రామకోటిశాస్త్రి మొదలగువారు తొలితరం పరిశోధకులుగా ఉన్నారు. వీరి తర్వాత తెలంగాణ ఆధునిక కవిత్వంలో వచ్చిన ప్రామాణిక గ్రంథం సినారె గారి 'ఆధునికాంధ్ర కవిత్వం సంప్రదాయములు ప్రయోగాలు'."ఆధునికాంధ్ర కవిత్వ మహాంభోరాశిని మథించి తీసిన సారస్వత నవామృతం' సి.నారాయణరెడ్డిగారి సిద్ధాంత గ్రంథం. నూటికి తొంభైమంది విధ్వాంసులు తమ పరిశోధన గ్రంథం స్థాయిలో మరో పుస్తకం రాయకపోవడం, సిద్ధాంత గ్రంథ రచనకు వెచ్చించినంత కాలం, శ్రమ, వ్యయం మరో రచనకు కేటాయించకపోవడమే పరిశోధన ప్రాముఖ్యాన్ని, ప్రాధాన్యాన్ని తెలుపుతుంది."(విశ్వవిద్యాలయాల్లో తెలుగు పరిశోధన, పుట: 28)ఇది ఇలా ఉంటే ఆధునిక కాలంలో వస్తున్న పరిశోధనలు అంతటి ప్రాధాన్యాన్ని సంతరించుకోవడం లేదు అనేది విమర్శకుల అభిప్రాయం. దీనికి అనేక కారణాలు ఉన్నాయి. ఇప్పటి వరకు కేవలం తెలంగాణ ప్రాంతం నుండే కొన్ని వందల పరిశోధనలు వచ్చాయి. వాటిలో అద్భుతంగ శ్రమపడి అనేక విషయాలని వెలుగులోకి తెచ్చిన పరిశోధనలు కూడా లేకపోలేదు. అందులో ముఖ్యంగా 'తిమ్మాజీపేట మండల మౌఖిక భాష-వర్ణానాత్మక వ్యాకరణం' అనే అంశం మీద పరిశోధన చేసిన ఎస్. చంద్రయ్య విషయసేకరణ కోసం ఎంతో శ్రమ పడ్డారు. అదేవిధంగా 'తెలంగాణ ప్రాంత కవిత్వం-స్థానియత' అనే అంశం మీద పరిశోధన చేసిన తైదల అంజయ్య,



'కరీంనగర్ జిల్లా కవిత్వం-వస్తు రూప విశ్లేషణ(2001-2010)' అనే అంశం మీద పరిశోధన చేసిన జి.రాజేష్, 'తెలంగాణ మాండలిక కవిత్వం' మీద పరిశోధన చేసిన ఎ.పరమాత్మ, 'పాలమూరు జిల్లా వచన కవిత్వం ఆర్థిక సామాజిక విశ్లేషణ' అనే అంశంపై పరిశోధన చేసిన బి.వెంకటయ్య, 'నిజామాబాదు జిల్లా వర్తమాన కవితా వికాసం(1970-2000)' అనే అంశంపై సిద్ధాంథ గ్రంథాన్ని సమర్పించిన వి.శంకరయ్య, 'సామ్రాజ్యవాద ప్రపంచీకరణ వ్యతిరేక కవిత్వం'పై పరిశోధన చేసిన ప్రొఫెసర్ సి.కాశీం వంటివారు ఆధునిక పరిశోధనా రంగంలో వస్తు-రూప విశ్లేషణ చేసి ఒక నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారు. ఇలా చెప్పుకుంటూ పోతే సమాజ గతిని మార్చే తెలంగాణ పరిశోధనలు చాలానే ఉన్నాయి.

**తెలంగాణా ప్రాచీన పరిశోధన:**

తెలంగాణ ప్రాంతానికి ఘనమైన సాహిత్యం, చరిత్ర ఉన్నది. తెలుగు సాహితీ క్షేత్రంలో ఈ ప్రాంతానికి సముచిత స్థానం ఉంది. తెలంగాణ ప్రాంతం ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాల్లో నిలదొక్కుకుంటూ, తన అస్తిత్వాన్ని కాపాడుకుంది. మరో పక్కన సాహితీ, సాంస్కృతిక, పరిశోధన, రాజకీయ వారసత్వ గొప్పతనాన్ని ప్రపంచ నలుదిక్కులకు చాటింది. అంతేగాక ఉద్యమాలకు, కళలకు పుట్టినిల్లుగా భాసిల్లుతున్న తెలంగాణ దేశంలోనే ప్రత్యేకతని సంతరించుకుంది.

కవిత్వంలో వచనం ప్రయోజనకరమైన వ్యక్తీకరణ. ఇందులో భావం ప్రధానం. భావాన్ని అనుభూతింప చేయనిది కవిత్వం కాదు. ఈ భావం భాష ఇచ్చే భావం కన్నా విభిన్నమైంది. అంటే కవితాత్మకమైంది. దేని గురించి కవిత్వం చెబుతున్నామో, దానికి సంబంధించిన భావం సమగ్రంగా కవికి కావాలి. తెలంగాణ ప్రాంతంలో వచ్చిన పరిశోధనలని ఒక్కసారి గమనిస్తే చాలా అంశాలు భోదపడతాయి. ప్రాచీన సాహిత్యంలో పద్యకవిత్వం మధ్యలో వచనం ఉంది. క్లిష్టపద అర్థ, తాత్పర్యాలు, విశేషణా గ్రాహ్యానికి వచనం అవసరమైంది. అంటే ఇక్కడ వచనత్వాన్ని వదిలి ఏ ప్రక్రియ ఉండలేదని తెలుస్తుంది. దీనిని బట్టి వ్యవహారంలో వచనానికిగల ప్రాధాన్యత తెలుస్తుంది. అయితే ప్రాచీన కాలంలో కవులు తమ కావ్యాల్లో పద్యానికి ప్రాధాన్యత ఇవ్వడం కన్పిస్తుంది. ఎక్కువ భాగం పద్యం, తక్కువ భాగంలో వచనాన్ని వాడారు. వచనంలోనూ అలంకారాది వ్యాకరణాలను పాటించటం వలన అది పద్య గమనంలో కలసిపోయేదిగా ఉంది. వారు రాసిన వచనానికి అర్థతాత్పర్యాలు అవసరమైనాయి. ఈ క్లిష్టత ప్రాచీన కవుల పాండిత్యానికి తార్కాణమైంది. ఈ కోవలో చంపూకావ్యాలను రాయడంలో కవులు తమ ప్రతిభని కనబరిచారు. ప్రాచీన కవిత్వంలోని వచనానికి ఆధునిక కాలంలోని వచనానికి తేడా స్పష్టంగా కన్పిస్తుంది. ప్రాచీన కవిత్వంలో వచనం ప్రధానంగా వ్యాకరణ కట్టుబాట్లను ఛేదించుకుని ముందుకు వెళ్ళలేదు. అందుకు

సామాజిక, రాజకీయ, ఆర్థిక నేపథ్యం భూమిక వహిస్తుంది. కుల, మత పరిధులలో కట్టుబొట్టు నియమాలతో సమాజం భయంతో మెదిలింది. ఫ్యూడల్, భూస్వామ్య విధానాలు, అవి వాటి స్వప్రయోజనాల కోసం నిర్ణయించుకున్న గిరిలోనే ప్రజల్ని ఉంచారు. నిరంకుష పాలనలో ప్రజలు చిత్రహింసలకు గురయ్యారు. ఎంతోమంది అవమానాల పాలయ్యారు. ఇలాంటి అంశాలను తెలంగాణ పరిశోధకులు తమ పరిశోధనల ద్వారా వెలుగులోకి తీసుకురావటం జరిగింది. నేటికీ ఆ పరంపర కొనసాగుతున్నది.

తెలంగాణ ప్రాంతానికే కాదు సాహిత్యానికి ప్రత్యేకమైన చరిత్ర ఉన్నది. తెలుగు సాహిత్యంలో శిఖరాయమాణులైన కవులెందరో తెలంగాణని పునీతం చేసినవారే. నిజానికి తెలంగాణకి అఖండ ఖ్యాతినర్జించి పెట్టినవారిలో మొదటి వరుసలో చెప్పుకోదగినవాడు, క్రీ.పూ. 200-150 ప్రాంతానికి చెందినవాడు, వ్యాస వాల్మీకుల సరసన చేర్చదగిన మహాకవి గుణాద్యుడు. సకల కథా ప్రపంచానికి మూలమైన 'బృహత్కథ'ని రచించి తెలంగాణ మొదటి లిఖిత కవిగా సాహితీ చరిత్రలో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నాడు. అదే విధంగా సాహిత్య చరిత్రలో తెలంగాణ మణిహారంగా తిరుగులేని స్థానాన్ని పొందిన మల్లినాథసూరి, విద్యారణ్య సాయణాచార్యులు తెలంగాణవారే. "ఈ సాహిత్యం భిన్న ప్రక్రియల్లో సాగింది. ఎన్నో కొత్త ప్రక్రియలు మౌలికమైన రచనలు ఇక్కడి తెలుగు సాహిత్యంలో ఆవిర్భవించాయి. ఇతర ప్రాంతాల కవులకు ఆదర్శమైనాయి. కావ్యాలు, పురాణాలు, ఇతిహాసాలు, భక్తి కావ్యాలు, ప్రబంధాలు, శతకాలు, యక్షగానాలు మహాపురుషుల జీవిత చరిత్రలు, కీర్తనలు, వచనాలు, గేయాలు మొదలైన ప్రక్రియలనెన్నింటినో తెలంగాణ తెలుగు సాహిత్యంలో కవులు సృష్టించారు. అపారమైన జానపద సాహిత్య సృష్టి ఇక్కడ జరిగింది. ద్విపద అచ్చమైన తెలుగు ఛందస్సు. దాన్ని తెలంగాణ కవులు మహాకావ్య రచనకు అనువైన ఛందస్సుగా తీసుకొని గౌరవాన్ని ఇచ్చారు. ద్విపద పాడుకోవటానికి చాలా అనువైన ఛందస్సు. గోనబుద్ధారెడ్డి రామాయణాన్ని ద్విపదలో రాశాడు. ఆ ద్విపదలు పామరుల్లో పాటలుగా వ్యాప్తిలో ఉన్నాయి. మొదటి నుంచి పాట మీద అభిమానమున్న తెలంగాణ కవులు ప్రజలూ ద్విపదని ఆదరించారు. తెలుగులో మొట్టమొదటి రామాయణం గోన బుద్ధారెడ్డి రచించిన రంగనాథ రామయణమే. అది తెలంగాణలోనే వెలువడింది. పాల్కురికిసోమన మహాపురుషులైన బసవన్న, మల్లికార్జున పండితారాధ్యుల చరిత్రలను మహాకావ్యంగా రాస్తూ ద్విపద ఛందస్సునే గ్రహించాడు. మహాపురుషుల భక్తుల చరిత్రలను తీసుకొని దేశీయమైన ఇతివృత్తంతో తెలుగులో అనువాదం అనుసరణ కాని స్వతంత్రమైన ఇతివృత్తంతో పాల్కురికి సోమన మహాకావ్యాలు రాయటం తెలంగాణలోనే జరిగింది. తెలంగాణలోనే మొదట కందపద్యం కన్పించింది. ఆ కందంలోనే బద్దెన సుమతీ శతకాన్ని రచించాడు. తెలంగాణలో నన్నయకు పూర్వమే శతకం రచించబడింది. ఒక వేళ సుమతీ శతకాన్ని కాదన్నా పాల్కురికి సోమన రచించిన 'వృషాధిప' శతకం తెలుగులో సంపూర్ణ శతక లక్షణాలున్న మొదటి శతకమవుతుంది. తెలంగాణలోనే కవిజనాశ్రయమనే తెలుగులో మొదటి ఛందోగ్రంథం రచింపబడింది. తెలుగులో మొట్టమొదటి యక్షగానం రుద్రకవి రచించిన 'సుగ్రీవవిజయం' తెలంగాణలోనే రచించబడింది. ఇక్కడే తెలుగు సాహిత్యంలో మొదటి వచనాలు కీర్తనలు వెలువడ్డాయి. తెలంగాణలోనే తెలగన మొట్టమొదట అచ్చతెనుగు కావ్యాన్ని రచించి ఒరవడి పెట్టాడు. తెలంగాణలోనే సామాన్య జనుల నానుడితో కూడిన తెలుగుకు ప్రాధాన్యమియ్యాలన్న ఉద్యమాన్ని శివకవులు లేవనెత్తారు. తెలుగు పలుకుబడికి ప్రాధాన్యమియ్యాలనే 'అచ్చ తెనుగు' కావ్యాలు వ్రాయటానికి ఇక్కడే శ్రీకారం చుట్టబడింది. మడికి సింగన కూర్చిన 'సకలనీతి సమ్మతం' తెలుగులో మొదటి సంకలన గ్రంథం. ఓరుగల్లు నివాసి ఏకామ్రనాథుడు వ్రాసిన 'ప్రతాపరుద్ర చరిత్రం' తెలుగులోమొదటి చారిత్రక రచనయే కాక తెలుగులో మొదటి వచన గ్రంథం. ఓరుగల్లు నివాసి విద్యానాథుడు వ్రాసిన 'ప్రతాపరుద్ర యశోభూషణం' ఆంధ్రదేశంలో సంస్కృతంలో వ్రాయబడిన మొదటి అలంకార శాస్త్ర గ్రంథం'.(ముంగిలి: 2009: XXX) అదేవిధంగా పంపకవి, మల్లియరేచన, వేములవాడ భీమకవి, బమ్మెర పోతన, కామినేని కవులు, పిల్లలమర్రి పినవీరభద్రుడు, కాసె నర్సప్ప, గుజ్జరి ఎల్లాదాసు, చింతపల్లి దున్న ఇద్దాసు, హయగ్రీవాచార్యులు, మన్నెంకొండ హనుమద్దాసు, గడ్డం రామదాసు మొదలగువారు ఎందరో తెలంగాణ ప్రాచీన సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు.

ప్రాచీన సాహిత్యంపై అనేక పరిశోధనలు జరిగాయి వాటిల్లో ముందువరసలో పేర్కొనదగినవి ఎ.సూర్యనారాయణ మూర్తి అనే పరిశోధకుడు డా.హరిశివకుమార్‌గారి పర్యవేక్షణలో కాకతీయ విశ్వవిద్యాలయంలో 'పాల్కురికి సోమనాథుని రచనలు -సామాజిక, సాంస్కృతిక పరిశీలనలు' అనే అంశంపై పరిశోధన

చేసి 1998లో డిగ్రీని పొందారు. అదేవిధంగా 1979లో శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఆర్. వెంకటసుబ్బయ్య అనే పరిశోధకుడు జి.ఎన్.రెడ్డిగారి ఆధ్వర్యంలో 'పాల్కూరికి సోమన రచనల్లో భాషా ప్రయోగ విశేషాలు' అనే అశంపై పరిశోధనచేసి పి.హెచ్.డి పట్టం పొందారు. మద్రాసు విశ్వవిద్యాలయంలో 1940లో వి.వి.రాఘవయ్య అనే పరిశోధకుడు 'నన్నెచోడ మల్లికార్జునుల కృతుల్లో భాష' అనే అంశంపై పరిశోధన చేసి 1940లో గ్రంథాన్ని సమర్పించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో కె.కుసుమాబాయిగారు 'మడికి సింగన కృతులు-పరిశీలన' అనే అంశాన్ని బి.రామరాజు పరిశోధన చేసి 1960లో పి.హెచ్.డి పట్టాని పొందారు. 1976లో కాకతీయ విశ్వవిద్యాలయంలో ఎ.భూమయ్య అనే పరిశోధకుడు 'కొరవి గోవరాజు కవిత్వం వరిశీలన' అనే అంశాన్ని కె.సుప్రసన్నాచార్యగారి పరిశోధన చేసి పరిశోధనా గ్రంథాన్ని సమర్పించడం జరిగింది. 1968లో శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో టి.కోదండరామయ్య అనే పరిశోధకుడు జి.యన్.రెడ్డిగారి పర్యవేక్షణలో'ఆంధ్ర సాహిత్యంలో దేశి కవితోద్యమం-పాల్కూరికి సోమనపాత్ర' అనే అంశం మీద పరిశోధన చేశారు. 1969లో 'పోతన భాగవతంపై దూళిపాక శ్రీరామమూర్తి, అదేవిధంగా 1980లో భాస్కర రామాయణంపై ఆర్.శ్రీహరిగారు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి డాక్టరేటుని పొందారు. 1989లో 'మరింగంటి కవుల సాహిత్యసేవ' అనే అంశంపై కె.సంపత్కుమారాచార్య వర్యవేక్షణలో యన్.శ్రీరంగచార్యగారు కాకతీయ విశ్వవిద్యాలయానికి తన పరిశోధనా గ్రంథాన్ని సమర్పించారు. ఈ పరిశోధనల్లో ప్రధానంగా భాషను విశ్లేషించడం, కవిత్వానికి సంబంధించిన ప్రస్థావన, సామాజిక పరిస్థితులను పరిశీలించటం, చారిత్రక, సాంస్కృతిక, భౌగోళిక విశేషాలను పరిశీలించే ప్రయత్నం జరిగింది.

తెలంగాణ ప్రాంతంలో వచ్చిన పరిశోధనల్ని ఆసాంతం గమనిస్తే సమగ్రం కాదనే చెప్పలి. ఎందుకంటే ఇక్కడి సమాజంలోని చాలా అంశాలు వెలుగులోకి రాకుండా ఉండిపోయాయి. వాటిని పరిశోధించాల్సిన అవసరం ఉంది. గతం పునాదుల మీదనే వర్తమానం నిర్మాణమవుతుందనే చారిత్రక సత్యాన్ని దృష్టిలో ఉంచుకుని గతంలో మిగిలిపోయిన అంశాలపై పరిశోధన జరిగితే తెలంగాణ సాహిత్య చరిత్ర మరింత బలంగా రూపుదిద్దుకునే అవకాశం ఉంది. పరిశోధించాల్సిన అంశాల్లో కొన్ని ఆమంచర్ల గోపాలరావు, అద్దూరి అయోధ్యరామకవి(ఖమ్మం-ఇల్లెందు), గాదేపల్లి వీర రాఘవ శాస్త్రి(గద్వాల సంస్థాన కవి), శేషభట్టరు వేంకటరామానుజా చార్యులు(నల్గొండ-భువనగిరి), నెల్లూరి కేశవస్వామి (హైదరాబాదు), మరింగంటి కవుల సాహిత్య కృషి, గడ్డం రామదాసు(మెదక్-మిరుదొడ్డి), గుమ్మన్నగారి లక్ష్మీనరసింహశర్మ (మెదక్-పోతరెడ్డిపేట), వేలేటి అంబదాసశర్మ(మెదక్-దుబ్బాక) మొదలగునవి.

**తెలంగాణా ఆధునిక పరిశోధన:**

వివిధ కవులు ఒకవాదం గురించో, ఉద్యమం గురించో, ధోరణి గురించో రాసిన కవిత్వాన్ని పరిశోధించడం జరిగింది. భాషాశాస్త్ర సంబంధమైన పరిశోధనలు జరిగాయి. కానీ ఒక భౌగోళిక ప్రాంతంలో ఉన్న కవులు ఒక సాహిత్య యుగంలో వచ్చిన అనేక మార్పుల్ని ఎలా అర్థం చేసుకున్నారు, ఎలా కవిత్వీకరించారు అన్నది, మరిన్ని జిల్లాలకు సంబంధించిన కవుల వచన కవిత్వాన్ని పరిశోధించడం జరగలేదు. జరగాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆధునిక కవిత్వానికి సంబంధించి వస్తు-రూప విశ్లేషణతో వెలువడిన పరిశోధన, ముద్రిత గ్రంథాలను కొన్నింటిని సమీక్షించడమైంది. వాటిలో ముఖ్యమైన వాటిని ఇక్కడ పేర్కొంటున్నాను. సి. హెచ్. ఆంజనేయులు గారి 'తెలంగాణ వచన కవిత్వం-విశ్లేషణ' అనే పరిశోధన గ్రంథం. డి. ఉదయ్ భాను గారి 'తెలంగాణ కవిత్వం-మౌళిక భావనలు' అనే పరిశోధన గ్రంథం, డా. బెల్లంకొండ సంపత్ కుమార్ గారి '20వ శతాబ్దపు మెదక్ జిల్లా రచయితల సాహిత్యం - వివిధ ధోరణులు' అనే పరిశోధన గ్రంథం, డా. ఎస్. చంద్రయ్య గారి 'తెలంగాణ ఉద్యమ కవిత్వం-భాషా వైవిధ్యం' అనే పరిశోధ గ్రంథం, 1983లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి హైదరాబాదు వారి ఆధ్వర్యంలో వెలువడిన 'తెలుగులో పరిశోధన'(సమీక్షా వ్యాస సంకలనం), ఆచార్య వెలుదండ నిత్యానందరావుగారి ఆధ్వర్యంలో వచ్చిన 'విశ్వవిద్యాలయాల్లో తెలుగు పరిశోధన' అనే పుస్తకం, గరిగె రాజేష్‌గారి 'జులూస్' కవితా సంకలనం - భాషా సాహిత్య పరిశీలన' అనే పరిశోధన గ్రంథం, మెరుగు రాంచందర్‌గారి 'తెలంగాణ వచన కవిత్వం - సామాజిక చైతన్యం' అనే పరిశోధన గ్రంథం, మొగిలి తిరుపతయ్యగారి 'అనేక' కవితా సంకలనం -వస్తు రూప విశ్లేషణ' అనే పరిశోధన గ్రంథం, వీటితో పాటుగా కవిత్వ తత్వాన్ని పట్టి ఇచ్చే గ్రంథాలు, సాహిత్య వ్యాసాలు మొదలైనవి.

తెలంగాణ కవికి కవిత్వం గాలి ఊసులు కావు. ఆకాశంలో విహరించే ఊహాగానాలు కావు. వెన్నెలల వెలుగులు, ఇసుక తిన్నెలు ఇక్కడి కవిత్వంలో లేవు. ఇక్కడి జీవితంలో లేవు. ఈడ్చుకుపోయిన డొక్కలు, తడసిన కన్నులు, ఎండిన చెరువులు, భూములు, తల్లడిల్లే హృదయాలు, మట్టి మనుషుల శ్రమైక జీవనసౌందర్యం మొదలైనవి తెలంగాణ కవిత్వంలో కనిపిస్తాయి. ఇక్కడి నిజ జీవితమే కవికి వస్తువు. రోధనలు, నరక యాతనలు, రక్తసంబంధాలు, బాధలు, భారమైన బతుకులు వీటిలోంచి కవిత్వం తన్నుకొస్తది. తల్లడిల్లుతది. అది తడిమిన హృదయాల్ని తడి చేస్తది. అలా పురుడుపోసుకున్న తెలంగాణ కవిత్వంలో ప్రపంచీకరణ ప్రభావం వల్ల అన్యాయం పాలైన పల్లెవాసుల వ్యథలు, వృత్తులన్నీ పోయి బజారుపాలైన వృత్తికారుల కథలు, ఆంధ్ర పాలకుల చేతుల్లో అన్యాయానికి గురైన తీరు, వివక్ష, దోపిడి, అణచివేత, కాలం కన్నెర్రచేస్తే పొట్టచేతపట్టుకొని దీనంగా పల్లెతల్లినొదిలి వలసెళ్ళిపోతున్న ప్రజల కన్నీళ్ళు, మనసు, మానవత్వం కలగలిసిన గ్రామాల పరిస్థితి అన్ని కూడా తెలంగాణ నుండి వచ్చిన కవిత్వ పరిశోధనా గ్రంథాల్లో కళ్ళకు కట్టినట్లుగా ఇక్కడి పరిశోధకులు వివరిస్తూ విశ్లేషించారు.

''తెలంగాణలో నూతన సాహిత్యావతరణను గ్రంథాలయోద్యమం నుంచి, ఆంధ్రోద్యమం నుంచి, పరిశోధకోద్యమం నుంచి విడిగా చూడలేము. ఉద్యమ రంగం మీదికి రాకముందే వ్యక్తిగత స్థాయిలో జరిగిన ప్రయత్నాలు(హితబోధిని వంటివి), ఉద్యమం స్థాయికి మించి వ్యక్తిగత స్థాయిలో వ్యక్తమైన ప్రతిభ(ఒద్దిరాజు సోదరులు), ఉద్యమం ఆకాంక్షలకు మించి విజ్ఞతను, సంస్కరణ శీలతనీ, హేతువాదాన్ని కనబరచిన వ్యక్తిత్వాలు(సురవరం ప్రతాపరెడ్డి), మొత్తం తెలుగు వారందరూ తెలుసుకుని సొంతం చేసుకుని నేర్చుకోవలసిన జీవితాలు(భాగ్యరెడ్డి వర్మ)–తెలంగాణలో ఉన్నాయి. అయితే ప్రధానంగా తెలంగాణ సాహిత్యం అంతా తెలంగాణ తనను తాను తెలుసుకుని, తన ఆకాంక్షలను నిర్మించుకునే క్రమంలో ఎదిగినదే"(కె. శ్రీనివాస్. పుట: 492) సరిగ్గా తెలంగాణ కవిత్వ పరిశోధన కూడా ఇలాంటి సందర్భంలోంచి వచ్చిందే. తెలంగాణ సాంస్కృతిక వికాస చరిత్రలో గోలకొండ కవుల సంచిక ఒక కీలకమయిన ఘట్టం. బహిరంగంగా తెలంగాణ ఆత్మాభిమాన ప్రకటన జరిగిన మొట్టమొదటి సన్నివేశం. ముడుంబై వెంకట రాఘవాచార్యులు 'నిజాం రాష్ట్రంలో ఆంధ్ర కవులు పూజ్యం' అన్న మాటకు సురవరం ప్రతాపరెడ్డి తీవ్రంగా స్పందించారు, బాధపడ్డారు. తెలంగాణ ప్రజలు, కవులంటే ఇతర ప్రాంతాలవాళ్లలో ఉన్న చులకన భావాన్ని భరించలేకపోయారు. 1932 నుండి దాదాపు రెండు సంవత్సరాల పాటు తీవ్రంగా కష్టపడి తెలంగాణ ప్రాంతమంతా తిరిగి నివురుగప్పిన నిప్పువలె ఉన్నటువంటి కవుల/కళాకారుల ప్రజ్ఞా, పాండిత్యాన్ని బయటకు తీశారు. 1934లో డిసెంబర్ నెలలో 'గోలకొండ కవుల సంచిక'ని ఎంతో వ్యయ ప్రయాసలకు వోర్చి 354మంది కవుల కవిత్వాలను వారి వివరాలతో సహా సేకరించి ఈ సంచికలో పొందుపరిచారు. సురవరం ప్రతాపరెడ్డిగారు చేసిన ఈ పరిశోధన తెలంగాణ సాహిత్య గతిని మార్చేసింది. తెలంగాణలో సైతం వందల సంఖ్యలో కవులున్నారని ఈ సంచిక ద్వారా నిరూపించాడు. ఇందులో కుల, మత, లింగ తారతమ్యం లేకుండా అన్ని వర్గాలవారి రచనల్ని సేకరించి అచ్చువేశారు. ఇది తెలంగాలో వచ్చిన మొదటి కవితా సంకలనమే కాదు మొదటి పరిశోధనగా దీన్ని చెప్పవచ్చు. ఇది తెలంగాణ కవుల భావ విపంచిక. ఈ సంచిక రాక మునుపు తెలంగాణ ప్రాంతంలో కవులే లేరని విర్రవీగిన వాళ్ళకు ఇది ఒక చెంపపెట్టుగా ఈ ప్రాంతానికి చెందిన చాలామంది సాహితీవేత్తలు అభిప్రాయ పడ్డారు.

తెలంగాణ ప్రాంతం నుండి వచ్చిన కవిత్వం మీద అనేక పరిశోధనలు జరిగాయి కాని నిర్దిష్టంగా వివిధ జిల్లాల నుండి వచ్చిన కవిత్వం మీద పరిశోధనలు జరగాల్సిన ఆవశ్యకత ఎంతో ఉంది. ఆధునిక కాలంలో ముఖ్యంగా అస్థిత్వ ఉద్యమాలు బయలుదేరిన సందర్భంలో, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసుకున్న తరుణంలో తెలంగాణ సాహిత్యాన్ని, సామాజిక రంగాన్ని పునర్ నిర్మించుకోవలసిన ఒక అవసరాన్ని గుర్తించి అనేక పరిశోధనలు వస్తున్నాయి. తెలంగాణకు మొదటి నుంచి కవిత్వంతో పేగుబంధం ఉంది. తెలంగాణ ఉద్యమంలో లేదా ఇక్కడి ప్రజల్ని చైతన్యవంతం చేయటంలో సాహిత్యం, కవిత్వం, పాటలు ప్రముఖ భూమికను పోషించాయి. "ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచీ తెలంగాణ ప్రాంతానికి నిధుల కేటాయింపులోనూ, అభివృద్ధి పథకాలలోనూ, నీటి పారుదల పథకాలు చేపట్టి ఎక్కువ భూమిని సాగునీటి సౌకర్యం కల్పించటంలోనూ, స్థానికులకు విద్యా, ఉద్యోగావకాశాలు కల్పించడంలోనూ, ఆర్థిక, రాజకీయ,

సామాజిక, సాంస్కృతిక సంస్థలలో నిర్ణయాధికారాన్ని కల్పించటంలోనూ తెలంగాణ పట్ల, తెలంగాణ వాసుల పట్ల అన్యాయం, వివక్ష అమలయ్యాయి."(వేణుగోపాల్, ఎన్. పుట: 34) కనుక అయా రంగాల్లో జరిగిన దోపిడీ, వివక్షలను తెలంగాణ కవి నిరసించిన విధానాన్ని, పుటలకొద్దీ కవిత్వం వచ్చిన సందర్భాలని 'తెలంగాణ ఉద్యమకవిత్వం–మౌలిక భావనలు(2000–2010)'–డి. ఉదయభాను, 'తెలంగాణ వచన కవిత్వం – సామాజిక చైతన్యం' మెరుగు రాంచందర్, 'మెదక్ జిల్లా ఆధునిక కవిత్వం–సమగ్ర పరిశీలన(1930–2000)'–వి. వెంకటేష్, 'కరీంనగర్ జిల్లా కవిత్వం–వస్తు రూప విశ్లేషణ(2001–2010)' –జి.రాజేష్ మొదలగు పరిశోధకులు తెలియజేయటమే కాకుండా తెలంగాణ ఆత్మని పట్టి ఇచ్చే అనేక అంశాలని తమ పరిశోధనల్లో పేర్కొన్నారు.

సాహిత్య వస్తువులో కూడా సామాజిక జీవితమే ఉంటుంది. ప్రకృతిలో, సమాజంలో ఏ వస్తువైనా తనకోసం తాను ఉండనట్లే ప్రతి వస్తువు ఇంకో వస్తువుకో లేక జీవికో ఏదో ఒకదానికి ఉపయోగపడుతుంది. కళ కూడా కళ కోసం కాదు అది ప్రజల కోసం. కళ సామాజిక ప్రయోజనం కోసమనేది తెలంగాణలో జరిగిన పరిశోధనలు నిర్ద్వందంగా నిరూపించాయి. అంతేగాక సాహిత్యంలోని వస్తువు కూడా సాహిత్యం కోసం కాదు అది సమాజం కోసమే. సామాజిక ప్రయోజనమే దాని పరమావధిగా ఉంటుందని నేటి ఆధునిక పరిశోధనలు నిరూపిస్తున్నాయి. అందులో ముఖ్యంగా హైదరాబాదు విశ్వవిద్యాలయంలో పిల్లలమర్రి రాములు పర్యవేక్షణలో 'కరీంనగర్ జిల్లా కవిత్వం–వస్తు రూప విశ్లేషణ(2001–2010)' అనే అంశంపై జి. రాజేష్, "అనేక' కవితా సంకలనం – వస్తు రూప విశ్లేషణ' అనే అంశంపై మొగిలి తిరుపతయ్య, కాకతీయ విశ్వవిద్యాలయంలో బన్న ఐలయ్యగారి పర్యవేక్షణలో'తెలంగాణ వచన కవిత్వం 'విశ్లేషణ' అనే అంశంపై సిహెచ్. ఆంజనేయులు, తెలంగాణ విశ్వ విద్యాలయంలో కె.లావణ్యగారి పర్యవేక్షణలో'మెదక్ జిల్లా ఆధునిక కవిత్వం–సమగ్ర పరిశీలన(1930–2000)' వి.వెంకటేష్, అదేవిధంగా హైదరాబాదు విశ్వవిద్యాలయంలో బాణాల భుజంగారెడ్డిగారి పర్యవేక్షణలో 'తెలంగాణ వచన కవిత్వం–సామాజిక చైతన్యం' అనే అంశంపై మెరుగు రాంచందర్ మొదలగువారు చేసిన పరిశోధనలు.

రూపం భావజాల పరమైన స్వభావం కలిగి సామాజిక అంశాలను ప్రతిబింబించేదిగా ఉంటుంది. సాహిత్య రూపంలో వచ్చే మార్పు సామాజిక మార్పుని సూచిస్తుంది. విషయంలో ఆధునికత రూపంలో కూడా ఆధునికతని కోరుతుందని విమర్శకుల భావన. అందుచేతనే భావకవిత్వం, అభ్యుదయ కవిత్వం, దిగంబర కవిత్వం, విప్లవ కవిత్వం, స్త్రీవాద కవిత్వం, దళిత కవిత్వం రూపాలు వేరువేరుగా ఉంటాయి. వీటికి ఆధారమైన సామాజిక పరిస్థితులు, సంఘర్షణలు వేరుగా ఉండటం రూపంలో కూడా వైవిధ్యం ఉండటానికి కారణ మవుతాయి. ఇలా నూతన సాహితీ రూపాలు నూతన జీవన విధానాన్ని సూచించటం మనం గమనిస్తుంటాం. అయితే సాహిత్యాన్ని సామాన్య ప్రజానీకానికి అందుబాటులో ఉంచడం కోసం చాలామంది సాహితీవేత్తలు కృషి చేశారు. ముఖ్యంగా ప్రజల్లో సాంస్కృతిక స్థాయిని పెంపొందించడం కోసం అనేక ప్రయత్నాలు చేశారు. అందులో భాగమే ఈ రూపం. ఈ రూపంలో కవి/రచయిత తనలోని భావాలని పాఠకునికి అందించడం కోసం ఆకర్షణీయమైన భావచిత్రాలు, స్పష్టమైన భావప్రకటన, ప్రగాఢ సంవేదన, అర్థవంతమైన భాషను వాడతారు. ఇలా వాడినప్పుడే రచయిత కళాత్మక నైపుణ్యం, శిల్ప చాతుర్యం, పద, భావ చిత్రాల విశిష్టత, భావ ఔచిత్యం మొదలగునవి సాక్షాత్కరిస్తాయి. రూపానికి సంబంధించిన అనేక పరిశోధనలు తెలంగాణ సాహిత్యంలో జరిగాయి. 1999లో తెలుగు విశ్వవిద్యాలయంలో 'సి.నా.రె కలంసాక్షి కావ్యం వస్తురూప విశ్లేషణ' అనే అంశంపై జి.స్వామి వై.సుధాకరరావు గారి పర్యవేక్షణలో పరిశోధన గ్రంథాన్ని సమర్పించారు. అదేవిధంగా హైదరాబాదు విశ్వవిద్యాలయంలో'అనేక' కవితా సంకలనం –వస్తు రూప విశ్లేషణ'అనే అంశంపై మొగిలి తిరుపతయ్య పిల్లలమర్రి రాములుగారి ఆధ్వర్యంలో ఎంఫిల్ పరిశోధనా వ్యాసాన్ని సమర్పించారు. ఇదే విశ్వవిద్యాలయంలో 'కరీంనగర్ జిల్లా కవిత్వం–వస్తు రూప విశ్లేషణ(2001–2010)'అనే అంశంపై పరిశోధన జరుగుతున్నది. ఇది సమర్పనకు సిద్ధంగా ఉంది. 2017లో తెలంగాణ విశ్వవిద్యాలయంలో 'మెదక్ జిల్లా ఆధునిక కవిత్వం–సమగ్ర పరిశీలన(1930–2000)' అనే అంశంపై వి.వెంకటేష్ కె.లావణ్యగారి పర్యవేక్షణలో పరిశోధన గ్రంథాన్ని సమర్పించటం జరిగింది. ఇవే కాకుండా రూపం, శిల్పం మొదలగు అంశాల్ని ఉపశీర్షికలుగా, ప్రధాన శీర్షికలుగా తమ పరిశోధనల్లో పెట్టుకొని అనేక పరిశోధనలు వచ్చాయి. వీటిల్లో ప్రధానంగా రూపానికి సంబంధించిన చర్చ కన్పిస్తూ ఉంది.

20వ శతాబ్దంలో ముందుకొచ్చిన ఫలిత ప్రాధాన్యవాద (Pragmatism)తాత్విక ప్రభావంతో ఎవరి చరిత్రను వారే చెప్పుకోవాలన్న స్పృహ బలంగా ముందుకు వచ్చింది. ఆ తరువాతనే భిన్న సామాజిక వర్గాల వారు, భిన్న భౌగోళిక ప్రాంతాలవారు, భిన్న అంతస్థులవారు, తమగురించి తాము పరిశోధించుకోవడం, చారిత్రక మూలాలను వెలికితీయడం, వర్తమానంలో ఉన్న పరిస్థితుల్ని విశ్లేషించుకోవడం తీవ్రమైంది. ఈ క్రమంలోనే ప్రాంతాలవారీ సాహిత్య పరిశోధన, మళ్లీ ఒకే ప్రాంతంలోని ఒక భాగానికి సంబంధించిన సాహిత్య పరిశోధనలు మొదలయ్యాయి. దానికి అస్థిత్వ ఉద్యమాల ప్రేరణ ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ లేకపోలేదు. కనుక ఆంగ్లేయ పాలకులకు తైనాతిగా ఉన్న నిజాం ఏలుబడిలో ఉన్న తెలంగాణ జిల్లాల్లో 1930 తర్వాత నుండి భారత స్వాతంత్ర్యం తర్వాతి వరకు, అక్కడి నుండి తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం వరకు జీవించిన, జీవిస్తున్న కవులు వారు కవిత్వంలో ఎంచుకున్న వస్తువుని, దాన్ని వ్యక్తీకరించిన విధానాన్ని వివిధ విశ్వవిద్యాలయాల నుండి వచ్చిన పరిశోధనలు వ్యక్తీకరించాయి. తెలంగాణ కవులు రాసిన కవిత్వంలో అయా కాలాల్లో వచ్చిన వాదాలను, ఉద్యమాలను, ధోరణులను ఒక భౌగోళిక ప్రాంతానికి సంబంధించిన సాహిత్య సంబంధాలను దృష్టిలో ఉంచుకుని 'తెలంగాణ కవిత్వ పరిశోధన' అనే అంశంపై పరిశోధనా పత్రాన్ని రాశాను. నేను రాసిన ఈ వ్యాసంలో అనుబంధంలో పేర్కొన్న దాదాపు అన్ని పరిశోధనలు కూడా ఈ నేపథ్యంగా వచ్చిన పరిశోధనలే. అంతేకాకుండా 21వ శతాబ్దంలో తీవ్ర వ్యక్తివాద(Hyper Individualism)ప్రభావం జోరందుకుని వ్యక్తి భావాత్మకాంశాల కేంద్రంగా సాహిత్యం, సాహిత్య పరిశోధనలు పెరిగిపోతున్నాయి.

దాశరథి ఒక సందర్భంలో తెలంగాణ గురించి ఒక మాట అంటారు. దాన్ని ఇక్కడ గుర్తు చేసుకోవడం ఉచితం అని భావిస్తున్నాను. 'తెలంగాణకు ఏనాడు రాజకీయ ప్రతిపత్తి లేదు. ఉద్యమ ప్రతిపత్తి ఉంది. పోరాట ప్రతిపత్తి ఉంది. విప్లవ ప్రతిపత్తి ఉంది. ప్రపంచానికి తెలంగాణ విదీతమైంది ప్రజా పోరాటాల ద్వారానే' అంటారు. నిజంగా తెలంగాణలో వచ్చిన పరిశోధనలని గమనిస్తే అవన్నీకూడా ఒక ఉద్యమ ప్రాతిపదికన వచ్చినవే. అందుకే 'ఈనాడు తెలంగాణ గురించి ఆలోచించడం ఒక Inspiration. తెంగాణాలో పుట్టిపెరిగి, ఇక్కడి ప్రజా ఉద్యమాలకి అత్యంత సన్నిహితంగా ఉండటం ఒక సాహసం. ఒక అదృష్టం. ఎంతో దూరాన ఉన్న వాళ్ళకీ దాని 'సెగ' తగులుతుంటే దగ్గరగా ఉన్న వాళ్ళకీ, మరీ దగ్గరగా ఉన్న వాళ్ళమీద దాని ప్రభావమేమిటో వివరించనక్కర్లేదు అది వాళ్ళ కవిత్వం నిండా కనిపిస్తుంది. ఒక మూగ స్థితి, మాటరాని పరిస్థితి కల్పించబడుతుంది. అయినా భూమి పొరల్లో వ్యాపిస్తున్న అగ్నికి ఆనకట్టే వాడెవడు' అంటాడు కె. శివారెడ్డిగారు. తెలంగాణ కవికి వస్తువు చాలా విశాలమైంది. కవిత్వంలోనే అగ్నిని జ్వలింపజేసిన వారసత్వం తెలంగాణది. అలాంటి వారసత్వం కలిగిన తెలంగాణకి పరిశోధనా వారసత్వం కూడా ఉంది. తెలంగాణ సాహిత్యం, కవిత్వం మీద విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలు జరగటంతో పాటుగా విశ్వవిద్యాలయాలకు వెలుపల కూడా అనేక పరిశోధనలు జరిగాయి. వాటిని కూడా వెలుగులోకి తీసుకురావాల్సిన బాధ్యత భావి పరిశోధకులపై ఉంది. ఇందులో ముఖ్యంగా కాసుల ప్రతాపరెడ్డి, గుడిపాటి, సుంకిరెడ్డి నారాయణరెడ్డి, సంగిశెట్టి శ్రీనివాస్, ఎస్వీ సత్యనారాయణ, జిలుకర శ్రీనివాస్, పసునూరి రవిందర్, స్కైబాబ, సిధారెడ్డి మొదలైన మేధావి వర్గం విశేషమైన కృషిచేసి వ్యాసాలు, పుస్తకాలను ప్రచురించారు.వారు చేసిన కృషిని పరిశోధించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రజలే చరిత్ర నిర్మాతలు. గత వర్తమానాల సంఘర్షణలోంచి భవిష్యత్తును దర్శించే వాస్తవిక సామాజిక సంబంధాలు ప్రతిఫలించే కవిత్వాన్ని, దానిపై వచ్చిన పరిశోధనలని విశ్లేషించడం, సిద్ధాంత విలువలను ఆవిష్కరించటం ఈ పరిశోధన పత్ర ముఖ్యోద్దేశ్యం.

తెలంగాణలోని సాహిత్యం, కవిత్వంపై సమగ్రమైన పరిశోధనలు జరగవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. దీనిలో ఆయా విశ్వవిద్యాలయాల పాత్ర ఎంతో కీలకమైంది. గత, వర్తమాన కాలాల్లో జరిగిన, జరుగుతున్న పరిశోధనలని ఎప్పటికప్పుడు ఒకచోట క్రోడీకరించడం మూలంగా భావి పరిశోధకులకు తాము పైశోధించాల్సిన అంశాలపై ఒక స్పష్టమైన అవగాహన ఏర్పడుతుంది. అంతే కాకుండా గతంలో పరిశోధన జరిగిన అంశంపై మళ్ళీ పరిశోధన జరిగే అవకాశం తక్కువగా ఉంటుంది. ఇలాంటి ఒక విధానం లేకపోవటం మూలంగా జరిగిన అంశం మీదనే తిరిగి మరల పరిశోధనలు జరుగుతున్నాయి. కావున భావి పరిశోధకులు కొత్త(ఇదివరకు పరిశోధనకు ఎంచుకోని, పరిశోధన జరగని)అంశాల్ని తీసుకుని నిశితమైన దృష్టితో, అంకిత భావంతో, కాలం, శ్రమ, వ్యయం వెచ్చించి సమగ్రమైన పరిశోధనలని వెలువరించడం వలన మనం పోరాడి సాధించుకున్న నూతన రాష్ట్రంలో 'తెలంగాణ సాహిత్య చరిత్రని' మరింత బలంగా, ప్రామాణికంగా తయారు చేసుకునే అవకాశం ఉంది.

**ఉపయుక్త గ్రంథసూచి:**

1. ఉదయభాను. డి. 2012. తెలంగాణ ఉద్యమ కవిత్వం - మౌలిక భావనలు(2000-2010). పరిశోధనా వ్యాసం. హైదరాబాదు విశ్వవిద్యాలయం. హైదరాబాదు.

2. తెలుగులో పరిశోధన రజితోత్సవ సంచిక. 1983. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి. హైదరాబాదు.

3. నిత్యానందరావు వెలుదండ. 2013. విశ్వవిద్యాలయాల్లో తెలుగు పరిశోధన. హైదరాబాదు

4. ప్రతాపరెడ్డి సురవరం(సంపా). 2009. గోలకొండ కవుల సంచిక. తెలంగాణ జాగృతి ప్రచురణలు. తెలంగాణ.

5. భూమయ్య, అనుమాండ్ల. 2000. తెలంగాణ భావ విపంచిక గోలకొండ కవుల సంచిక. శ్రీమనస్వినీ ప్రచురణలు. వరంగల్లు.

6. మధుసూదనరావు, త్రిపురనేని. 1997. సాహిత్యంలో వస్తు శిల్పాలు. పర్‌స్పెక్టివ్స్ ప్రచురణ. హైదరాబాదు.

7. వెంకట రామారావు, జి. 2014. తెలంగాణ చరిత్ర. ఆంధ్ర సారస్వత పరిషత్తు. హైదరాబాదు.

8. వెంకటేష్. వి. 2017. మెదక్ జిల్లా ఆధునిక కవిత్వం- సమగ్ర పరిశీలన(1930 - 2000). సిద్ధాంత గ్రంథం. తెలంగాణ విశ్వవిద్యాలయం. డిచపల్లి. నిజామాబాదు.

9. వేణుగోపాల్, ఎన్. 2010. లేచినిలిచిన తెలంగాణ. స్వేచ్ఛాసాహితి ప్రచురణలు. హైదరాబాదు.

10. శ్రీనివాస్. కె. తెలంగాణ సాహిత్య వికాసం. 2015. తెలంగాణ ప్రచురణలు.

11. సంపత్‌కుమార్, మాడభూషి(సంపా). 2016. పరిశోధన: నిన్న, నేడు, రేపు. మద్రాసు విశ్వవిద్యాలయం, చెన్నై.

12. నుంకిరెడ్డి నారాయణరెడ్డి, అంబటి సురేంద్రరాజు(సంపా). 2002. మత్తడి(తెలంగాణ కయిత1917-2002). తెలంగాణా సాంస్కృతిక వేదిక. హైదరాబాదు.

13. సుజాతారెడ్డి, ముదిగంటి. 2015. తెలంగాణ తెలుగు సాహిత్య చరిత్ర. ఆంధ్ర సారస్వత పరిషత్తు. హైదరాబాదు.

★ **రచయిత: అధ్యాపకుడు**

కవిత్వం

# అక్షరతొవ్వ....

**విను**

నీ ప్రతిమ కోసం
పల్లెల్లో పాదు పోస్తే ఓర్వలేనోళ్ళే
పట్నంలో ఆకాశానికి ఎత్తినారు

నీ నామ జపం
ఓట్లను రాబట్టే యంత్రమైంది
నీ విగ్రహం
దేశ రాజకీయాలకు రాజధానైంది

రాజకీయ పెట్టుబడి కట్టిన
అంబరాన్ని తాకిన ఎత్తుకు సంబరమెందుకు
గడప గడప చందాలేసుకొని పేర్చితే
ఆధిపత్య ఆటుపోట్లను అధిగమించి నిలిచిన
ఆత్మగౌరవ శిథిల దిమ్మెలనైనా ముద్దాడుదాము

ఏడాదికి రెండు దండలేసి
జనన మరణ తారీఖులను
వేదిక మీద వల్లించినంత తేలిక కాదు
నీ పుట్టుక చావుల మధ్య సాగిన
ప్రతిఘటన బాటలో నడవడమంటే

నీవొక ధిక్కార తత్వం
ఏ దిక్కు లేనోళ్ళ అక్షర తొవ్వ
నీ ఉనికిప్పుడు...
పుస్తకం చిగురించిన జ్ఞాన భూమి
పీడితుల పిడికిళ్ళ నీలి పతాకం

# అసామాన్యుల చరిత్రకు దర్పణం 'ప్రణయ హంపి'

సిద్దెంకి యాదగిరి

*"తారీకులు దస్తావేజులు అవి కావోయ్ చరిత్రకర్థం...*
*ప్రభువెక్కిన పల్లకి కాదోయ్ దానిని మోసిన బోయీలు ఎవరు"*

అంటూ సామాన్యుని గురించి ఆలోచింపజేసిన తెలుగు సాహిత్యం అనేక ప్రక్రియల్లో వివిధ కోణాల్లో సాధారణ జీవితాలను ఆవిష్కరిస్తూనే ఉంది.

మనసు పెట్టి తడిమితే పునాదులలో దాగిన సామాన్యుని స్వేద పరిమళం తొవ్వినాకొద్ది జీవపు ఊటలా కనబతూ ఉంటది. ఎంత కప్పి పెట్టినా, ముల్లెగట్టిన సూది మొనలా పొడుచుకొని బయటికి వస్తూ ఉంటుంది.

సామాన్యుల బాధలను విపులీకరిస్తూ మారుతి పౌరోహితం రాసిన నవల "ప్రణయ హంపి" ఛాయా బుక్స్ హైదరాబాద్ వారు ప్రచురించిన చారిత్రక కాల్పనిక నవల.

ఇటీవల కాలంలో రాయలసీమ మాండలికములో అక్కడి ఆత్మను పట్టుకొని నెర్రలు వారిన జీవితాల్లోని విషాదాలను అక్షరాల్లో 'నీల్లింకని నేల' లాంటి కథలతో విలపిస్తూ... "ఊరిమర్లు" కథా సంపుటిని ప్రచురించి తెలుగు సాహిత్యంలో ప్రత్యేకత నేర్పరచుకున్న మారుతి పౌరోహితం అక్షరం మానవత్వానికి చిరునామా. మనిషి తత్వానికి పంచనామా.

సామాన్యుల సాహసం, సమాజ హితం కోసం పాటుపడే మనుషుల జీవితమే 'ప్రణయ హంపి' నవల.

చారిత్రక నవలలు దాదాపు రాజుల కోణంలోనూ, రాణుల కోణంలోనూ రాయబడ్డ కావ్యాలే. కానీ సామాన్యుల జీవిత గాథలను విజయనగర పతనంలోనూ సమాజ హితం కోసం పాటుపడ్డ యువతీ యువకుల ప్రేమ కథనే ఈ కాల్పానిక నవల.

కాకతీయుల తర్వాత తెలుగు నేలను ఏకఛత్రాధిపత్యంగా పరిపాలించింది విజయనగర సామ్రాజ్యం. నాలుగు వంశాలు, ఏడు తరాలు పరిపాలించిన విజయనగర సామ్రాజ్యంలో శ్రీకృష్ణదేవరాయల మరణానంతరం అరివీటి వంశపు అలియ రామరాయలు చిట్టచివరి రోజుల సామాజిక ప్రతిబింబమే ఈ నవల.

విజయదశమి పర్వదినాన తుళ్ళి పడుతున్న యవ్వనంతో హంపినగరం కేరింతలు కొడుతున్నది. ఉత్సవ ఆచారం ప్రకారం బలి నిర్ణయమైనది. మహిషాన్ని వధించడానికి ఆహ్వానించినా ఎవరూ ముందుకు రాలేని సమయంలో నేనున్నానని ధైర్యసహసాలతో ముందుకొచ్చి మహిషుడి అన్న వలె ఉన్న ఆ దున్నను ఒక్క వేటుతో నరికిన వీరుడు అనెగొంది సంబజ్జ గౌడ. వాయిద్యములు దిక్కులు పిక్కుటిల్లుతున్న వేళ, ప్రజల కేరింతల నడుమ అలియ రామరాయలు తన సింహాసనం నుంచి లేచి వచ్చి "భలా భళివీరుడా ! నీవంటి బలశాలి రాజ్యమునకు అవశ్యం" అని ఆలింగనం చేసుకున్నాడు. అదే రోజు రాత్రి విరూపాక్ష స్వామి ఆలయ వీధిలో ఆనెగొంది నివాసి ముద్దుకుప్పాయి నృత్య ప్రదర్శనకు మైమర్చి చూస్తున్నాడు. ముద్దు కుప్పాయి చూపులు సంబజ్జ గౌడ్ ను తాకాయి. చూపులతో ప్రారంభమైన వారి స్నేహం పౌర్ణమి నాటి రాత్రి వేళ అంజనాద్రి చెట్టు కింది కలయికకు నాంది పలికింది.

వెదజల్లే వెన్నెలలో
పరస్పర పొగడ్తల నడుమ
బిడియం సమసిపోయి

ఇరువురి హృదయాల్లో ప్రేమ అంకురించింది. ఇరువురి కుటుంబ చరిత్రను పంచుకొన్నారు.

సామంత రాజులు నన్ను వివాహం ఆడుతామని ప్రతిపాదించినా నేను ఒప్పుకోలేదు. సమాజ హితం కోరే నృత్య కళ అంటే నాకు ప్రాణం.

కళకు సంకెళ్లు పడటం నా మనసుకు నచ్చనిది. నీ గురించి తెలిసే ఈ నా నిర్ణయం అని ముద్దు కుప్పాయి నివేదించింది.

సమాజంలోని అంతరాలు పోవాలని ప్రబోధించిన కనక దాసరు అనుయాయి అయినా నా తండ్రి బైరప్ప గౌడ " నీ చుట్టూ ఉన్న నలుగురు సుఖమే నీ సుఖము" అని నాకు నేర్పాడని సంబజ్జ గౌడు వివరిస్తూ రాజు సైన్యములో చేరి రాజ్య రక్షణకు రమ్మన్నాడు. సైనికులకు భవిష్యత్తు అనిచ్చితం కదా మన పెళ్ళికి ఆటంకం అవుతుంది కదా అని ఆలోచించమంటాడు.

యుద్ధానికి
తక్షణమే వెళ్లండి.

అంతా మంచే జరుగుతుందని హితువు పలికింది. నేను నీ రాకకోసం, నీ సంకేతం కోసం శ్రీ నా రంగనాథ స్వామి దేవాలయంలో వేచి చూస్తాను అని ముద్దు కుప్పాయి చెప్పి శు భమస్తు అని నిష్క్రమించింది.

అలియా రామరాయలు సభా భవనంలో దొడ్డ సంకణ

నాయకతో సభ భవనంలో ప్రవేశించిన సంబజ్జ గౌడ్ "ఆజ్ఞ ప్రభూ! నీ ప్రాణం నాకు నా ప్రాణం అడ్డు అని ప్రమాణం చేస్తున్నానని వాగ్దానం చేసి అంతరంగికుడిగా అంగరక్షకుడిగా చేరాడు.

రాజ కొలువులో చేరిన సంబజ్జ గౌడకు ఇంటి వద్ద ఉన్న ముద్దు కుప్పాయికి పరస్పరం ఆలోచనలతో నిద్రలేని రాత్రులవుతున్నాయి. ఆనెగొందికి తిరిగి వచ్చినా సంబజ్జ గౌడ్ ముద్దు కుప్పాయి కలుసుకున్నారు.

నీవు లేకుండా వంద సంవత్సరాలు జీవించడం కంటే రేపు మరణించడం మేలు అని తన అంతరంగాన్ని ఆవిష్కరిస్తున్నప్పుడు ఆమెను సంబజ్జ గౌడ్ కౌగిలించుకుని నోటిని మూసి "నీలాంటి అమ్మాయిలు సరసాల కోసం కాకుండా ప్రేమ కోసం సృష్టించబడతారు" అని హృదయపూర్వకంగా హత్తుకుంటాడు.

పంచ పాదూషాల వల్ల

విజయనగర సామ్రాజ్యంపై

యుద్ధచ్ఛాయలు కమ్ము కున్నాయని వివరిస్తాడు.

యుద్ధం అనివార్యమైనప్పుడు వీరుడి కర్తవ్యం రాజ్య రక్షణయే కదా అని యుద్ధానికి పురికొల్పుతుంది ముద్దు కుప్పాయి.

ఒక స్త్రీ ఏ పురుషుడినైనా ప్రేమించి పెళ్లి చేసుకోదలిచితే అతన్ని తనకు భర్తగా ప్రసాదించాలని సిరిమాను మొక్కు చెల్లిస్తారని తెలిపింది. తాను సిరిమాను సేవ చేస్తానని మొక్కుకున్నానని అలా శ్రీ రంగనాథ స్వామికి మొక్కు చెల్లిస్తున్నానని తెలియజేసింది.

మరునాటి ఉదయం దేవాలయ ప్రాంగణంలో ఇనుపకొండిని వీపు చర్మం లోపలకు గుచ్చారు. సిడిని పైకి ఎత్తారు. ఆమె ఎడమ చేతిలో చిన్న బాకును ధరించింది. స్తంభానికి తగిలించి ఆమెను సిడిపైకి లాగాడు. ఆమె కొక్కెమునకు వేలాడుతుండగా జనం జయజయ ధ్వానాలు చేశారు. రక్తము కాళ్ళ పొడవునా కారుతున్నా ఆమె ఏ మాత్రం బాధను ప్రదర్శించడం లేదు. దైవస్మరణ చేస్తూ ఎడమ చేతిలోని బాకుని తిప్పుతూ కుడి చేతిలో నిమ్మకాయలను తన ప్రియుడు సంబజ్జ గౌడ్ పైకి విసురుతుంది.

ఆ వేడుకను చూస్తున్న సంబజ్జ గౌడ్ కి ఏకకాలంలో దుఃఖము సంతోషమూ, విస్మయం కలిగింది.

అలియ రామరాయల రాజ్యంలో సకల మర్యాదలు అనుభవించిన రాయబారి ఆలీ ఆదిల్ షాకు ఇస్లాం పై గౌరవం లేదని విజయనగర సామ్రాజ్యంపై దండెత్తాలని విద్వేషాలు నింపారు. అహ్మద్ నగర్ బీదర్, బీరార్, గోల్కొండ మొదలగు పంచపాదుషాలు విజయనగరం పై యుద్ధానికి సిద్ధమయ్యారని వేగుల సమాచారం అందగానే యుద్ధానికి సన్నద్ధమయ్యారు.

తాను వలందిని అని ఒక యవ్వనవతి పరిచయం చేసుకొని మనసిప్పి మాట్లాడుతూ విజయనగర సామ్రాజ్యంలో వ్యభిచారం అధికారికమని, మేము రాజుకు పన్ను చెల్లిస్తాం. మా నుండి వచ్చే ఆదాయాన్ని సైన్యానికి జీతం ఇచ్చేందుకు రాజు వినియోగిస్తున్నారు. యుద్ధం అంటేనే మేమంతా వణికిపోతాం. కళ్యాణి ముట్టడి సమయంలో యుద్ధానికి ఐదు లక్షల మంది సైనికులు బయలుదేరితే మా వారు ఇరువై రెండు వేలమంది వారిని అనుసరించారట. రాత్రుల్లో సైనికులకు సుఖాన్ని ఇవ్వటమే మా పని. అట్లా అంతమందికి ఈ కొద్దిమంది సరిపోతారా? యుద్ధం మాకు ప్రత్యక్ష నరకం అని హృదయ విదారకంగా నివేదించింది.

సున్నిత మనస్కురాలైన వలంది ఎలా పరిస్థితులు ఎదుర్కోగలుగుతుందో అనే ఆలోచనతో ఆ రాత్రి నిద్ర రాలేదు. మొదటిసారిగా యుద్ధం ఆగితే బాగుంటుందని సంబజ్జ గౌడ్‌కి అనిపించింది.

అలియరామ రాయలకు ఆలోచిస్తుండగా సంగతి మహల్లోనే నిద్రించినప్పుడు అజ్ఞాత వ్యక్తులు తన చెవి కమ్మల నుండి ముత్యాలను బలవంతంగా తీసుకువెళ్లినట్లు కలలోంచి ఉలికి పడి లేచాడు. విస్మయం పొందాడు. పండితోత్తములను సంప్రదించి వివిధ దోషాల నిమిత్తం సంహరించే పూజలు గావించాడు. పిమ్మట ఆస్థాన పండితులు విజయలక్ష్మి మిమ్ములను తప్పక వరిస్తుందని నమ్మకం కలిగించారు.

సంబజ్జ గౌడ్‌ను, వలందిని యుద్ధమునకు సాగ నంపుటకు ముద్దుకుప్పాయి మైదానంలోకి వచ్చింది. మీరు ముందు మనసును గెలవాలి. మనసుపై విజయం మీ విజయానికి మొదటి మెట్టు అని ముద్దుకుప్పాయి ప్రేరేపించి శుభ వచనాలు అందించింది. ముద్దుకుప్పాయి చూపుతున్న ప్రేమకు వలందికి కన్నీళ్లు వచ్చాయి. నేను, సంబజ్జ గౌడ క్షేమంగా తిరిగి వస్తామని హామీ ఇచ్చి ముందుకుప్పాయిని వలంది సాగనంపింది.

రాక్షస తంగడి గ్రామాల మధ్య యుద్ధం ప్రారంభమైంది. తొంభై ఏళ్లు పైబడ్డా ముప్పై ఏళ్ల యువకుడి ధైర్య సాహసాలు ప్రదర్శించే రాజు అలియ రామరాయులుకు రక్షణ కవచంగా సంబజ్జ గౌడ్ ఉన్నాడు. ఒకనాటి సాయంత్రం యుద్ధ విరమణ అనంతరం పరిసరాలు గమనిస్తుంటే మద్యం, మాంసం, మగువలతో సైనికులు మునిగి తేలుతుంటే వలంది గుర్తుకొచ్చి ఆమె దగ్గరికి వెళ్ళాడు. అప్పటికే శుష్కించిన దేహంతో మరణ పడకపై ఆయాస పడుతున్నది. మీరు రేపు ఉదయాన్నే యుద్ధానికి వెళ్లవలసిన వారు వెళ్లి విశ్రమించండి.

మీరు యుద్ధ విజేతలవుతారు. వలందిని చూసి సంబజ్జ గౌడ్ దుఃఖపడతాడు. మీకోసం ముద్దుకుప్పాయి ఎదురు చూస్తుంటుంది. జాగ్రత్త అని చెప్పి పంపిస్తది.

పాదుషాల ఫిరంగుల ధాటికి తట్టుకోలేక అశేషమైన విజయనగర సైన్య సమూహం రాలిపోతున్నది. ఫిరంగులు బలి తీసుకుంటున్నాయి. తిరుమల రాయల ఎడమ కంట్లో ఆదిల్షా సైనికుడు ఒక్కడు బరిసె దింపాడు. పక్కకు తీసుకెళ్లి తిరుమల రాయలకు హుటాహుటిన వైద్యం అందించారు.

ఒక దళవాయి దూసుకొరావడానికి గమనించిన అలియా రామరాయలు పెద్ద కుమారుడు కృష్ణప్ప యుద్ధంలో మరణించిన విషాద వార్త విన్నాడు. సంబజ్జ గౌడు వారిస్తున్న వినకుండా అంబారి దిగాడు అలియరామరాయలు. ఒక ఏనుగు పిచ్చి పట్టినట్లు ఆలయ రామరాయలు అంగరక్షకుల పైకి దూసుకెళ్లింది. అలియరామరాయులకు ఏనుగు మధ్య సంబజ్జ గౌడ్ దూరి రాజును తప్పించాడు. తొండాన్ని పట్టుకున్న సంబజ్జ గౌడను పది అడుగుల దూరం విసిరింది. బంతిలా తన్నింది. కళ్ళు బైర్లుకమ్ముతున్నాయి. పంచభూతాల సాక్షిగా నిన్ను వివాహమాడుతానని మాట ఇచ్చిన ముద్దు కుప్పాయిని స్మరించుకుంటుండగా కళ్ళు మూతలు పడ్డాయి. ఆ తర్వాత నిజాం పాదుషా పొడవాటి కత్తితో అలియా రామరాల తలను ఒక్క వేటుతో చంపేశాడు. ఫిరంగి గుండు పేల్చుతున్న బీజాపూర్ సైన్యాలకు పెమ్మసాని ఎర్ర తిమ్మానాయుడు గమనించి తిరుమల రాయల్ని కాపాడుతూ చనిపోయాడు. క్రమక్రమంగా విధ్వంసం జరిగి హంపి పాడు పడిన హంపిగా మారింది.

సంబజ్జ గౌడ్ ను స్మరించుకుంటూ ముద్దుకుప్పాయి విరహవేదనతో ఉంటున్నప్పుడు తన తల్లి సూచన మేరకు సంబజ్జ గౌడ్ త్యాగాన్ని పరులహితం కోరే అతడి గుణగణాలను కీర్తిస్తూ నృత్యరూపకాన్ని రూపొందించడానికి శ్రీకారం చుట్టింది.

యుద్ధంలో పట్టుబడిన విజయనగర సైనికులతో బీజాపూర్ కు పశ్చిమ భాగంలో ఆలీ ఆదిల్షా తన భార్య చాంద్ బీబీ స్మారకార్థం చాంద్ బావి(డి)ని తవ్విస్తున్నాడు. పర్యవేక్షుడు ఫారుకి కొంత దయా గుణం గలవారు. ఫారుకికి సల్మా అహ్మద్ తో మాట్లాడడం ఆనందంగానూ ఆధ్యాత్మికంగానూ, తాత్వికంగానూ ఉంటుంది. ఒకనాడు ఫారుకి నీ పూర్తి వివరాలు చెప్పమని అడిగాడు. నా పేరు సంబజ్జ గౌడ్ మాది ఆనెగొంది. నేను అలియ రామరాయుల అంగరక్షకుడిని అంటూ తన విషయాలన్నీ చెప్పడం ప్రారంభించాడు. ముద్దుకుప్పాయి నేను ప్రేమించుకున్నాం. మధ్యలో యుద్ధం రావడం వల్ల మా వివాహం వాయిదా పడిందనీ వివరిస్తాడు.

కళంకం లేని ప్రేమ ఎల్లప్పుడూ ఒక మార్గాన్ని కనుగొంటుంది. నీ ప్రేమ తప్పక విజయాన్ని సాధిస్తుందని చెప్పాడు.

తోటలో పూలు కోస్తున్న ముద్దుకుప్పాయితో ఒక దళవాయి సంబజ్జ గౌడ్ బీజాపూర్ లో ఉన్నాడని వివరము చెప్పాడు.

ముద్దుకుప్పాయి బృందం బీజాపూర్ చేరుకొని నృత్య ప్రదర్శన చేస్తామని పాదుషా గారి ద్వారా ఆనతి పొందినది.

నాయికా నాయకకు జరిగిన ఎడబాటు గురించి ప్రేక్షకులందరికీ కళ్ళు చెమర్చుతుండగా ప్రదర్శన ముగిసింది. ప్రదర్శన వీక్షించిన ఆలీ ఆదిల్షా హృదయం బరువెక్కింది. రూపకం తన మనసును కలిగించిందని కొనియాడాడు. కరుణరస ప్రధానమైన నృత్య ప్రదర్శకం ప్రేక్షకులనందరిని ఆకట్టుకుంది. కానుకలతో కళాకారులను గౌరవిస్తామని ఆదేశాలు ఇచ్చి అక్కడి నుంచి నిష్క్రమించాడు. మరుసటి రోజు ఉదయం రాజుయొద్దకు వచ్చిన కళాకారులతో కథానాయక అభినయం అమోఘం. నీ రూపకం నన్ను అంతలా లీనమయ్యేట్లు చేసిందని ఆ పాత్రకు జీవం పోసావని మెచ్చుకున్నాడు.

ముద్దు కుప్పాయి మహారాజా మమ్మల్ని క్షమిస్తామంటే ఒక విన్నపం చేసుకుంటామని అర్థించినది.

తప్పక తీర్చగలం ఏంటో చెప్పండి అని రాజు అడగగానే ప్రదర్శించిన నృత్య రూపకం నా జీవితమే. నాయకుడు ఎక్కడో లేడు మీ ఆధీనంలోనే ఉన్నాడు. చాంద్బావిడి తవ్వకం బాధ్యతలో ఉన్నాడు. ప్రజల దాహం తీర్చడం కోసం మీరు చేస్తున్న మహాకార్యంలో సంతోషంగా పాల్పంచుకుంటున్నాడు. దయచేసి విముక్తి చేయండి అని దీనంగా వేడుకుంది

సైనికుల ద్వారా సంబజ్జ గౌడ్ కు రాజు వద్ద నుంచి కబురు వచ్చింది అన్నాడు ఫరూకి.

ఈ బావి తవ్వడం పూర్తిగా గాని మిమ్మల్ని కూడా మీ ప్రాంతాలకు పంపుతామని ప్రకటించాడు.

సంబజ్జ గౌడ పరుగున వచ్చి ముద్దుకుప్పాయి కౌగిలించుకున్నారు. ఆనందభాష్పాలతో తడిసిపోయారు. వీరిద్దరిని చూసిన మిగతా వాళ్లందరి కళ్ళలో నీళ్లు వచ్చాయి.

కన్నీళ్లు తుడుచుకుంటూ ముద్దుకుప్పాయితో ఈయన సల్మా అహ్మద్ ఫారుకి మనకు జీవిత బిక్ష పెట్టిన మహానుభావుడు అని పరిచయం చేసాడు.

నేను, సంబజ్జ మీకు ఆజన్మాంతం రుణపడి ఉంటా మంటూ ఉద్వేగంతో చెప్పింది.

తన కాళ్ల మీద పడిన ముద్దుకుప్పాయిని లేపుతూ సోదరి అల్లాహ్ ఉన్నాడు కాబట్టే అనుకున్నది జరిగింది మీరు ఒకరినొకరు నిష్కల్మషంగా ప్రేమించుకున్నారు. ఆ ప్రేమే మిమ్మల్ని ఒకటిగా చేసిందని, దీనిని అల్లా అసాధ్యాన్ని సుసాధ్యం చేశాడు. నాకు సోదరులు లేరు. మా వివాహానికి తప్పక రాగలరు. అని ముద్దుకుప్పాయి చెప్పగానే నీవు నాకు అల్లా ప్రసాదించిన సోదరివి అని మాట ఇచ్చారు. వివాహానంతరం అనతి కాలంలో పుట్టిన వారి గారాలపట్టికి వలంది అని పేరు పెట్టారు.

**వర్ణన:** రచయిత మారుతి పురోహితం పరిస్థితులకు అనుగుణంగా వర్ణన గావించి పాఠకులకు ఆసక్తి కలిగించాడు. రచయితగా తాను చెప్పదలచుకున్న అంశాన్ని ఉన్నతీకరించి వ్యక్తీకరించారు. కొన్ని, కొన్ని సందర్భాల్లో వారు వ్యక్తీకరించిన వ్యాఖ్యలు అద్భుతంగా ఉన్నాయి. రచయిత వ్యక్తీకరించిన అభిప్రాయాలను విస్తృతంగా రాయవచ్చు.

**పాత్రోచిత సంభాషణ:** ప్రతిపాత్రకు రచయిత సముచిత స్థానం కల్పించాడు. ఈ పాత్రకు ఎంత నిడివి కేటాయించాలో అంతే నిడివి కేటాయించారు. అలియ రామరాయలు, సంబజ్జ గౌడ్, ముద్దు కుప్పాయి, నాగసాని, వలంది, ఆలీ ఆదిల్షా పంచపాదూషాల సంభాషణ, ఫారుకి ప్రతి పాత్రకు తగిన విధంగా సంభాషణలు రసవత్తరంగా చిత్రీకరించారు. ఆ సంభాషణలలో జీవం ఉట్టిపడే విధంగా చాతుర్యాన్ని ప్రదర్శించాడు.

**ప్రణయ హంపిలోని సామాజిక పరిస్థితులు:** కాల్పానిక చారిత్రక నవలే అయినా సమాజంలోని వివిధ ఆచారాలు, సంప్రదాయాలు, కట్టుబాట్లు, విలువలు, మొదలైనవి గమనించవచ్చు. రాజరిక ఠీవి ప్రదర్శించడం. దొడ్డ సంకన అలియరామరాయల పాదాన్ని ముద్దు పెట్టుకోవడం ప్రభు భక్తి ప్రదర్శనకు పరాకాష్టగా ఆవిష్కరించబడ్డది. అంగరక్షకులు నాలుగు రకాల కొలువులు రాజు వారికి చేస్తారని వివరించ బడింది. అత్యంత క్లిష్టమైన సిరిమాను సేవను ముద్దుకుప్పాయి నిర్వహించిన తీరును నాటకీయంగా రచయిత మలిచాడు.

**మతము – సంస్కరణ:** పరమాత్ముని దృష్టిలో మానవుల మధ్య అంతరాలు లేవని తెలియజెప్పడం భక్తి ఉద్యమం యొక్క ప్రత్యేకత. కనక దాసరి సమాజంలో అంతరాలు పోవాలని ప్రబోధించాడు. కనుక దాసరికి ఆలయ ప్రవేశం నిరాకరించినప్పుడు గోడలు కూలి, విగ్రహ రూపంలో ఉన్న దైవమే ఆయన వైపు తిరిగినట్లుగా ఈ నవలలో చూస్తాం. ఇది దళితుల భక్తికి అత్యంత ఉన్నతీకరణగా చెప్పవచ్చును. కనక దాసరు అనుయాయి బైరప్ప గౌడ్ కుమారుడే సంబజ్జ గౌడు.

**తారతమ్యాలు – పరిష్కారం:** శూద్రులు బ్రాహ్మణుల మధ్య ఉన్న తారతమ్యాన్ని రాగి పిండి బియ్యప్పిండి రెండు పోట్లాడుకున్న వైనాన్ని పోలికలతో తేల్చి చెప్పుతూ సమాజంలో అందరూ సమానమే అందరితో అందరికీ అవసరాలు ఉంటాయి కాబట్టి మనుషుల మధ్య తారతమ్యాలు ఉండకూడదు అని చెప్పబడ్డది.

**బహుజన తత్వం:** సమాజంలోని అతడు బడుగు బలహీన వర్గాల వారు అందరూ బహుజనులే. సంబజ్జ గౌడ్ నవల నాయకుడు. కథానాయకి ముద్దుకుప్పాయి ఒక నృత్య కారిణి. ఆనాటి వ్యవస్థలో వ్యభిచారం గురించి వివరించడం అంటే సమాజాన్ని చిత్రించడమే.

**పరమత సహనం:** భారతదేశ హిందూ సంప్రదాయ బద్ధమైన దేశమే అయినా ముస్లిం పాలకులు పరిపాలించడం వల్ల వారి ప్రభావం ఈ సమాజంపై సమర్థవంతంగా ఉంది. మహమ్మదీయుల ఆచారాలు, పరిస్థితులు గౌరవించారని చెప్పడానికి ఉదాహరణ: మహమ్మదీయులు అవిశ్వాసులకు అభివాదం చేయరనే ఎరుకతో అలియరామరాయులు తమ సింహాసనం పక్కన ఒక బంగారు ఆశను దీవించి ఆ ఆసనంపై పవిత్ర ఖురాన్ ఉంచాడు. ముస్లింలు వ్యక్తులకు అభివాదం చేయడంలో తమ పవిత్ర గ్రంథానికి అభివాదం చేశామని భావన కల్పించడం కొరకు ఏర్పాటు చేశాడు.

త్రిపాదుషాల కుట్రలు మొదలైనవి వర్ణించబడ్డాయి.

వేశ్యలు తమ శరీరాలను అమ్ముకోరు. తమ శరీరాలను అద్దెకిస్తారు. నిత్య సుమంగళులు. మాకు వివాహాలు ఉండవని వలంది మనోగతం ఆవిష్కరించడం ఆనాటి పరిస్థితులకు ప్రతిబింబం. వేశ్యలందరూ దేవదాసీలు కారు. కానీ దేవదాసులు అందరూ వేశ్యలే అని వాస్తవాన్ని తెలియజేశారు. వ్యభిచారం స్వీకరించేందుకు ముద్రాదికోత్సవం అద్దం చూపడం అనే మతపరమైన ఆచారాన్ని ఆనాటి రోజుల్లో నిర్వహిస్తారని, ఈ కార్యక్రమానికి వేశ్యలందరూ హాజరవుతారని వివరించారు. యుద్ధం అంటే వేశ్యలు వణికిపోతారని వలంది మాటల్లో మనం వింటాం.

యుద్ధ సన్నద్ధతను తెలిపే శబ్దాలు శంఖు, కహళ, డక్కా దిక్కులు పిక్కటిల్లేలా మ్రోగడం మొదలైనవి కనబడుతుంటాయి. యుద్ధాలు మోసం పైనే ఆధారపడి ఉంటాయి జాగ్రత్త అని ముద్దు కుప్పాయి చెప్పడం యుద్ధాల్లో మోసాలు ఉంటాయని వ్యక్తీకరించడమే. ముప్పైఆరు రకాల పన్నులు కట్టించుకుని కనీస బాధ్యత లేకుండా ఎవరి దారి వారు చూసుకుంటే ఎలా అని హంపిని విడిచి వెళ్లి పోతున్న వారిని ముసలి వాళ్లు శాపనార్థాలు పెట్టడం ఆనాటి ఓటమి అనంతర పరిస్థితులకు దర్పణంగా నిలిచాయి.

యుద్ధంలో ఓడిపోయిన వారిని చెరపట్టడం సర్వసాధారమని చెరపట్టబడిన సైనికులతో వెట్టి పని చేయడం అతి సామాన్య విషయమని నాటకీయంగా ప్రదర్శించబడ్డది. ఈ నవలలో బడుగు బలహీన వర్గాల పరిస్థితులను ఇంకా చిత్రించాల్సి ఉంటే ఇంకా బాగుండేదనిపించింది

సమాజ హితం కోరిన ఇద్దరు యువతీ యువకులు తమ ప్రణయాన్ని దేశం కోసం అంకితం ఎలా చేశారో వివరించబడడం మనం చూడవచ్చు. ఈ నవలను చక్కగా తీర్చిదిద్దిన రచయిత మారుతి పౌరోహితం గారికి అభినందనలు.

**★ రచయిత: ఉపాధ్యాయుడు** T

# బతుకుమడి

పేర్ల రాము

వానచినుకులు
లోపలి సారాన్ని తడుపుతుంటాయి
సాలు ఇరువాలు దున్నుతూ
ఆశల పెళ్ళలను మేల్కొల్పుకుంటాం

వడ్లు నానబోసి మొలకలొచ్చాక
నారుమడిలో చల్లడమంటే
మా కలలు మొలకెత్తడమే!

మడి మడికి నీళ్ళు పారించి
వరాలు చెక్కుకోవడమంటే
తెలియక పెరిగిన
లోపలి అహంకారాన్ని చెక్కుకోవడం

వరాలు పూయడమంటే
జీవితానికి పడిన
గండ్లు పూడ్చుకోవడం

బురదగొఱ్ఱు తిప్పడమంటే
లోపలి ఎత్తుపల్లాలను సమానం చేసి
అబద్దాల తుంగను
ఏర్లతో సహా తీసిపారేయ్యడం

నాటేసే రోజు
సూర్యుడు మా బువ్వగిన్నెల
మీద నుండే ఎక్కి వస్తాడు
నాటేసే రోజొస్తే
మాకు పప్పుచారు పండుగ
నాటు రోజు బడికి మేము పోము
మా వంతుకు సెలవు చీటీనే వెళ్తుంది

మడికట్లకు పచ్చని చీర కట్టడానికి
తల్లులంతా గోచీలు చెక్కి
అందమైన రాగమెత్తుకుంటారు
మీమైతే నారు బత్తలెత్తుకుని

వెనుకెనుకె తిరుగుతూ బురదలో
గడ్డకట్టిన ద్వేషాన్ని కడుకుంటాము

తడారిపోకుండా రోజు నీళ్ళు బెట్టి
గండ్లు పడకుండా చూడడం
పొలాల్లో ఏ పురుగు వాలకుండా
చూసుకోవడమంటే
బతుకుమడిని
పురుగు ముట్టకుండ కాపాడుకోవడం

పొలం పొట్టకొస్తుంటే
కళ్ళల్లో నీళ్ళు ఉవ్విళ్లూరుతుంటాయి
ఊపిరి నాడీ మరింత కొట్టుకుంటుంది

కోసిన మెదలు తడిస్తే
గుండె చెరువు అలుగందుకుంటుంది
కల్లంలో గింజలు రాలితేనే
బతుకు ఆరోగ్యంగా వుంటుంది
లేకుంటే
మొనబోయిన గడ్డపార అవుద్ది
మొక్కిలి పోయిన గొడ్డలిగా మారుతుంది

నాటేసినప్పుడున్న ఆనందమే
వడ్లు తూర్పార పట్టేటప్పుడు
కొలకుండతో రాశిని కొలుస్తున్నప్పుడు వుంటేనే
మా జీవితానికి
రెక్కలొచ్చినట్లు లేకుంటే
మడికట్లలో చెట్లకు వేలాడుతునట్లు!

మీము పొలం మడుల్లోనే
జీవిత వ్యాకరణం నేర్చుకుంటాం
ఎత్తులు దిగుడులను అర్థం చేసుకుంటాం
పొలాలు తడుస్తునంత కాలం
మా బతుకుల్లో నదులు బతుకుతాయి
పొలం మడులే
మీం జీవిస్తున్నట్లు సాక్షాలు

T

RNI Number: APTEL/2011/37247 ISSN 2349-2376



# Send Child To School

Address for communication

Editor,
Nadusthunna Telangana
Flat no.301,
vaishnavi smart apartments,
street no.2, Kakateeya Nagar,
Habsiguda, Hyderabad-500007